శతకమంజరి

రచయిత :

శ్రీ కొనూరి లింగమూర్తిగారు

894.8271
LIN

ప్రచురణకర్త :

కొనూరి దావెూదరయ్య

Ci

AOUA103B133

శతకమంజరీ

రచయిత:

శ్రీ కానూరి లింగమూర్తిగారు

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY

N10538

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.
10538

ప్రచురణకర్త:

కానూరి దామోదరయ్య

ద్వితీయ ముద్రణ 1955

T
894.8271
LIN

వెల్డన్ ప్రెస్స్,
మద్రాసు -21.

2

కీర్తిశేషులయిన

శ్రీ కానూరి లింగమూర్తిగారు.

కవిజీవితము

—:o:—

కానూరి లింగమూర్తి యనునీకవి కమ్మకులస్థుఁడు. కమ్మ వారిలో కవిత్వరచనాధోరణియందు ప్రవేశించినవారిలో నీతఁడే ప్రథముఁడనవచ్చును. ఈ కవికాఁపురము కృష్ణామండలములోని గుడివాడ తాలూకాయందలి గౌతమవరము (కౌతరం) గ్రామము. తండ్రిపేరు రామయ్య. తల్లి బాపమ్మ. ఇతఁడు క్రీ. శ. ౧౮౨౨ సంవత్సరమునందు జన్మించి యుండును. కౌతరము గ్రామమునందు భూస్థితి కలిగియుండి వ్యవసాయవృత్తివలన యోగ్యతతో కాలక్షేపము చేయుసత్కుటుంబమునందు జనించినయీకవి చిన్నతనమునుండియు పండితసహవాసమునందును, కావ్యపురాణశ్రవణపఠనాదులయందును నభిరుచి కలిగి భాషా వైదుషి కలిగించుకొని క్రమేణ కవిత్వరచనయందు సామర్థ్యము కలవాఁడయ్యెను. మొదటినుండియుఁభగవద్భాగవతగుణానుభవము నేయుచు విష్ణుభక్తిపరాయణుండైనయీ కవి తొలుదొల్త పిన్నవయస్సునందే "జానకీపతి" యనుమకుటముతోఁ జంపకోత్పలవృత్తములచేఁ బొలుపగు నొకశతకమును రచింపఁ జొచ్చెను. పదపడి ౧౮౨౨ సం. ప్రాంతముల నీ కవికి దేహములో రుగ్మత యేర్పడినది. ఆ కాలమున కవిత్వరచనయందు మఱికొంత ప్రావీణ్యము కలిగి రుగ్బాధచే నన్యవ్యాపారములు మాని యుండుటచే భక్తపరాయణుండగుశ్రీ నారాయణునియందు నైలధారావచ్ఛిన్నభక్తిభావనచేఁ బరిపోషితకవిత్వధారావిశేషుండై భగవద్గుణానుభవమువలన భక్తిరసైకప్రధానంబుగా కవిత్వ మల్లి ౧. కేశవశతకము. ౨. నరసింహశతకము. ౩. ఖగతురంగతారావళి. ౪. వేంకటేశ్వరషోడశాష్టపది. ౫. వేంకటేశ్వరాష్టకము. ౬. భక్తామృతము అనుగ్రంథముల వ్రాసెను.

కవిత్వశైలి మధురముగను బహుతరముగ నిర్దుష్టసంస్కృతపద భూయిష్ఠముగను నుండును. బహుకాలగురుకులవాసక్లేశమున కోర్చి సాధించినవైదుషీవిశేషము గలమనీషులకు గూడ గోచరించనికల్పనలు, ప్రయోగములు నీ కవికిఁ బూర్వపుణ్యవశంబునను భగవత్కరుణావైభవంబుచేతను జేయలంతులై లభించెను.

ఈ కవి భగవంతునియందు తనకుఁ గలభక్తివిశేషము కేవల కవిత్వరూపముననే వెల్లడించుటయే గాక కౌతరము (గౌతమవరము) నందు వేంచేసి యున్న శ్రీ కేశవస్వామివారి యాలయమునకుముందు మిక్కిలి రొక్కము వెచ్చించి తాలోన్నత మగుగోపురము, ధ్వజము, ప్రాకారము మొదలగునవి స్థాపించి శాశ్వతకీర్తిని సంగ్రహించె.

ఇట్లు తన తనుమనోధనముల భగవత్పరాయణత్వమునందు సార్థకపఱచి కృతార్థు డనదగినయీ కవియొక్క కవిత్వశైలి దెలియుట కా గ్రంథములనుండి యొక్కొక పద్యమును వ్రాయుచున్నాము.

ఉ. వారిధిచెంతఁ జేరి తనవారిని బాసి విభీషణుం డహో
తారకనామ రామ తమదాసునిగాఁ గృపఁ జూచి కావవే
క్రూరుఁడ రావణానుజుఁడఁ గోరితి మీ శరణం బటన్న స
త్కారము మీఱఁగా నభయదాన మొసంగితి జానకీపతీ !

[జానకీపతిశతకము]

క. ఏదిక్కు లేదు నా కిఁక
నీదిక్కే దిక్కు గాక నిఖిలజగములం
దేదిక్కు వెనుక ననుఁ గా
చేది క్కొకరైన లేరు శ్రీనరసింహా :

[నృసింహశతకము]

సీ. తావకపదవారిపావనాతిశయంబు
సర్వజ్ఞుఁ డైనట్టిశంభు డెఱుఁగు
నీనామమహిమ దా నెఱుఁగక తలఁచిన
మేదినీసురుఁ డజామీళుఁ డెఱుఁగు
మీపదాంబుజరేణుమేటిప్రభావంబు
గౌతమమౌనీంద్రుకాంత యెఱుఁగు
మీదయామహిమంబు మీ కపకారి యై
శర ణన్నకాకరాక్షసుఁ డెఱుఁగు

గీ. దాసపరతంత్రుఁ డని నిన్నుఁ దథ్యముగను
వాసి మీఱినమౌనిదూర్వాసుఁ డెఱుఁగు
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ !

[ఖగతురంగతారావళి]

ఉ. కూటువ లై సురాసురు లకుంఠితు లై మనఁ బాలవెల్లిపై
నోటమి లేక మందరము నుంచి మథింపఁగ నద్రి మున్గి పె
ల్లోటమిఁ జెంది కుయ్యిడఁగ నోడకుఁ డంచుఁ గృపారసంబు బా
హాటము గాఁగఁ జూపి కమఠాకృతిఁ దద్గిరి నెత్తితౌ భళీ
హాటకచేల భక్తపటలాఘవిపాటనకేళిలోల నీ
సాటిప్రభుండు గల్గమి నిజంబు సరోజభవాండకోటి ము
మ్మాటికిఁ నెంచి చూడ ననుమానము లేదు నిశాటజీవితో
చ్చాటనకోటిసూర్యనిభచక్రధరా హరి వేంకటేశ్వరా !

[వేంకటేశ్వరసుప్రభాతపది]

గీ. శంఖచక్రగదాభయచారుహస్త
కమలకమలాప్తకోటిసంకాశతేజ

శరణు దీనైకరక్షణ శరణు శరణు
సంకటవినాశ ప్రోవుమి వేంకటేశ !

[వేంకటేశ్వరాష్టకము]

క. కొండలు వారాశిపయిం
జెండులుగాఁ దేల్చ దనుజసేనలఁ జంపం
గొండల నుండెడికోఁతుల
తండంబుల కగునె నీదుదయ లేకున్నన్ !

[భక్తామృతము]

5-11-04, కౌతరము. } నందగిరి. వెంకటప్పారావుపంతులు.
అడవి. సాంబశివరావుపంతులు.

శ్రీ నరసింహశతకము

కవితాశైలి మిన్నగ నున్నయది. భక్తిరసం బవికలగతిఁ గన్పట్టు చున్నది. సాంస్కృతికసంస్కారము లేనికొఅంత దోఁపకుండ రచనా ప్రౌఢిమ వెల్లడించినగ్రంథకర్త విద్వజ్జనాదరణపాత్రుఁ డగుటకు సంశయం బిసుమంతయుఁ గానరాదు. చ్యుతసంస్కరణం బొనర్చి ముద్రా పణంబు గావించినచో భక్తపరాయణుల కెల్లఁ బారాయణ మగు నని నొక్కి వక్కాణింపఁగలము.

4-12-1898, గౌతమవరం. } ఇట్లు హితోపదేశి,
నందగిరి. వేంకటప్పరాయశర్మ.

కేశవశతకము, ఖగతురంగతారావళి.
శ్రీ దాసు శ్రీరాములుచే పరిష్కరింపఁబడినవి.

———

పీఠిక

ఈ శతకములను రచియించిన మా తండ్రిగారు ఎనిమిది సంవత్సరములక్రిందట స్వర్గస్థు లైరి. ఆయన తనజీవితాంతమున పదునారు సంవత్సరములు నరముల సంబంధ మగువ్యాధిచే బాధితుఁడై మంచములో నున్నసమయమున ఈపద్యములను అప్పుడప్పుడు స్వాధీనములు గాక బలహీనము లైనచేతులతో వంకరటింకర యక్షరములతో వ్రాసి తరువాత వానిని మాకుఁ జెప్పి వ్రాయించుచు వచ్చిరి. ఈయన సంస్కృత భాషయందు సామాన్యముగను ఆంధ్రసాహిత్యమునందు కొంచె మధిక ముగను పరిచయమును అభిరుచిని గలిగి యుండిరి. రథబంధ, నాగబంధ, ఖడ్గబంధాది బంధకవిత్వమునం దేమి, శ్లేషాదిచిత్రకవిత్వ రచనయం దేమి వీరికిఁ జాల యిష్టము. దానధర్మాది పరోపకారములందును, పురాణ శ్రవణాది సత్కాలక్షేపములయందును, భక్తిశ్రద్ధలలో దేవోత్సవములను జేయుటయందును, భాగవతాచార్యకైంకర్యములయందును తమ జీవితమును గడపిరి. మా గ్రామములోని కేశవస్వామివారి గోపుర ప్రాకార ధ్వజప్రతిష్ఠాపనాదులను ఆయన అనారోగ్యదశలో నున్నప్పుడే పట్టుపట్టి పూర్తి జేయించిరి. ఈయన తండ్రిగారును, తాతగారును గొప్పవిష్ణుభక్తు లై భగవత్కాలక్షేపముఁ జేయుచుండెడివా రట. వీరి తాత యైనసీనయ్యగారు సత్యసంధతయందును, ధర్మనిరతియందును చుట్టుప్రక్కల గ్రామములలో కెల్ల ప్రసిద్ధి కెక్కి గ్రామసరిహద్దు తగాదాలకు సమాధానకర్త యని పేరొందెను. ఈయన శత్రువు లైనను నీయననే తీర్పరిగా కోరుకొనెడివా రట. ప్రపితామహు డగుఅనంతనాదుగారును, ఆయన సోదరులును తటాకారామాది ధర్మప్రతిష్ఠాపస్థాపకు లై వన్నె కెక్కిరి. ఇప్పటికిని కవుతర గ్రామములోని కొత్తచెరువు మొదలగునవి వారి కీర్తిని చాటుచున్నవి. ప్రప్రపితామహు డగువేంకటపతిగారు ఆ కాలమున గ్రామపురోవృద్ధికొఱకై పాటుపడిన చరిత్రలును,

బందిపోటు గుంపులనుండి గ్రామమును రక్షించినకథలును ఈ వంశమునకు మూలపురుషు డైనజంగమునీడుగారు సుమారు మూడువందల సంవత్సరములక్రిందట నొక బ్రహ్మరక్షస్సునకు భగవద్గీతాకాలక్షేపము వలన జన్మవిమోచన గలిగించినకథలును ఇప్పటికి వృద్ధానుశ్రుతముగా వచ్చుచున్నవి.

ఈ శతకములను అచ్చు వేయించుటకు నెనిమిది సంవత్సరముల నుండి ప్రయత్నించుచుంటిమి గాని యనేకవిఘ్నములు తటస్థించి మా కోర్కె సఫల మైనది. ఇందలి జానకీపతిశతకము మాత్ర మాయన బాల్యదశయందు వ్రాయబడినది. ఆయన చిన్నతనములో వ్రాసిన శృంగారపద్యముల పుస్తక మొకటి ప్రాతకాగితముల కట్టలో మాకు లభింపగా మావద్దనుండి యాయన దానిని తీసికొని చింపి వైచిరి. ఈ గ్రంథమునందు ముద్రణ దోషములను చదువరులు దయతో మన్నింతురు గాక.

ఇట్లు

కవుతరం, కృష్ణాజిల్లా,
10-4-1920.

కానూరి. వేంకట చలపతయ్య.
కానూరి. దామోదరయ్య.

—:o:—

VII

ద్వితీయ ముద్రణ

ప్రీతిక

తెలుఁగుసాహిత్యము నిన్న మొన్నటిదాఁక బ్రాయికముగా సంస్కృతము నాశ్రయించిన యనువాదసాహిత్యముగానే వెలసినది, వర్ధిల్లినది. కాని యప్పుడప్పుడు తెలుఁగునఁ గొన్ని స్వతంత్రరచనము లును వెలయక పోలేదు. ప్రాచీనకాలమున వెలసినశతకము లట్టి స్వతంత్రరచనములే యని చెప్పఁదగును.

క్షుద్రప్రబంధములలో నొకటిగాఁ ప్రాచీనలాక్షణికులచేఁ బేర్కొ నఁబడిన 'శతకము' నేఁ డొక విశిష్టవాఙ్మయశాఖగా రూపొందినది. తెలుఁగున స్వతంత్రకావ్యరచనకుఁ బ్రథమాచార్యుఁ డనఁదగిన పాల కురికి సోమనాథుని 'వృషాధిపశతకము'తో నారంభ మయిన శతక ప్రబంధనిర్మాణమును దరువాతికవు లనేకులు చేపట్టి వర్ధిల్లఁజేసిరి. క్రొంగ్రొత్తసాహితీరీతులతో నభ్యుదయపథమున ముందునకు సాఁగి పోవుచున్న యీకాలమునఁ గూడ శతకముల కాదరము తగ్గకుండుట వానివిశిష్టతకుఁ బ్రబలతార్కాణము కాఁగలదు.

ప్రబంధాదు లగునితరకావ్యపద్ధతులలో లేనియవకాశ మొకటి కవికి శతకములోఁ గలదు. ప్రబంధాదులలోఁ గవి తాను దూరముగాఁ దటస్థుఁడుగా నుండి కథను జెప్పును. కాని శతకరచయిత యట్లు కాక తన యానందమును, నావేశమును, భక్తిని, బాధను, కోపతాపములను స్వయముగా ముఖాముఖిగాఁ జెప్పును. అందుచేతనే శతకము కవి యొక్క వ్యక్తిత్వమును దెలుపునాత్మాశ్రయకవిత్వముగాఁ జెప్పఁబడు చున్నది. కవియొక్క విభిన్నమానసికావేశములలో రచింపఁబడిన యీ శతకములే కాలక్రమమున భక్తిశతకములు, నీతిశతకములు, శృంగార శతకములు, తిట్టుశతకములు నని వస్తువునుబట్టి విభాగింపఁబడినవి.

శ్రీ కానూరి లింగమూర్తికవిగారిచే రచింపఁబడిన యీ 'శతక మంజరి'యందు శ్రీ నరసింహశతకము శ్రీ కేశవశతకము, నక్షత్ర మాల, శ్రీ రంగశతకము, శ్రీ కృష్ణాష్టోత్తరశతకము, కృష్ణరాగావళి,

శ్రీ వేంకటేశ్వరషోడశాష్టపది, భక్తామృతము, శ్రీ జానకీపతిశతకము ననురచనములు కలవు. లింగమూర్తికవిగారు గొప్ప భక్తులు. భక్తి మయము లయినయీ శతకములయం దీయన తమభక్తిని వెల్లడించుట మాత్రమే కాక నామజపమునొక్క ప్రాశస్త్యమును గూడ నిరూపించినారు. నరముల పటుత్వము తగ్గి యేదో రుగ్మతచే బాధపడుచుండి తద్బాధానివారణార్థము కవి యీ యనారోగ్యస్థితిలోనే యీ శతకములలో గొన్నిటిని రచించినట్లు ప్రథమముద్రణ పీఠికయందు దెలుపబడియున్నది.

సాధారణముగా భక్తిమయశతకములను రచించువారికి బురాణ పరిచయము విశేషముగా నుండవలయు ననుట నిర్వివాదాంశము. నిరంతరభాగవతసాహచర్యమువలనను, పురాణాపఠనాదులవలనను నీ కవి యట్టి పురాణపరిచయమును విశేషముగా బొంది యుండె ననుటలో సందేహము లేదు. ఈ శతకములలో నీ కవికి గల విశేషపురాణపరిచయ మడుగడుగునను గానవచ్చుచున్నది. ఈ క్రిందిపద్యములు చూడుడు.

సీ. కన్నవారలు మున్ను కానలఁ బడియుండఁ
బెంచువా రడవిని సంచరించ
మేనత్తకొడుకులు మేదినిఁ జెడిపోయి
వేసముల్ దాలిచి దాసు లైనఁ
గొడుకు కపర్దిచే నొడలఁ గోల్పడి పోవ
బాణుచే మనుమఁడు బంధపడిన
మాతామహుఁడు వృద్ధు మత్తుఁ డౌసుతునిచే
సంకెళ్ళఁ బడి మదిఁ జంచలించ

గీ. నీకుఁ గలవారె వీరల నేలినావె
మంచిదయ గలసామి ని న్నెంచవలయు
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ ! [నక్షత్రమాల 8 వ పద్యము]

సీ. తావకపదవారిపావనాతిశయంబు
సర్వజ్ఞుఁ డైనట్టిశంభుఁ డెఱుంగు

నీనామమహిమ దా నెఱుఁగక తలఁచిన
మేదినీసురుఁ డజామిళుఁ డెఱుఁగు
మీపదాంబుజరేణు మేటిప్రభావంబు
గౌతమమునీంద్రకాంత యెఱుఁగు
మీదయామహిమంబు మీ కపకారి యై
శర ణన్న కాకరాక్షసుఁ డెఱుంగు

గీ. దాసపరతంత్రుఁ డని నిన్నుఁ దథ్యముగను
వాసి మీఱినమాని దూర్వాసుఁ డెఱుఁగు
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! [నక్షత్రమాల 11 వ పద్యము]

సీ. కనకదుకూలముల్ కట్ట మర్పింపంగఁ
గాను వాయకుఁడను గనకచేల
పూలదండ లొసంగి పూజించుటకు నేను
ఘనసుదాముఁడఁ గాను ఖనజమాలి
సరసంబుగను మేనఁ జందనం బలఁదఁగాఁ
గుబ్జను నేఁ గాను కుతలపోష
వివిధపాకంబుల విం దొనరింపఁగా
విదురుండ నేఁ గాను విబుధనుత

గీ. శాకజలలేశముల నిచ్చి సత్కరింప
ద్రౌపదిని గాను ప్రొక్కొద దయను జూడు
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! [నక్షత్రమాల 26 వ పద్యము]

ఆఱు. మధుర, చిత్ర, విస్తరము లనుచతుర్విధకవితలలోఁ జిత్ర కవిత్వము పాండిత్యమూలకము. భాషాపాండితి నిండుగా మెండుగాఁ గలవాఁడు గాని చిత్రకవిత్వమున సిద్ధహస్తుఁడు కాఁజాలఁడు. బంధకవిత్వము చిత్రకవిత్వములో నొక యంతర్భాగము. భావమునకే కాని భాషకుఁ బ్రాధాన్యము లేనియీకాలమున బంధకవిత్వమున కంతగా నాదరము లేనిమాట వాస్తవము కావచ్చును. కాని కవితకు భావదారిద్ర్యమెట్టిదో భాషాదారిద్ర్యమును నట్టిదే యని నేఁటికాలపుఁగవులు గుర్తింపకుండుట శోచనీయము. సంస్కృతవాఙ్మయమున మాఘకావ్యములోని

బంధములు ప్రశస్తి పడసినవి. అందలి సర్వతోభద్రబంధము మొదలగు నవి చిత్రము లయినపదవిన్యాసములతో మెదడుకు మేఁతయై యాహ్లాదము కూర్చునవిగా నున్నవి. తెలుఁగునఁ గూడఁ గొందఱుకవులు బంధకవిత్వమున జేపట్టినవారు లేకపోలేదు. అప్పకవీయములోఁ గొన్ని బంధములకు లక్ష్యలక్షణము లొసఁగఁబడియున్నవి. లింగమూర్తిగారు శతకమంజరియందు రచించినచంపకపుష్పమాలికాబంధము, ఖడ్గబంధము, నాగబంధము, చక్రబంధము, షోడశదళకమలబంధము, రథబంధము, చతురంగబంధము, త్రయోవింశత్పుష్పమాలికాబంధము మొదలగు నవి వీరి భాషాపాండిత్యమును, బంధకవిత్వముపై వీరికిఁ గలయభిమానమును వెల్లడి సేయుచున్నవి.

ముక్తపదగ్రస్తములుగా నీకవి రచించినపద్యము లివి చక్కని శయ్యతో, సవరనిభాషతో నొప్పారుచున్నవి. చూడుఁడు.

సీ. శ్రీరుక్మిణీమనస్సారసవరహంస
హంసాబ్జనయన సత్యస్వరూప
రూపనిర్జితపుష్పచాప కృపావార్ధి
వార్ధిసుతాసక్త వాసుదేవ
దేవకీసుత కృష్ణ దీనచింతామణి
మణిసువర్ణకలాప మధురభాష
భాషావధూవర వరద దామోదర
దరచక్రధర ధరావర ముకుంద

గీ. కుందకుట్మలరద ముచికుందవినుత
నుతగిరీశాదిసురవర సతతసదయ
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! [కృష్ణరాగావళి 21 వ పద్యము]

సీ. రాజవంశసుధాబ్ధిరాజ రాజకిరీట
రత్ననీరాజితరమ్యచరణ
చరణరజఃకణశమితగౌతమసతీ
శాపసంప్రాప్తపాషాణరూప
రూపనిర్జితసుమచాప చాపవిముక్త
శితశరనిహతకాశికకుమార
మారజిన్ముఖ్యబృందారకార్చితపద
పదదళితశకటపలలఖాద

గీ. ఖాదకృద్భావదాన ప్రహ్లాదనంద
రదవిజితకుంద గోవింద రమ్యవదన
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! [కృష్ణరాగావళి 25 వ పద్యము]

సీ. కన్నబిడ్డలయందుఁ గనికరం బుంచక
పుట్టినప్పుడె నేటఁ బెట్టెఁ దనయ
తనయతోఁ గమనించఁ దగ దని యెంచక
మోహించి చీర నీ మొదటికొడుకు
కొడుకుబిడ్డ యొకండు కోపస్వభావుండు
తండ్రిని దలఁ గొట్టి తగవు దవ్వెఁ
దప్పని యెంచక త్రాగుడు జూదముల్
గైకొనె మాయన్న ఘనత మాఱ

గీ. వీర లిట్లుండ ని న్నెన్న విధికి వశ మె
జారచోరమహాశూర జాణ వౌర
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! [కృష్ణరాగావళి 28 వ పద్యము]

భక్తిరసపూరితము లయిన యీ శతకములు ఆస్తికు లగుపాఠకు లకు భక్తిముక్తులను ప్రసాదించు ననుటలో సందేహము లేదు. 'శ్రీ హరి పాదతీర్థమే చెడనిమందు' అని అన్నమయ్య పాడినట్లుగా—భాగవతు లకు భగవన్నామసంకీర్తన మెట్టి దైహికమానసికరుగ్మతల నైనను బాపఁగల దనుట కీ కవిజీవిత మొకసాక్ష్యము. భాగవతుల కీ శతక మంజరి పరమోపాదేయము.

తమ తండ్రిగారిచే రచింపఁబడిన యీ 'శతకమంజరి'ని జక్కఁగాఁ బరిష్కరింపఁజేసి యందముగాఁ బునర్ముద్రింపఁజేసిన శ్రీ కానూరి దామోదరయ్యగారు ప్రశంసార్హులు. భక్తియోగమహిమము దీని మూలమునఁ బ్రచార మగునేని ప్రకాశకుల పరిశ్రమము చరితార్థము కాఁగలదు. ఈ శతకములను బరిష్కరించుటలో నాకు మిక్కిలి తోడ్పడిన శ్రీ తిమ్మావజ్ఝుల కోదండరామయ్యగారికి చాల కృతజ్ఞుఁడను.

తిరువళ్లిక్కేణి,
మన్మథ-ఉగాది. }

తిరుమల రామచంద్ర.

—

XII

విషయసూచిక

—:o:—

1. శ్రీ నరసింహశతకము	...	1
2. శ్రీ కేశవశతకము	...	18
3. నక్షత్రమాల	...	34
4. రంగశతకము	...	48
5. శ్రీ కృష్ణాష్టోత్తరశతకము	...	69
6. కృష్ణరాగావళి	...	85
7. శ్రీ వేంకటేశ్వరషోడశాష్టపది	...	101
8. భక్తామృతము	...	105
9. జానకీపతిశతకము	...	131

—:o:—

శ్రీ మ తే రా మా ను జా య న మః.

శ్రీ న ర సిం హా శ త క ము.

—★—

క. శ్రీకర వరకళ్యాణగు
ణాకర ప్రహ్లాదవరద నతజనశుభదా
లోకావనైకకారణ
శ్రీకాంతాచిత్తచోర శ్రీనరసింహా ! 1

క. దూరీకృతదుర్మదలే
ఖారీ శౌరీ నతాఘహారీ శుభసం
చారీ సన్నుతసూరీ
సీరీ క్షీరాబ్ధినిలయ శ్రీనరసింహా ! 2

క. దోషాచరనాయకవర
యోషాశుభవేషదూష యూర్జితవేషా
పాషండజనవినాశా
శేషాహిశయాన కృష్ణ శ్రీనరసింహా ! 3

క. నీపే రొకపరి నెవ్వం
డేపగిదిని దలఁచెనేని యిహపరసుఖసం
ప్రాపక మై యఘములు భ
స్మీపటలము గాక యున్నె శ్రీనరసింహా ! 4

క. మందరగిరిధర హరి గో
వింద సనందాదిమౌనిబృందారకస

ద్వంద్వితచరణద్వంద్వము
జెందఁగఁదగుభక్తి నిమ్ము శ్రీనరసింహా! 5

క. అపకారిని ననుఁ బ్రోచుట
విపరీతము గాదు చైద్యవిభుముఖ్యులకున్
అపవర్గ మిచ్చి బ్రోవవె
శిపివిష్టనుతా రమేశ శ్రీనరసింహా! 6

క. వాతాశనరిపువాహ స
నాతన జననాదిరహిత నానావిధకం
జాతాండపూరితోదర
శీతలకరుణాకటాక్ష శ్రీనరసింహా! 7

క. నారాయణ దామోదర
నీరజనయ నాప్రమేయ నిఖిలాధారా
కారుణ్యమయ దరస్మిత
శ్రీరమ్యముఖారవింద శ్రీనరసింహా! 8

క. రంగదభంగవిహంగతు
రంగా సదయాంతరంగ రక్షితవనసా
రంగా కమలామోహన
శృంగారవిలాస వీర శ్రీనరసింహా! 9

క. దిక్కుల కెల్లను నీవే
దిక్కుగ నుండినను నిన్నుఁ దెలియఁగ జ్ఞానం
బొక్కింత లేమి బాధలఁ
జిక్కితి రక్షింపు నన్ను శ్రీనరసింహా! 10

క. శ్రీమన్నారాయణ నీ
నామము నిఖిలైకసాధనం బని పెద్దల్
భూమి జపింతురు వారికిఁ
బ్రేమం దాసుండ నగుదు శ్రీనరసింహా! 11

క. భ క్తజనకల్పభూజా
శ క్తికిఁ దగునట్లు నీదుసం స్తుతి గల్గుఁ
భు క్తియు సుఖమును ము క్తియు
రి క్తుల యాచింప నిఁకను శ్రీనరసింహా ! 12

క. పోషణకు వలయునంతకు
యోషిత్సుతముఖ్యు లెల్ల నొదుగుదురుగ త
త్పోషణకుఁ దామె చాలిన
శేషాన్నం బైన నిడరు శ్రీనరసింహా ! 13

క. ఆలుంబిడ్డలు రోసిన
జాలిం బడుచుండి వారిసంరక్షణకై
లోలత గొని యుండెద రీ
శీలము నీమాయ గాక శ్రీనరసింహా ! 14

క. దాయలు బోయలువలె న
న్యాయంబున దగవు దప్పి ననుఁ గారింపఁ
హేయపువైరము సేయుచు
శ్రీయుత మిమ్ముఁ దలఁప నైతి శ్రీనరసింహా ! 15

క. నారాయణ దామోదర
గారుడధ్వజ చక్రపాణి కంజాక్ష హరీ
కారుణ్యవార్ధి వని నేఁ
జేరితి నీమరువు గావు శ్రీనరసింహా ! 16

క. చి త్తము నీదివ్యపదా
యత్తము గా దేమి సేతు నాధివ్యాధుల్
యొ త్తిడిఁ జేయఁగ నిఁక మీ
చి త్తము నాభాగ్య మిఁకను శ్రీనరసింహా ! 17

క. జింహగరిపువాహన ఘన
రంహుఁడ వై యభయ మిచ్చి రక్షించుటకై

అంహోగ్రమ త్తవారణ
సింహో త్రమొక్కెదను రమ్ము శ్రీనరసింహా! 18

క. వరకనకరత్నకుండల
కరకంకణహారమకుటకటిసూత్రరుచి
స్ఫురదంగదాదిభూషా
స్థిరరమ్యరుచిప్రభాస శ్రీనరసింహా! 19

క. బంధురబలవిక్రమతం గ
బంధచరం బొక్రమింప వరకృప నాప
ద్బంధుఁడవు గానఁ బ్రోచితి
సింధురరాజమును మున్ను శ్రీనరసింహా! 20

క. సురరిపు హిరణ్యకశ్యపు
దురమునఁ దడబడఁగఁ దిగిచి ధూర్జటిముఖ్యుల్
అరుదరు దనఁ జీరితి మును
స్థిరవిక్రమశౌర్యలీల శ్రీనరసింహా! 21

క. సతిసుతహితబంధులు స
ద్గతి యని మది నమ్మి మ్రోఁదు గానక నీచ
స్థితిఁ జెంది యాశ్రయించితి
శ్రితవరదా నన్నుఁ గావు శ్రీనరసింహా! 22

క. నరకములఁ జెందుపడువే
నరకాంతక నాకుఁ దగును నతిఁ జేసినన
న్నరసి యుపేక్షింపఁగ ను
స్థిరశుభ నీ కేమి పదుపు శ్రీనరసింహా! 23

క. బంధుడ వార్తులకు జగ
ద్బంధుండవు వివతక్షీరవాలికి జితకా
బంధుండవు కరుణామృత
సింధుండవు నన్నుఁ గావు శ్రీనరసింహా! 24

క. పాంచాలిని గురుసభలో
వంచింపఁ దలంచుకష్టపాపుల కెల్లన్
వంచనగా వస్త్రము ల
ర్పించితివా సతిని గావ శ్రీనరసింహా! 25

క. రక్షింపుము రక్షింపు ము
పేక్షింపక పక్షివాహ ప్రియభక్తునిగా
వీక్షించి దుర్మదాసుర
శిక్షా కరుణాకటాక్ష శ్రీనరసింహా! 26

క. శ్రీలోలా శుభకాంచన
చేలా కరుణాలవాల శ్రితజనపాలా
పాలింపర నను నీమృదు
శీలము గాన్పింప వేగ శ్రీనరసింహా! 27

క. మాయామయజాయాసుత
కాయాదుల కాసఁ జెంది కాలము వృథగాఁ
జేయుచు మిమ్ము భజింపక
శ్రేయుత నే మోసపోతి శ్రీనరసింహా! 28

క. కామక్రోధాదులు బల్
గాములవలెఁ జుట్టు పెనఁగఁ గానక సుగతిన్
భీమభవాటవిఁ జెందితి
నేమం బొనగూర్ప మయ్య శ్రీనరసింహా! 29

క. ఉత్తరగర్భస్థుఁ బరీ
క్షిత్తుని గురుతనయు శస్త్రకీలావళిచే
మిత్తిని గనకుండఁగ సుఖ
చిత్తునిగా నేల లేదె శ్రీనరసింహా! 30

క. శ్రీకర కళ్యాణగుణా
లోక సుధాలోకనైక లోల సుశీలా

లోకస్తుత నను గావుము
శ్రీకాంతాసహిత మహిత శ్రీనరసింహా! 31

క. దేవనరపితృజగతులను
నావిధిచే నుండునపు డనారతభ క్తిన్
భావింపుచు నిను నీపద
సేవపయిన్ దలఁపు నిమ్ము శ్రీనరసింహా! 32

క. భిన్నఘటజీవనముగతి
సన్నం బగుజీవితంబు సత్యం బనియు
న్నెన్నక సతిసుతధనములు
చెన్నని మిముఁ దలఁప నైతి శ్రీనరసింహా! 33

క. తల్లులుఁ దండ్రులుఁ దనయులు
నిల్లాండ్రు ధనంబు బంధు లెందఱు గల్గన్
బల్లిదపుఁగర్మఫలములు
చెల్లించును గాలుఁ డెపుడు శ్రీనరసింహా! 34

క. ఎవ్వాఁడు బంధువు లెందుకు
నివ్వటిలన్ నీదుభ క్తి నీభ క్తులపై
మువ్వపుశ్రద్ధయుఁ గల్గిన
రివ్వున యమునిఁ డైనఁ దొలఁగు శ్రీనరసింహా! 35

క. నిరతము శరణని నిను నే
మరిమరి వేఁడినను నీదు మది గరుగ దిదే
మిర నిరుపమకరుణుఁడ వని
చిరశుభ నిను నమ్మినాఁడ శ్రీనరసింహా! 36

క. తలిదండ్రులు చెఱ నుండఁగ
బలయుక్తుఁడ వయ్యు నీవు పరదేశములన్
లలిఁ బశులఁ గామువారల
చెలిమికి సట నుండ నేల శ్రీనరసింహా! 37

క. దాతవు శాశ్వతపదవికి
నేతవు భాషాంబుజాక్షి నేతకు నీవే
తాతవు నీకుం దగునే
ప్రీతిన్ నరసాది వగుట శ్రీనరసింహా! 38

క. సరసిజభవుఁ డాదిగ ని
ర్జరు లెల్లను నీదుపంపు రహి నొనరింపన్
బరు వేమి గల్గె ధర్మ్మజు
సిరికై దాత్యంబు సేయ శ్రీనరసింహా! 39

క. రారాజు విందుఁ బెట్టఁగ
గారామున వేఁడుకొనినఁ గైకొనక మదిన్
గోరనిదాసరి విదురునిఁ
జేరి భుజించితివి తగును శ్రీనరసింహా! 40

క. శ్రీలక్ష్మి భార్య కాంచన
చేలంబును గల్గి దానశీలుఁడ వయ్యుం
గ్రాలుట యటుకులఁ బేదకు
చేలునిచేఁ గొనుట కేన శ్రీనరసింహా! 41

క. ఎల్లజగంబులఁ గావం
గొల్లకులంబున జనింప గోవులఁ గావన్
మల్లుర జంపఁగ నీకే
చెల్లుర సుర లుల్లసిల్ల శ్రీనరసింహా! 42

క. జంభాంతకరిపు మోషి
త్సంభరిత భ్రూణవిచ్యుతక్షుమరణనా
గంభీరభీకరాద్భుత
జృంభితఘనసింహనాద శ్రీనరసింహా! 43

క. పరిపరివిధముల నిరతము
శరణని నిను వేఁడు నెల్ల శ్రమఁ జెందుటకా

సరిసరి యిది నే నెఱిఁగిన
సిరినై నను వేఁడుకొందు శ్రీనరసింహా! 44

క. ప్రేతపిశాచాదిమహా
భూతోచ్చాటన మొనర్చి పోషించుము శ్రీ
శీతలకటాక్షవీక్షా
స్పీతశివస్తోత్యపాత్ర శ్రీనరసింహా! 45

క. భీష్మతరపైత్యవాత
శ్లేష్మామయబాధ లణఁచి సేవకుని సుఖా
యుష్మంతునిగాఁ జేయుము
గ్రీష్మాదిత్యప్రతాప శ్రీనరసింహా! 46

క. యిల్లఁట శుభమణులకుఁ బు
ట్టిల్లఁట శ్రీయాదిలక్ష్మి యిల్లాలఁట నీ
చెల్లెలఁట సర్వమంగళ
చెల్లదె సిరు లిచ్చి బ్రోవ శ్రీనరసింహా! 47

క. సిరి గల్గి పరుల వేఁడెదు
వరశౌర్యము గల్గి శత్రువర్గముఁ జూడఁ
బరువిడెదు కరుణ గల్గియు
స్థిరముగ ననుఁ బ్రోవవేమొ శ్రీనరసింహా! 48

క. నిష్ఠురఘనదుష్కర్మవ
రిష్ఠుఁడ నై ధర్మ మాచరింపనినాపై
నిష్ఠుర ముంచకు సదయా
శ్లేష్ఠుండవు గావవయ్య శ్రీనరసింహా! 49

క. కాకాసురుఁ డతిదుర్మతి
మీ కపకారం బొనర్చి మీఁటినభీతిఁ
మీకరుణ గోరి శరణనఁ
జేకొని రక్షించలేదె శ్రీనరసింహా! 50

క. ఈశా బృందారకరిపు
నాశా కేశవ పయోజనాభ రమేశా
ఆశాధినాథపోష గి
రీశార్చితపాదపద్మ శ్రీనరసింహా! 51

క. అవనీధర ననుఁ గావుము
భవరోగనివారణైక పావననామా
రవికోటితేజ పద్మజ
శివవాసవముఖ్యవినుత శ్రీనరసింహా! 52

క. శ్రీమదాపద్ధినికేతన
భీమాపదాపద్ధిమగ్నభీతుఁడ నాకుం
నీమహనీయకృపారస
క్షేమంకరనావ నొసఁగు శ్రీనరసింహా! 53

క. మ్రుచ్చిలి శ్రుతు లంబుధిలోఁ
జొచ్చినసోమకుని వ్రచ్చి సొంపుగ శ్రుతులఁ
దెచ్చి ఋషాకృతి విధికిం
రిచ్చపడ నొనసగి తీవు శ్రీనరసింహా! 54

క. తుచ్ఛతరవిషయభుక్తికి
నిచ్చకు వచ్చినటు లెల్ల హెచ్చుగ దురితం
బచ్ఛొత్తినటులఁ జేసితి
చిచ్చును వడి ముడిచినటుల శ్రీనరసింహా! 55

క. నీమృదుపదపద్మంబులు
నామానసకమలమం దనారతభక్తిన్
శ్రీమహితశ్రద్ధాయుత
ప్రేముఁడనై గన నొనర్చు శ్రీనరసింహా! 56

క. చంచల ముడుగదు చిత్తము
కొంచెం బొకనిముస మయినఁ గోరియు మిముఁ బూ

జించి భజించుట యెట్లో వి
రించి స్తుత నన్నుఁ బ్రోవు శ్రీనరసింహా! 57

క. మురదానవకరిసింహా
గురుతరశుగ్వ్రాతపోతఘోరద్విజింహా
సురసింహావినుత దానవ
చిరశుభతృణసప్తజింహ శ్రీనరసింహా! 58

క. చతుశ్శ్రీవఘస్మరరథ
యతీయకల్యాణవీక్షణామృతధారా
రక్షితుగా ననుఁ జేయుము
శిక్షితకనకాక్షదైత్య శ్రీనరసింహా! 59

క. నారాయణనామామృత
సారము రుచిరౌషధంబు సంసారమహా
ఘోరామయంబుఁ జెడ శుభ
శ్రీరమ్యసుఖం బొసంగ శ్రీనరసింహా! 60

క. బ్రమొక్కుచు మీపాదములకు
మిక్కిలి నే వేఁడుకొంటి మేలొనఁగూడఁ
గ్రక్కున నేలుము వరదా
చిక్కులు దొలఁగించి నన్ను శ్రీనరసింహా! 61

క. ఓకనకకశ్యపాంతక
ఓకంజభవాదివినుత యోప్రహ్లోద
శ్రీకళ్యాణప్రద యో
శ్రీకాంతాస్యాబ్జమిత్ర శ్రీనరసింహా! 62

క. రాజత్కౌస్తుభరత్నవి
రాజితవక్షఃప్రదేశ రమ్యాలయవి
భ్రాజిత భద్రగుణాన్విత
శ్రీజలజావాస శ్రీశ శ్రీనరసింహా! 63

క. ఎక్కడ నెడ మించుక లే
కక్కజముగ నీదుభృత్య లవనీస్థలిలోఁ
గ్రిక్కిరిసి యుండి దీనుల
చిక్కులఁ బాపుటలు నిజమె శ్రీనరసింహా ! 64

క. హరి గోవింద జనార్దన
నరకాంతక పద్మనాభ నరసఖ కృష్ణా
గరుడాంక కేశ వాచ్యుత
చిరకీర్తివిహారి శౌరి శ్రీనరసింహా ! 65

క. ఆధివ్యాధులచే బహు
బాధాంబుధిలోన మునిఁగి పారము గన నా
రాధించితి సతతము నే
శ్రీధర కరుణించు వేగ శ్రీనరసింహా ! 66

క. సుర లసురులు సుధ కంబుధి
దరువఁగ మందరము దాల్పఁ దగుకూర్మమ వై
సురనికరము ముద మొందఁగ
సిరిఁ జెందితి శుభచరిత్ర శ్రీనరసింహా ! 67

క. వసులోచనుఁ డసమానత
వసుమతిఁ గొనిపోయి దాఁచ వనధిని వాని
న్నసువులఁ బాపిననీ పే
ర్మిసుమంత నుతింపఁ దరమె శ్రీనరసింహా ! 68

క. సారకృపాసూనతర
స్ఫారసుధాసార శమితసంసార మహా
ఘోరామితవై శ్వానర
క్షీరాబ్ధిసుతాహృదీశ శ్రీనరసింహా ! 69

క. పత్రధ్వజరిపుకైరవ
మిత్రామిత్రాబ్జనేత్ర మృదుతరగాత్రా

సత్రజితవినుతపాత్ర వి
చిత్రచరిత్రా పవిత్ర శ్రీనరసింహా ! 70

క. కోమలసుందర మేఘ
శ్యామల నిర్మలశరీర సరసవిహారా
కామాయుతసమసుందర
శ్రీమోహనచారువేష శ్రీనరసింహా ! 71

క. నీలాలక జాలాంచిత
ఫాలస్థలపరిమిళైకవరమృగమదసు
శ్రీలలితరుచిలలామా
శ్రీలలనాహృదభిరామ శ్రీనరసింహా ! 72

క. మరణక్రియాకలాప
స్ఫురితము లామంత్రయంత్రముఖ్యము లె వినా
దరిఁ జేరగ రానీయక
చెఱుపుము భస్మంబు గాఁగ శ్రీనరసింహా ! 73

క. సకలాపథ్యంబులచే
వికలత్వము నొందనీక వేగమె న న్నో
యకలంక ప్రోవు మధులి
ట్చికురా మకరాంకజనక శ్రీనరసింహా ! 74

క. శ్రుతిమంజీరనినాదము
లతిశుభదములై జగంబు నంతటఁ బర్వన్
సతతానందవిహార
స్థితి దీనులఁ బ్రోతు వీవు శ్రీనరసింహా ! 75

క. మృదుపీతాంబరధారీ
సదమలయశ సద్విహారి శౌరి యఘారీ
త్రిదశపరితోషకారీ
చిదంబరాంతర్విహారి శ్రీనరసింహా ! 76

క. సారసదళసమనయనా
సారసభవవినుత వరభుజంగమశయనా
సారసమృదుమధువచనా
క్షీరాంభోరాశిసదన శ్రీనరసింహా ! 77

క. అవనతజనమందారా
భువనశుభప్రదవిహార పుణ్యోదారా
సవనక్రోడాకారా
శివకర సద్గుణవిహార శ్రీనరసింహా ! 78

క. ఆదరమున నను బ్రోవఁగ
రాదా నీకరుణ నన్ను రక్షించుటకై
రాదా లేదా వాదా
శ్రీదా యిది మేర గాదు శ్రీనరసింహా ! 79

క. ఏదిక్కు లేదు నా కిఁక
నీదిక్కే దిక్కు గాక నిఖిలజగములం
దేదిక్కు వెదక ననుఁ గా
చేది క్కొకఁ డైన లేరు శ్రీనరసింహా ! 80

క. నమ్మితి మిము నామది నీ
నమ్మిక వృథఁ జేయ మీకు న్యాయము గా దో
కమ్మవిలుకానితండ్రీ
చిమ్ముము సర్వాపదలను శ్రీనరసింహా ! 81

క. శరణు శరణనుచు నిరతము
మొఱలిడినను నీదుకరుణ మొనయదు నాపై
శర ణన్నమాత్ర ద్రౌపదిఁ
జిరకృప నేలితివి గాదె శ్రీనరసింహా ! 82

క. దారను విడి కులటను గొని
సారాన్యాయధర్మములను జక్కడచియుఁ దా

నారాయణ యని తుది సుతుఁ
జేరినఁ గాచితివి గాదె శ్రీనరసింహా! 83

క. గొంచెపుదానం బిమ్మని
వంచించి బలీంద్రుజగము వాసవునకు ముఁ
మించినకృప వామనత వి
రించి స్తుత యొసఁగి తీవు శ్రీనరసింహా! 84

క. దుష్టధరాధిపకోటిని
నిష్ఠురతరపరశుధార నిర్జించి భృగు
శ్రేష్ఠుఁడ వై ధర నెల్లను
శిష్టుల కొసఁగితివి నీవె శ్రీనరసింహా! 85

క. దశరథతనయుఁడ వై మును
దశముఖఘటకర్ణముఖ్యదైత్యులు గూల
విశదగతిఁ జేసితివి ధా
త్రి శుభస్థితిఁ జెన్ను మిగుల శ్రీనరసింహా! 86

క ఎన్నఁగ ధర నీకన్న వి
పన్నులఁ గావంగఁగల్గుపరమదయాళుం
డెన్నం డైనను గల్గెనె
చెన్నలరఁగ ననుఁ బ్రోవు శ్రీనరసింహా! 87

క. కేశవ శ్రీహరి మాధవ
కేశినిశాచరవినాశ కృష్ణా నిను నే
నాశించితి ననుఁ బ్రోవుము
శ్రీశా క్లేశములఁ బాపి శ్రీనరసింహా! 88

క. నిను మదిఁ దలఁచినదినమే
దినములలో నెల్ల శుభదదినమై చెల్లుఁ
నినుఁ దలఁపనియది ఘనదు
ర్దిన మై యశుభంబు నిచ్చు శ్రీనరసింహా! 89

క. బలరామకృష్ణులై యిల
ఖలమానవదావవ్రజను గలనం గూలన్
లలిఁ గ్రీడ జరిపి సుజనుల
జెలు వలరఁగ నేలి తీవు శ్రీనరసింహా! 90

క. దితిసంతానము చెడ దు
ర్మతముఁ బోధించి వారిమదము లణంపన్
క్షితిరథుఁ బురికొల్పితి వీ
క్షితి బుద్ధత సురలఁ గావ శ్రీనరసింహా! 91

క. సలలితధర్మము గావఁగఁ
గలియుగమునఁ బొడమె దీవు కలికాకృతివై
ఖలజనులఁ జంపి సాధులఁ
జెలువలరఁగఁ బ్రోచె దీవు శ్రీనరసింహా! 92

క. దాతవు దీనుల కెల్లను
ద్రాతవు నిఖిలార్తులకును బ్రహ్మాదులకున్
నేతవు దుర్మఖరాక్షస
జేతవు ప్రమొక్కితిని గావు శ్రీనరసింహా! 93

క. సదయా నిర్మలమృదుతర
హృదయా శుభదాభిధేయ హేయపుమాయా
పదయాతన మాయుగఁ జే
సి దయన్ వేగావు నన్ను శ్రీనరసింహా! 94

క. దేవా ననుఁ గరుణింపఁగ
లేవా యీజగతియందు లీలార్థముగా
నీ వాదినుండి సదయత
జీవావలిఁ గావలేద శ్రీనరసింహా! 95

క. నను దూషించెడువారల
కనయ మసూయాదిగుణము లన్నియుఁ జెడ స

ద్వినయకృతజ్ఞత దయచే
సి నను వేగరుణఁ జూడు శ్రీనరసింహా ! 96

క. శ్రీరమణా నతభరణా
వారణవిపదబ్ధితరణ వర్ణితసుగుణా
ఘోరామరారిభీషణ
చేరితి నిఁ శరణటంచు శ్రీనరసింహా ! 97

క. నిశితకరనఖరవిదళిత
పిశితాశనవజ్రకఠినభీకరకాయా
శశిధరమౌళిసుగేయా
శిశుపాలనిరాస కృష్ణ శ్రీనరసింహా ! 98

క. ఊహించి నిన్ను మదిలో
బాహాటముగా గడింది బ్రతిమాలిన సం
దేహింపక ప్రోవు మహో
శ్రీహరి నిను విడువలేను శ్రీనరసింహా ! 99

క. క్షీరాంబుధియం దడఁగిన
సారమతిఁ శేషతల్పశయనుఁడ వైనఁ
గూరిమి మానులహృత్సర
సీరుహముల నున్న విడువ శ్రీనరసింహా ! 100

క. మదియం దనుదినమును నిను
వదలక ప్రార్థింపఁ గావవైతివి సదయా
యిదివరకు నింక నేగతి
చిదచిద్వ్యాపకర మాప్త శ్రీనరసింహా ! 101

క. అపరాధిని నపరాధిని
నెప మెన్నక కృపను బ్రోవు నీకన్న నొరుల్
అపరాధులఁ బ్రోవగ సుర
రిపుమారణ కలరె జగతి శ్రీనరసింహా ! 102

క. ఘనతరదుగ్ధాబ్ధకు నే
ననయము బహుళార్తిఁ జెంది యార్తశరణ్యా
యని శరణు వేఁడితిని గూ
ర్మిని వేగమె ప్రోవ రావె శ్రీనరసింహా! 103

క. వనజాతు మీపదాశ్రితుఁ
డనఘుఁడు కానూరిరామయాభిదుసుతుఁడఁ
నను లింగమూర్తి దయఁ బ్రో
చిన నీ కగు మంగళమ్ము శ్రీనరసింహా! 104

క. కందాట్టోత్తరశతకముఁ
బొందుగ మీకరుణ నన్నుఁ బురికొల్పిన నీ
చందమునఁ బలికితిం గొను
చెందింపు మమూల్యపదవి శ్రీనరసింహా! 105

క. మంగళము భక్తమానస
సంగత భవదీయపాదజలజములకు స
న్మంగళము భువనమోహన
శృంగారవిలాస నీకు శ్రీనరసింహా! 106

క. ధర నాచంద్రార్కముగా
స్థిర మై యిది మీపదాబ్జసేవారతు లై
నిరతము పఠించువారికి
స్థిరశుభహేతు వగుఁ గాక శ్రీనరసింహా! 107

క. తప్పొప్పెఱుఁగనినా కే
చొప్పునఁ గవనంబుఁ జెప్పఁ జొప్పడు ధరణిన్
మెప్పగు మీగొప్ప దయన్
జెప్పితి తప్పొప్పుఁ జేయు శ్రీనరసింహా! 108

సంపూర్ణము.

శ్రీగురుభ్యో నమః.

శ్రీ కేశవ శతకము.

—★—

శా. శ్రీరత్నాకరకన్యకారమణ రాజీవాక్ష వందారుమం
దారా నందకుమార దీనజనబృందానందసంపత్కరా
కారుణ్యామృతవార్ధి గౌతమవరగ్రామాధివాసా శుభా
కారా నీశరణార్థి నైననను వేగం బ్రోవు శ్రీకేశవా! 1

శా. శ్రీకళ్యాణగుణాకరా శుభకరా శృంగారరత్నాకరా
లోకైకావనశీల నిత్య సదయాలోకస్ఫురద్వీక్షణా
లోకేశత్రిపురాంతకాదినుత సుశ్లోకా జగద్వంద్యతే
జా కంజాలయగేహ గౌతమపురీశా శౌరి శ్రీ కేశవా! 2

శా. తారాధీశుని తోడఁబుట్టినది నీదారే, బుధోక్తంబు నీ
పేరే, భానువుభాసి కౌస్తుభము నీపేరే, హిరణ్యారి నీ
గోరే చీరె నృసింహ నిన్నుఁ గనకాఘోరాసురుల్ భీతిచేఁ
దారే పోరె రసాతలంబు జగదుద్ధారీ హరీ కేశవా! 3

శా. దేవా! దీనుఁడ నంటి నాకు ధరణిం ది క్కెందు లేదంటి న
న్నావ న్నీకుఁ దలంపు లేదె త్రిజగన్నాథా జగన్మాత శ్రీ
దేవి న్వేఁడెద నామెకైన దయ రాదే వచ్చి నీదాసునిం
గావ న్దప్ప దటన్నఁ గాచెదవుగా కయ్యారె శ్రీ కేశవా! 4

శా. ఇల రత్నాకర మై చెలంగునది నీయిల్లే, జగన్మాత మై
తలఁప న్మే లగు దేవకీతరుణి నీతల్లే, సురల్ మ్రొక్క రా
జిలఁగాఁ గంసుని ధిక్కరించినది నీచెల్లే, ధర న్లోపిక
ల్వాల పెక్క న్నినుఁ జెంది యుండుటకు వ్రేపల్లార శ్రీ కేశవా! 5

శా. గోవిందా జలజాక్ష భక్తవరదా గోపాలచూడామణీ
శ్రీవత్సాంక భుజాంతరాలయరమాసీమంతినీష్ఠోలికా

భావంబు నగనిపించుకౌస్తుభమణిప్రాగల్భ్యరోచిచ్ఛటల్
పోవంజేయు మదీయదోషతమమున్ బొల్పొందఁ శ్రీకేశవా! 6

శా. భక్తానందకరంబు దుష్టజనగర్వారణ్యదావంబు స
న్మోక్షప్రస్ఫుటరోచిభాసితలసన్మోఖ్యంబు దైత్యావళీ
రక్తాపాస్తమలీమసంబుఁ ద్రిజగద్రక్షాక్రియాలోలతా
సక్తం బుత్తమనందకంబు ననుఁ నిచ్చుం గాచు శ్రీకేశవా! 7

శా. శ్రీకృష్ణా యదువంశభూషణ రమాసీమంతినీనాయకా
నీకు న్మ్రొక్కుచు నమ్మియుంటిఁ గదరా నీచిత్త మెట్లున్నదో
యీకాఠిన్యపుబాధ లోర్వఁ గలనా యెందాఁక నే నోర్తురా
నీకారుణ్యముఁ జూపి యేలఁ గదరా నీవాఁడ శ్రీకేశవా! 8

శా. మీనామంబు మృతిం బలంచినయజామీళుం గటాక్షించి స
త్రాణుం జేసి విరోధితమ్మని సభాస్థానంబునం ద్రౌపది
న్మానంబు నొడకుండఁ గాచి మగధు న్మర్దించి తద్వంశ్యులౌ
భూనాథుల్ ముద మంద నేలినగతి న్బోవింగ దే కేశవా! 9

శా. దేవా నామొర చిత్తగింపు మిపు డుద్యోలాబ్ధిచందంబున
న్భవంబందునఁ దోఁచునీఘనవిపత్ప్రాథోధి డాటంగ నా
కేవెంట నగనరాదు సాధనలు వెయ్యేలా భవద్భక్తి యీ
నావే కాక యనుగ్రహించు మెలమి న్నగ్నావ శ్రీకేశవా! 10

శా. మృడుని న్వోడి వరంబుఁ గాంచి ఖలుఁడై మే లెంచ కామిష్టుఁ డా
మృడునినోసముఁ జేయ వెంటఁ బడఁగామి మ్మాత్మలో వేడఁబెం
పడర న్మీ రటఁ దోఁచి యావృకుని మోహవిష్టునిం జంపి యా
పుడమిన్ రుద్రునిఁ గావలేదె మును పొల్పొందంగ శ్రీకేశవా!

శా. శ్రీ నారాయణ కేశ వాచ్యుత హరీ శేషాహిరాట్తల్పకా
జ్ఞానానంద యనంతరూప నతవిజ్ఞానప్రదా భక్తసం
తానాదిత్యమహీరుహాప్రతిమపాదాంభోజ గోపాలస
న్మానీంద్రస్తుత రుక్మిణీహృదయసీమావాస శ్రీ కేశవా! 12

మ. సిరి యిల్లాలు గదా గదాధర నినున్ సేవించువారే సదా
స్థిరులై యుంద్రు గదా గదాగ్రజబుధుల్ చింతింత్రు నిన్నే కదా
వరదా నీవు గదా సదాళికి మదిం బట్టుందు వెందెందు నీ
శరణం బందునరుండు చెందు ముదము న్సత్యంబు శ్రీకేశవా!

మ. యమునాగాధజలాంతరాళమదదుష్టాహీంద్రరంగత్ఫణా
రమణీయాంచితరత్నరంగనటనప్రాగల్భ్యవై చిత్రిసో
ద్యమలై గోపనితంబినుల్ మృదువచస్తోత్రంబులం జేయఁగా
వివశుం దోలితి వార్ధిలోఁ జొరఁగ గోపీనాథ శ్రీ కేశవా! 14

మ. అకలంకాత్ములు శంకరాదిసుర లత్యాసక్తు లై నిత్యముఁ
సకలాధారము నీ వటంచు మదిలోఁ జర్చించి సేవించి కా
నక చింతింతురు నీపదస్మరిశ(?)ఁ బూనం గల్గుటం జేసి యా
శకటుం డేమి తపంబు చేసి కనె నాజోడ్ఁ ధర న్గేశవా!

మ. ధరణిం బుణ్యసమేత సద్వ్రత యశోదాదేవి నీమాత నీ
వరయం బొండవదూత వైతి వఘుద్వై త్యారాతి నీచేతిభా
సురహేతిఁ రిపుజాతి నెల్ల సమరక్రోణిఁ హతిం జెందఁగా
వరవిక్రాంతిఁ జరించి మించి జగతి న్బాలించవే కేశవా! 16

శా. అయ్యా శ్రీవసుదేవనందన యిదేమయ్యా సరే మొక్కినం
గుయ్యాలింపఁగరాదయా తగునయా కోపంబు నామీఁద రా
దయ్యా చేయఁగ నేను దీనుఁడఁ గదయ్యా సద్దయాంభోనిధీ
యియ్యాలస్యము చేయ నేలనయ వెయ్యేలా హరీ కేశవా!

మ. నతసారంగఘనా విహంగగమనా నాళీకపత్రేక్షణా
ధృతచక్రాసిగదాధరా గిరిధరా ధీరా రమామందిరా
సతతానంద ముకుంద కుందరద విశ్వానందసంపత్ప్రదా
జితదేవారి మురారి శౌరి నృహరీ సేవింతు శ్రీకేశవా! 18

మ. పతితు ల్నావను లై శుభస్థితులచేఁ బ్రఖ్యాతు లౌనట్లు నీ
వతిదాక్షిణ్యముతోడ నేలి తని నే నశ్రాంతము న్వేందు న

న్నతిశీఘ్రంబున నేలుమయ్య దయతో నన్నైన నా విన్క యీ
ప్తితిలో సత్య మటంచుఁ గందు నెపుడు న్నిద్ధంబు శ్రీ కేశవా!

మ. విధి నిద్రించినవేళ సోమకుఁడు దా వేదంబులం గొంచు నం
బుధిలో డాఁగిన వానిఁ జంపుటకు నై పోలంగఁ దద్వార్థిలోఁ
బృథురోమాకృతిఁ జొచ్చి చీల్చి రిపుఁ దద్వేదంబు లావేధకున్
బుధు లానందముఁ జెంద నిచ్చితిగదా పుణ్యాత్మ శ్రీ కేశవా 20

శా. క్షీరాబ్ధి న్మథనై సురాసురులు ము న్నిద్ధప్రయత్నంబుతో
భారం బై తగుమందరాద్రి బలుకవ్వం బందులోఁ జేర్పఁ ద
ద్భారం బూనవె కచ్ఛపాకృతిఁ గృపాభావంబు గన్పట్టఁగా
వారల్ పద్మజశంకరుల్ పొగడఁగాఁ బద్మాక్ష శ్రీ కేశవా 21

మ. ప్రళయాంభోధి సువర్ణ నేత్రు బలగర్వాధీన యై చిక్కినాఁ
డలరత్నాకరమేఖలారమణి నత్యాశ్చర్యసౌకర్యము
ల్వెలయం దెచ్చితి వడ్డగించుఖలుని న్వే చీల్చి బృందారకుల్
లలి మందారసుమంబులం గురియ లీలాప్రక్రియం గేశవా!

మ. అమితానందభయాద్భుతంబుల విధీశాదుల్ నుతింపం బరా
క్రమతన్ దుష్టు హిరణ్యకశ్యపు మహోగ్రాకారుఁ గాఠిన్యపి
క్రమధ్వారేయు నృసింహరూపమునఁ గ్రోరం జీరి ప్రహ్లాదు సా
పమురం గాచిననీకు మ్రొక్కెద నృసింహాకార శ్రీ కేశవా! 23

శా. ఎన్న న్మున్నటిజన్మజన్మములలో నెన్నండు నీనామమే
విన్న న్గన్నను నోట ననున్ను ఘనావిద్యాంధకారంబు నా
వె న్నంటం గన లేక మున్ను వెనుక న్వీథిల్లి యిట్లుండునా
యన్నన్నా యిది యెంత మోసము గదే యబ్జాక్ష శ్రీ కేశవా! 24

శా. లోకేశాన్విత మైనలోకములు నీలో నుండు నీవు న్నదా
లోకాత్మండవు గాఁగ నుండుదువు నాలో లంకె యి ట్లుండఁగా
నాకు న్నీకు ననాదినుండి వరదా నాయాపదల్ దీర్ప్వఁగా
నీకుం దప్పన తెప్ప దెన్నఁటికి మానీంద్రస్తుతా! కేశవా! 25

శా. శ్రీమత్కేశవ కైటభాంతక మురారీ దుష్టసంహారకా
భీమాటోపహిరణ్యకశ్యప సుర ద్వేషాద్రినిర్భేదతీ
వ్రామోఘాగ్రనిశాతఘోరనఖవజ్రాచ్ఛప్రభామండలిత్
వ్యామోహాంధతఁ బాపి నన్ను దయతోఁ బాలించు శ్రీకేశవా!

శా. శ్రీనారాయణ సత్పరాయణ ధరిత్రీత్రాణ విద్వేషణ
ప్రాణానల్పసమీరణాహిరమణా రాజత్ఫణీభూషణా
వీణామానినిసుగానసంశ్రవణ యుర్వీదేవతాపోషణా
యేణాంకానన సద్ధృణాసహిత నికే మ్రొక్కెద గేశవా! 27

మ. అసురగ్రావఘనాఘనాఘననిభ శ్యామా రమామండనా
అసమానాసుమనావనానతజనవ్యామోహవిచ్ఛేదనా
వసురత్నాంచితభూషణా వరగుణప్రస్తావ సన్మానినీ
నససారంగఘనాఘనాఘనయశా నందాశ్రయా కేశవా! 28

మ. పురజిన్ముఖ్యులు మెచ్చ మున్నదితికి న్బుత్రుండ వై లోకముల్
వెఱఁగంద న్దగుగుజ్జరూపున బలి న్వేఁడ న్దిపాదస్థిరత్
బరమప్రీతి నొసంగ నెల్ల జగము న్వంచించి పాకారినిత్
సిరి మీఱం గరుణించువామన నిను న్నేవింతు శ్రీకేశవా! 29

మ. పవిసంకాశకుఠారనిర్దళితభూపానేక కాంతారభా
ర్గవరామాకృతిఁ గాంచి మించి రిపుల న్ఖండించి తద్రక్తముల్
భువిపై నించి కొలంకు లై దుగఁ గడుల్ భూదేవతాప్రీతిగా
దివిజుల్ మెచ్చ నొసంగి తీవు జగతిల్ దేవేశ శ్రీకేశవా! 30

శా. దోషంబుల్ మితి మీఱఁ జేసినమహాదుష్టుండ నాదోషముల్
భాషాధిశగిరీశశక్తిధరసర్వాధీశు లైన న్మహా
భాష న్నాలుగునైదునారువెయినో ళ్ళభసిల్లువా రైనన్ను
భాషింపం దరమే మహాపతితు న న్నాలింపు శ్రీకేశవా! 31

శా. కారుణ్యామృతవార్ధి వీవు తగునా కాఠిన్యము న్బూని నా
నేరంబుల్ తీమియింప కిట్లదయత న్నీవే యుపేక్షింపఁగా

మే లెవ్వారలు రక్షకుల్ గలుగ రీవిశ్వంబులోఁ గాన నీ
మే రక్షించిన మానిన న్వీడువ ని న్నెన్నండు శ్రీకేశవా! 32

శా. శ్రీమద్భానుకులాబ్ధిచంద్రుఁ డనఁగా శ్రీరామచంద్రాకృతి
న్భూమిం బం_క్తిరథావనీవిభునకుం బుత్రుండ వై కోసల
త్కౌమారీసతీధిరా_ట్తనూజ యగునాకౌసల్యగర్భంబునఁ
శ్రీమీఱు జ్జననంబు నొందినమిము న్నేవిం చెదఁ గేశవా! 33

శా. ఆదిం దాటకఁ ద్రుంచి ఘోరబలమాయావేది మారీచుఁ గ్ర
వ్యాదు న్దత్సహజన్మునిం దునిమి విశ్వామిత్రుసత్రంబు నిం
ద్రాదు ల్మ్రొ లనఁ గాచి శంకరధనుర్భంగంబు గావించి శ్రీ
వై దేహీరమణి న్వరించిననిను న్వర్ణింతు శ్రీకేశవా! 34

మ. జనకాదేశమున న్ధరాతనయతో సౌమిత్రితో నేగి కా
ననసీమ న్వసియించి మానివర లానందంబుఁ జెంద న్ధరా
దినరాజప్రకరంబు సంగరధరి న్దున్మ్రి బృందారకుల్
వినుతింప న్నుజనాళిఁ బ్రోచునిను సేవింతు న్మదిం గేశవా! 35

శా. ధీమంతుఁ హనుమంతు నేలి రవిసూతి న్గాన వాలి న్బలో
ద్దామముం గోల నొకంటఁ గూల్చి జలధిఁ గోత్రంబులం దేల్చి మి
త్రామాత్యాదులతోడ రావణుని సంగ్రామంబునం గూల్చి స
త్ప్రేమ న్బ్రోచితి వవ్విభీషణుని ధాత్రీనాథ శ్రీకేశవా! 36

మ. ధరణీజార నిజాంకపీఠిఁ జెలు వొందఁ రత్నపీఠంబుపైఁ
జరణాబ్జంబులు మారుతాత్మజుఁడు సంస్పర్శించి సేవించ వా
నరనాథుల్ భరతాదిసోదరులు నానాదేశవాసు ల్మ్రొనీ
శ్వరులున్గొల్వఁగ నొప్పునిన్నుఁ గొలుతుఁ స్వాంతంబునం గేశవా!

శా. ఆపద్బాంధవ ద్రోణనందనుని దివ్యామోఘబాణాగ్నిసం
తాపం బాయభిమన్యుకాంతయుదరాంతస్థు న్బరిక్షిత్తునిఁ
వ్యాపింపం గరుణారసామృతముచే నబ్బాలునిఁ బ్రోవవా
ప్రాపై మున్నటు నన్నుఁ బ్రోవు మిపుడే పద్మాక్ష శ్రీకేశవా!

మ. మతిచాంచల్యము మాన దాయె ఘనదుర్మానంబు మెండాయె సం
సృతి దాటం గతి దోచ దాయె మదిని న్నేవింపరా దాయె నీ
మతి దాక్షిణ్యముఁ బూన దాయె నిఁక ధర్మం బెందు లే దాయె నా
స్థితి యి ట్లాయె నిఁ కేమి చేసెదను లక్ష్మీనాథ శ్రీకేశవా! 39

శా. ఓ కారుణ్యసుధాపయోధి వరదా యోదీనకల్పద్రుమా
యోకంసాంతక యోనతా ర్తిహరణా యో దేవకీనందనా
యో కాళిందిహృదబ్జపుష్కరమణీ యోరుక్మిణీనాయకా
యాకుబ్జామృదుశయ్య మాని యిటు రావా యేమి శ్రీకేశవా!

శా. రారా రమ్మని యెంత వేఁడిన న జేలా రావు గోపాలకా
నారీరత్నము రాధికారమణి నిఁ రా నివ్వదో గోపికల్
దారి న్ని న్నరికట్టిరో సుజనులఁ దండించువారిఁ యమ
ద్వారంబుం జొరఁబంప జాగుపడెనో ధైర్యారి శ్రీకేశవా! 41

మ. బలభద్రాకృతి నొంది సర్వజగముల్ భద్రస్థితి న్గొంద దో
ర్బలలీలాగతి నాప్రలంబు యమునఁ గొల్వం బంచి రుక్మిఁ సభా
స్థలిలోఁ జంపి కలింగ దేశనృపతి న్దంతంబులం డుల్చి దు
ష్టుల నీరీతిని జంప లెక్క గలదే సూచింప శ్రీకేశవా! 42

మ. హరి నారాయణ కేశ వాచ్యుత నృసింహా కృష్ణ శ్రీరుక్మిణీ
వర దామోదర నీలనీరదనిభాభా భక్తమందార పు
ష్కరనాభా భవదూర భూమహర విష్వక్సేన ధైర్యారి న
న్దరుణం జూడుము శంఖచక్రధర లోకాధీశ శ్రీకేశవా! 43

మ. మృదుచేలంబు లొసంగ వాయకుఁడనా మే లైనపూదండల
న్మది నుప్పొంగుచుఁ బూజ సేయను సుదామాఖ్యుండనా నేను దు
ర్మదుఁడఁ భాగవతాపచారకుఁడ దుర్మానుండ దుర్వాదణీ
లదురాచారుఁడ నయ్య న న్నెటుల నేలం జూతువో కేశవా!

శా. రక్షోధీశ వసుంధరాధర సహస్రాక్షా సరోజాక్ష స
ద్రక్షా సాళ్వనృపాలశిక్ష నరహర్యక్షా సురాధ్యక్ష శ్రీ

కాననదావభక్షు బకదేవద్వేషదంతీంద్రహా
ర్యక్షా పాండవపక్షు నన్ను దయతో రక్షించు శ్రీకేశవా! 45

శా. శ్రీకృష్ణా మునివంద్య నీదుపదరాజీవద్వయాసక్తియున్
నీకల్యాణచరిత్రము ల్వినుటయు న్నీదాససాంగత్యమున్
నీకైంకర్యము నాచరించుట సదా నీనామముం బల్కఁగా
నీ కే మ్రొక్కెద నీవరంబు లిడుమీ నిత్యంబు శ్రీకేశవా! 46

మ. తనువు న్దార్ఢ్యత దప్పసాఁగెఁ దరిగెఁ ధైర్యంబు చాంచల్యముం
గనఁజొచ్చె న్మదిఁ దాపముఁ దొడరె నన్నా యేమి గానున్నదో
విను మెట్లైనను మేలె కాని జగతి న్విష్ణుండు దీనావనుం
డనుప్రఖ్యాతికి వెల్తి రా నివకు కృష్ణా దేవ శ్రీకేశవా! 47

మ. తిగ్రోల్తరక్కసు లుక్కు మీఱి జగముల్ తీవ్రప్రతాపంబుచే
వగ నొందింపఁగ బుద్ధరూపమున దేవాహుల్ భ్రమం జెందఁగా
విగతజ్ఞానులఁ జేయ ధైర్యబలముల్ విభ్రష్ట మైనంతటం
దిగకఁ దేవర వారిఁ బంపెఁ దగ మిత్తిం జేర శ్రీకేశవా! 48

మ. ఖగరాజాంబక కైటభాంతక రమాకాంతా జగద్వందితా
నిగమాంతస్తుత శంబరారిజనకా నే దీనుఁడ న్గావరా
యగభిద్విద్విషమారతాశనభుజంగారాతి నీవే కదా
జగతి న్నడ్డతి దీనసంతతికి సచ్చారిత్ర శ్రీకేశవా! 49

మ. పుడమి న్మున్నున్న కుచేలవిప్రుఁ డటుకు ల్మ్లిష్టించి మీ కిచ్చినం
గడుఁ బ్రీతి న్భుజియించి మీరు తుదకుం గాసైన నీకుంటి రా
తఁడు తత్పుణ్యముచేతఁ గాంచె సకలార్థంబుల్ రమానాథమీ
కిడినం బుణ్యము మోక్షముం గలుగ దే కృష్ణా హరీ కేశవా! 50

మ. గురుభక్తి న్మొనసంగె న్గదా ద్రుపదజా కుం డంటుకూరాకు ము
న్బరమప్రీతి నొసంగెనే శబరి యేపం డైనఁ దాఁ బంటితో
గొటికైనం దినకుండ వారిని ధర న్గూర్మి నటూక్షించవే
వరనిష్కైతుకసత్కృపాబ్ధివి గదా వర్ణింప శ్రీకేశవా! 51

మ. మునుల న్గా దని తప్పుఁ బల్కి వసుభూపుం డార్తిచేఁ గుందఁగా
మును రక్షించి మునీశ్వరార్చితుని శంభుం బూజఁ గావించుబా
ణుని శిక్షించితి రుద్రుఁ డడ్డపడఁ జూణూరారి సర్వస్వతం
త్రనటత్వంబు ప్రసిద్ధ మౌనటుల నక్ష రక్షించు శ్రీకేశవా! 52

శా. నాకంటె న్ఘనుఁ డెవ్వఁ డంచును మదోన్మాదస్థితిం జెంది నే
నేకాలంబున ని న్దలంపక వృథాభీష్టార్థసిద్ధుండ నై
నీకారుణ్యము లేమిఁ గాదె చెడితి న్నే నజ్ఞతం జెంది యో
శ్రీకాంతా శరణంటిఁ గావు నను సుక్షేమస్థితిం గేశవా! 53

మ. దురితానేకఫలంబుల న్గుడుపునుద్యోగక్రియాలోలభా
స్కరజాభీలకఠోరకాయవికటాకారస్ఫురద్వక్త్ర భీ
కరలంబోష్టక రాళదంష్ట్రినయనాగండభ్రువోత్యుగ్రకిం
కరులం గానఁగ నీక నన్ను దయతోఁ గావంగ దే కేశవా! 54

మ. అనుకంపామృతవార్ధి వంచు నిను నే నభ్రాంతము న్నోఁడినఁ
నను రక్షింపక మానెదే హరిహరీ నాపుణ్యమో లేక నీ
ఘనకారుణ్యపునై జమో యిది యెఱుంగఁ నాదు శ్రీరామ రా
మ నిరంతం బగుకృచ్ఛము న్జెఱుపవే మాకాంత శ్రీకేశవా! 55

శా. దండం బచ్యుత కృష్ణ కేశవ ముకుందా యంచుఁ గీర్తించినం
గొండల్వంటి ప్రచండపాతకమహాకోటు ల్వ్రాస న్గూలి పో
కుండ న్మానును నె దండభృద్భయము లేకుండఁ ధరఁ శార్ఙ్గ్
దండాఖండితవైరిఖండనవితానా కృష్ణ శ్రీకేశవా! 56

మ. ధృతగోవర్ధనధారణీధర సురాధీశాలికోటీరభా
సితరత్నద్యుతిదీప్తదివ్యపదరాజీవా యశోదాసుతా
శతపత్రేక్షణ భక్తవత్సల మునీశస్తుత్య కల్యాణసం
తతకారుణ్యకటాక్ష దుష్టజనభేదా కృష్ణ శ్రీకేశవా! 57

మ. కవిసంస్తుత్య జనార్ద నాచ్యుత విహంగాంకా హృషీకేశ కే
శవ గోవింద సరోజనాభ హరి విష్వక్సేన వైకుంఠ మా

ధవ దామోదర పద్మలోచన బలిధ్వంసీ స్వభూ విష్టర
శ్రవ భక్తార్తిపయోధికుంభజ ముసీశ స్తుత్య శ్రీకేశవా! 58

మ. శరణాపన్నశరణ్య నామొఱ వినం జా గేల నయ్యా హరీ
కరిప్రహ్లాదవిభీషణార్జునరుమాకాంతామరత్రానులక్
శర ణన్న న్వీని విన్న వెంటనె దయక్ సంరక్షణం జేయవా
వర దా మ్రొక్కెద నన్నుఁ గావు మటులక్ వైలంబె శ్రీకేశవా! 59

శా. శ్రీ విశ్వంభర నీలయుం గలిసి సంసేవింప సద్భక్తులక్
గావ న్సత్కృప మీఱి గౌతమవరగ్రామాధివాసుండ వై
సేవింపంగఁ దలంచినంతనె శుభశ్రీరాయురారోగ్యస
ద్భావంబుల్ కరుణించుమిమ్మునఁ దలతుం బద్మాక్ష శ్రీకేశవా!60

మ. ఫణిరాట్తల్ప యనల్ప సద్గుణకలాపా సాళ్వభూపాలఖం
డనచాతుర్యనిశాతరోప రిపురాడ్గర్వాపహానేక పా
వనచామీకరరత్నరంజితకలాపా వజ్రసంకాశమా
ర్గణసంపూర్ణకలాప పాపహర లోకాధీశ శ్రీకేశవా! 61

మ. త్రిజగత్పావనకృత్సుధారుచిలసద్దివ్యాపగారత్నత
ల్లజగంగాజననాదికారణసలీలాకార యుష్మత్పదాం
బుజభక్తాంఘ్రిసరోజరేణుకణసంపూతాత్మలం జేరి ని
న్భజియింపఁగ వరం బొసంగుము కృపాపాథోధి శ్రీకేశవా! 62

మ. కమలాధీశ సనందనాదిఘనయోగారూఢసుజ్ఞానస
త్తమహృత్కంజములందుఁ జిక్కనిభవత్కల్యాణరూపంబు ని
క్కముగాఁ ద్రాటను రోట నందసతి చిక్కం గట్టఁగాఁ జిక్కి లో
కమునం దీనసులభ్య మిక్కరణిగాఁ గాన్పింపవే కేశవా! 63

మ. అనిశంబుల్ మధుతుల్యతావకచరిత్రాకర్ణనాసక్తస
జ్జనసాంగత్యము సర్వభూతదయయుల్ సత్యంబు సంతృప్తియుల్
ఘనసుజ్ఞానము భక్తిసంకలితకైంకర్యంబునుం గల్గున
ట్లనఘా యేలుము దుష్టచిత్తుఁడను న న్నబ్జాక్ష శ్రీకేశవా! 64

శా. దండం బండజకాండకాండజశిఖోద్దామప్రకాండాంశుదృ
క్చండానేకనిశాతకాండహతదుష్టామర్త్యవిద్వేషిరా
ట్కాండా కంజభవాండపూరితపిచండా భక్తహృత్కంజమా
ర్తాండా మీపదపుండరీకములకు న్దండంబు శ్రీకేశవా! 65

శా. నీవే ది క్కయి కావకుండిన గటా నే నెవ్వరి న్వేఁడెదన్
దేవా భావభవద్విసాబ్జభవు లాదిక్పాలకోవేతు లై
నీవే ది క్కని సర్వకాలమును ని న్నేవించుచుండంగ న
న్నావ న్వే ఱొకదిక్కు గల్గునె దయన్ రక్షించు శ్రీకేశవా! 66

శా. శౌరీ దీనవిపద్గజేంద్రనృహరీ సర్వాఘహారీ దురా
చారా మర్త్యవినోధిపుష్కరకరీ చాణూరసంహారి సం
సారధ్వాంతహరీ మురారి త్రిగజగత్సంతోషకారీ సుమా
స్త్రీరిప్రస్తుత శ్రీహరీ నరహరీ దైత్యారి శ్రీకేశవా! 67

శా. రంగద్భక్తహృదబ్జభృంగ మునిచంద్రస్వాంతరాజీవచ
క్రాంగా రంగవిహంగపుంగవతురంగా సత్కృపాపాంగ స
త్సంగా పాపతమఃపతంగ ఘనద్దైత్యాధీశకంజాతసా
రంగా మేచకవారివాహసుకుమారాంగా హరీ కేశవా! 68

మ. పరనిందాత్మనుతుల్ ప్రతిక్షణము సంభాషించుచు న్నిత్యముం
బరహింసాచరణంబె మే లని మది న్భావించి గర్వించి స
త్పురుషుల్ సేయుసుబోధన ల్వినక దుర్మార్గాంధతం జేసి నే
దురితం బందితి మిమ్ము వేఁడితి ననాథుం గావు శ్రీకేశవా! 69

మ. జయ గోవింద ముకుంద కృష్ణ జలదశ్యామా భుజంగాధిరా
ట్శయనా దీనజనార్తిభంజన నిశాటారణ్యవైశ్వానరా
భయనాశాంచితనామ వారిరుహనాభా భానుతేజా బిలే
శయభూపార్చిత యోగిమానసనివాసా కృష్ణ శ్రీకేశవా! 70

మ. అగతి స్సీభమభవార్ణవోదరనిమగ్నాత్మ న్నమస్తాపరా
ధగరిష్ణు శరణార్థి మూఢతమచేతస్కు నను బ్రోవఁగా

దగునిర్హేతుకజాయమానవిలసత్కల్యాణకారుణ్యస
క్తగతిం దీనులఁ బ్రోచుసుప్రతము నీకే గాన శ్రీకేశవా! 71

మ. మృతివేళం గఫవాతపైత్యములు బల్మిం గంఠనాళావరు
ద్ధతచే మీఱినమీపదాబ్జములు నే ధ్యానింపరా దందుచే
మతిలో నేఁడు దలంతు నొక్కపరి న న్మన్నింపు మోదేవ నే
సతతంబుఁ స్మరియింప లేనిజడుఁడఁక సత్యంబు శ్రీకేశవా! 72

మ. తగదా నీచుల నన్నుఁ గావ దయలేదా నిన్ను నే వేఁడఁగాఁ
దగదా కుయ్యిడుచుంటి నీకు వినలేదా నీవు సర్వంబునం
దగురీతి న్వసియించి యుండు వఁట గాదా దీనులఁ బ్రోవఁగాఁ
దగుకారుణ్యము నీదుసొ మ్మగుట గదా తథ్యంబుగాఁ గేశవా!

శా. అయ్యా మ్రొక్కితి మ్రొక్కితి న్నొనుము కుయ్యాలింపు మాలింపు రా
వయ్యా యీవెతఁ దీర్చి చయ్యన ననుం బాలింపు పాలింపు మో
యయ్యా జాగిది వద్దు వద్దిఁక ను లే రన్యుల్ ననుం గావు మో
యయ్యా నమ్మితి నమ్మితి న్మదిని మి మ్మబ్జాక్ష శ్రీకేశవా!

శా. శ్రీకల్యాణగుణామృతాంబుధి సుధీచిత్తాబ్జతేజోనిధీ
నాకాధీశవిరోధిభూధరశచీనాథా విధీశస్తుతా
లోకాధీశ ధరాధిపా వ్రజవధూలోలా రమానాథ రా
ధాకాంతాననవారిజాతదిననాథా కృష్ణ శ్రీకేశవా! 75

శా. శ్రీలక్ష్మీశ భుజంగరాట్శయన మీశృంగారదివ్యాలయం
బాలోకించి నమస్కరించినయతం డంతంబునం భానుజా
భీలాకారలులాయ కేతనరుచి న్వీక్షింపఁ డేమాత్రముం
దాలాంకానుజ కృష్ణ కేశవ ముకుందా శౌరి శ్రీకేశవా! 76

శా. శ్రీగోవింద ముకుంద మందరధరా శ్రీమందిరా సుందరా
వాగీశత్రిపురాంత కేంద్రముఖ దేవస్తుత్యచారిత్ర స
త్త్వాగా భోగిశయాన దీనదివిషద్భూజా సనందాదిస
ద్యోగాధీశహృదబ్జపుష్కరమణీ యోగీశ శ్రీకేశవా! 77

శా. కాండాదిత్యవిరోధిఖండన రమాకాంతా మనోజ్ఞాతమా
ర్తాండా తీవ్రనిశాతకాండహత దేవారాతిరాట్కాండ వే
దండాపద్భర కాండజన్మమదవేదండా కృపాంభోధి నీ
యండం జేరితిఁ బుండరీకవరదా యబ్జాక్ష శ్రీకేశవా! 78

మ. కమలాధీశ భవత్కరస్థరిపురాట్కాంతారవిచ్ఛేదన
క్రమనిర్వక్రనిశాతకోటిఘనచక్రస్ఫార కాంతిచ్ఛటల్
సుమతు ల్మెచ్చ మదీయకిల్బిషతమస్సూర్తుల్ విధూనంబు లై
సమయం జేయును గాత సాధునుత కంజాతాక్ష శ్రీకేశవా! 79

మ. శర ణన్న న్గరిఁ గావలేదె మకరిం జక్రంబుచేఁ ద్రుంచి భా
స్కరసూనుం గృప నేల లేదె హరిజుం గాండాహతిం గూల్చి స
త్వరతం జేరె లొసంగి ద్రౌపదికి నాపన్నత్వముం బాపవే
శర ణంటి న్గరుణింపు సద్వినుత కంసధ్వంస శ్రీకేశవా! 80

శా. దారాపత్యధనాదిసంపదలు తథ్యం బంచు మోహించి సం
సారాంభోధి మునింగి యెన్నఁటికి లేశం బైన సౌఖ్యంబు నే
దారిం గానక దుఃఖి నైననను నీదాసుం గటాక్షించు స
త్కారుణ్యామృతవార్ధి పార్థసఖ సత్కల్యాణ శ్రీకేశవా! 81

మ. వనజాతాక్ష ముకుంద భక్తవరదా పద్మాలయాధీశ్వరా
వినతానందనవాహ నందతనయా వేదాంతవేద్యా నతా
వనశీలా కరుణాలవాల ధరణీపాలా కుచేలావనా
సనకాదిస్తుతనామ గౌతమవరస్థాన శ్రీకేశవా! 82

శా. నిన్నే నమ్మితి నమ్మినందుకు హరీ నీ విట్లుపేక్షించిన
న్నిన్నే వేఁడక మాన మాననినను న్నించింతురా సజ్జనుల్
నిన్నే చేతురు గాక నింద యిదియున్ నీ కిష్ట మైన న్నరే
ని న్నే మందుఁ దలంచుచుందు నెపుడు న్నీనామమే కేశవా! 83

శా. శ్రీలక్ష్మీవర నన్నుఁ గావగలవా రేదిక్కునన్ లేమి నీ
పాలం జేరినవాఁడ దీనుఁడఁ గృపాపాథోధి దీనావనా

పాల న్మ్రుంచిన నీట ముంచిన సరే భారంబు నీ దాట నా
కేలా వే ఱొకచింత ని న్నిలిచెదం గృష్ణా మదిం గేశవా! 84

శా. నన్ను న్నీచినఁ గావకుండినను నీనామంబు నాచిత్తమం
దెన్నండు న్మఱవంగఁజాల నిఁక నీయిష్టానుసారంబుగా
వెన్నం గొట్టిన రాతఁ గొట్టినను నీవే కాక నా కెవ్వ రా
పన్నానీకశరణ్య భక్తవరదా పద్మాక్ష శ్రీకేశవా! 85

శా. శ్రీరామామణితో శుచిస్మితముఖశ్రీకాంతితో సత్కృపా
సారస్ఫూర్తులఁ జల్లువీక్షణముతో సౌవర్ణ చేలంబుతో
చారుస్వర్ణకలాపరత్నరుచితో సౌందర్యరూపంబుతో
రారా శార్ఙ్గసుదర్శనాయుధధరా రక్షించరా కేశవా! 86

శా. నందాభీరకుమార మారజనకా నాగారివాహా సదా
బృందారణ్యనివాస వాసవనుతా విశ్వేశ విశ్వాత్మ స
ద్బృందారామవసంత సంతతదయావిర్భావనేత్రాంచలా
కందశ్యామల సుందరాంగ వరదా కంజాక్ష శ్రీకేశవా! 87

శా. క్షీరాంభోనిధి యిల్లుగాఁ గొనఁగ నీకే చెల్లు నీధామమే
చేరం జెల్లు నటంచు సజ్జనుఁ డెదం జింతిల్లు నీనామమే
సారం బై భువిఁ జెల్లు ని న్దలఁప సంసారాపదల్ డొల్లు నీ
కారుణ్యం బిటు చల్లు దాసునిపయిం గంసారి శ్రీకేశవా! 88

మ. ఖగరాజేంద్రుని నెక్కి చక్రమున శక్రారాతులం జెక్కి స
త్త్వగరిష్ఠస్థితి నిక్కి వార్ధిసుతసేవం జొక్కియు న్ధాత్రి పై
న్వగతో ద్రొక్కి భరం బడంపు మనఁగా వాత్సల్య మే పెక్కియూ
జగతిం గాచితి కృష్ణ గౌతమవరస్వస్థాన శ్రీకేశవా! 89

మ. జలజాక్షా ముచికుందరక్ష ఖలశిక్షాదక్ష దామోదరా
బలభిన్నీలశరీర భక్తవరదా ప్రహ్లాదసంరక్షణా
కలశాంభోధినికేతనా నరసఖా కల్యాణరత్నాకరా
లలితానందవిలాస దాసజనలోలా శౌరి శ్రీకేశవా! 90

శా. చింతింపంగఁ దరంబు గానివెతలఁ శ్రీకాంత నే నెంతయే
సంతాపంబును జెంది కుంది వగ సశ్రాంతంబు చింతించి యే
చెంతం ది క్కొకయింత గానక దయాసింధుండ వీ వంచు నీ
చెంతం జేరితి దంతిరాడ్వరద రక్షించంగ దే కేశవా! 91

శా. అక్రూరావన పాంచజన్యధర కంసారాతి కాళిందియం
దక్రూరుండు కృతార్థుఁ డై వెలయ నీయాకారముం జూపి న
ట్లక్రూరత్వ మొసంగి నాకు భవదీయాకారముం జూపవే
శక్ర స్తుత్య పయోజనాభ సకలేశా శౌరి శ్రీకేశవా! 92

మ. దనుజాధీశవిరామ రామనృపసుత్రామా బలోద్దామ పా
వనానామా రణభీమ భీమనుత భావాగమ్యధామా బుధా
వనకామా శుభధామ ధామనిధిసద్వ్యంశాబ్ధిసోమా దయా
ఘనసీమా బలరామ గోపవనితాకామా హరీ కేశవా! 93

శా. రారా నందకుమార నందకధరా రారా జగన్మోహనా
రారా వార్ధిగభీర ధీరవినుతా రారా గజేంద్రావనా
రారా దైత్యవిదార మందరధరా రాకేందుబింబాననా
రారా మ్రొక్కెద వేగ భక్తపరతంత్రా శౌరి శ్రీకేశవా! 94

శా. క్షీరాంభోనిధికన్యకాహృదయరాజీవాంబుజాతాప్త గో
త్రారాతిప్రముఖామరాధిపకిరీటాగ్రస్ఫురద్రమ్యనా
నారత్నాంతరబింబితాంఘ్రివిలసన్నాళీకయుగ్మంబు నే
నారాధించెద మ్రొక్కి నామనమునం దశ్రాంతముం గేశవా! 95

శా. శ్రీకాంతా తగ దింత నిర్దయను నీచిత్తంబునం బూనఁగా
నా కేచెంతను లేదు రక్షకులు నెన్న న్మన్ను దంతిం దయా
లోకస్ఫూర్తిని నేలినా వనుచు నీలోకుల్ నుతింపంగ నే
నీకారుణ్యము విందు నెల్లపుడు సన్మిత్రావనా కేశవా! 96

శా. శ్రీక్షీరాబ్ధినికేతనా ఫణిఫణాశ్రీరత్నవిభ్రాజితా
రక్షోధీశవిఖండనప్రకటచక్రస్ఫారహస్తాబ్జ యో

గిక్షేమంకర సంస్కృతిప్రశమనా కృష్ణా జగన్నాథ స
ద్రక్షా పాండవపక్ష నన్నుఁ గరుణ రక్షించరా కేశవా! 97

మ. స్థిరసౌఖ్యప్రద యుష్మదద్భుతకృపాసింధూద్గతాత్యల్పకో
కరహేతూద్గతవాక్యసంతతి భవత్కల్యాణనామాంకిత
స్ఫురితవ్యాఖ్యమదేభవృత్తములుగాఁ బొల్పొంది కాన్పించెఁ గా
క రమానాయక నాతరంబె పలుకం గైకొమ్ము శ్రీకేశవా! 98

శా. ఏలా దీనుల నేల జాలి గలనీ వీవేళ న న్నేలఁగా
జాలి న్నీమదిలోన మాన కిటులం జా గేల. సేయ రమా
లోలా కాంచనచేల మొక్కెదను జాలుం జాలు నీ జాగు నేఁ
దాళంజాలను వేగ నేలు కృపతో దైత్యారి శ్రీకేశవా! 99

మ. వరసత్యామలభాష నీలవపుషా వందారుతోషా నిశా
చరదూషా సుగుణాంబరీష నృపపోషా భక్తహృత్కంజపూ
ష రమాశ్లేష సువర్ణరత్నమయభూషా గోపకాంతామనో
హరకైశోరసువేష తల్పకృతశేషా ప్రోవు శ్రీకేశవా! 100

మ. కొలువుండందగుమేల్ హుజార మగుచుం గూర్చుండఁ బీఠంబుగాఁ
జెలు వారత్నసితాతపత్ర మగుచుఁ శ్రీభూసతుల్లొల్వ స
ల్లలితానందముతోఁ బరుండ సుమతల్పం బై భవద్దాసుఁ డై
కలకాలంబు నటించుశేషుఁడు దయం గాచున్నను గేశవా! 101

మ. అరదంబుఁ బెనుబంటు కేతనము తా నై నిత్యకైంకర్యత
త్పరత న్నిమ్ము వహించి రాత్రిచరులఁ దండించుయుష్మత్ శ్రమ
న్వారపటుద్వ్యయచామరానిలముచే వారించుచుఁ ద్వేషులఁ
ధరణిం గూలఁగఁ దాచుతార్క్ష్యని మదిఁ ధ్యానింతు శ్రీకేశవా!

శా. వింటిఁ నీకృప నమ్మియుంటి నిఁక నుర్వి న్దిక్కఁ నీకంటె లే
దంటి న్వే ఱొకచో దయావనధి వీ వంటి న్మహాపాపి నా
కంటెం బాపుల నేల విశ్వమున నీకంటెఁ సమర్థుండు లే
డంటిఁ నీశర ణంటి నేలు మొఱ నీ వాలించి శ్రీకేశవా! 103

మ. చతురాస్యాదులచేఁ బను ల్గొనుచు నశ్రాంతంబు యుష్మత్పదా
శ్రితుఁ డై తావకపాదపద్మయుగసంసేవాసమాయాతసం
గతనానాదివిజావళీజనిత మౌక్రంద్యు నివారించి సు
స్థితుఁ డౌసూత్రవతీకళత్రుని మదిం జింతింతు శ్రీకేశవా! 104

మ. యవనాభీరకిరాతహూణముఖదుష్టాసీకవిధ్వ స్తధ
ర్మవిధిం జెంది నశింప నున్నజగతిఁ రక్షించఁ గల్యంతమం
దవనిం గల్కితనంబునఁ ఖలుల సంహారంబుఁ గావించి ధ
ర్మవిధిఁ శాశ్వతలీల నిల్పుదువు ధర్మం బొప్ప శ్రీకేశవా! 105

శా. శ్రీయారోగ్యయుతాయురవ్యయపదశ్రీప్రాప్తికి న్మూల మౌ
నీయష్టోత్తరతం దనర్చుశతకం బేప్రొద్దు సద్భక్తితో
మీయం దాత్మను జేర్చి విన్నఁ జదువ న్నీప్రేమకుం బాత్రుఁ డై
మాయాసంసృతిదుఃఖమున్నడచి బ్రహ్మానందుఁ డౌఁ గేశవా!

శా. రాణించు న్సిరి మీఱి గౌతమవరగ్రామంబు తద్వాసు లౌ
కానూర్యన్వయులందు శీనయ దగఁ గన్నట్టిరామయ్యకుఁ
సూనుం డై తగులింగమూర్తికృత మై సొంపొందుయుష్మ
[త్కృపఁ
జా నౌనీకృతి నంది నిల్పుము ధరఁ సత్యంబుగాఁ గేశవా!

శా. శ్రీరామాక్షితినీళలుం గలసి సంసేవింప భోగీంద్రుపై
గారా మారఁగఁ బవ్వళించి జగముల్ కారుణ్యతం బ్రోచునీ
నీరేజాతనిభాంఘ్రియుగ్మమునకు న్నిత్యంబు సన్మంగళం
బౌ రాజీవభవాదినిర్జరులు సంభావింప శ్రీకేశవా! 108

సంపూర్ణము.

శ్రీమతే రామానుజాయ నమః.

నక్షత్రమాల.

—★—

సీ. శ్రీరమాధీశ సంశ్రితదీనమందార
గోవింద కృష్ణ ముకుంద వరద
కేశ వాచ్యుత రామ గీర్వాణనుతనామ
కైవల్యధామ సత్కాంతిసీమ
నారాయ ణానంత నారసింహ యుపేంద్ర
చక్రగదాఖడ్గశార్ఙ్గపాణి
వాసుదేవ ఖగేశవాహన వనమాలి
కౌస్తుభశ్రీవత్సకలితవక్ష

గీ. స్వర్ణ మణికుండలాంగదవరకిరీట
హారకటకాదిభూషణచారుమూర్తి
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ !

సీ. నీలకంధరగాత్ర నీరజదళనేత్ర
పావనచారిత్ర పతగపత్ర
నీలకంధరమిత్ర నిఖిలలోకపవిత్ర
మానిరాట్స్తోత్ర రమాకళత్ర
పంక్తికంధరజైత్ర పద్మబాంధవగోత్ర
సజ్జనవనచైత్ర సాధుచిత్ర
దశరథవరపుత్ర దనుజకైరవమిత్ర
దాససంసారలతాలవిత్ర

గీ. స్వర్ణకటినూత్ర రక్షితపాండుపుత్ర
నీపదాశ్రితు న న్నేలు నిశ్చయముగ

దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! 2

సీ. వందనం బరవిందమందిరాంచితవక్ష
వనజనాభ ముకుంద వందనంబు
వందనం బఖిలసద్భక్తకల్పకభూజ
పతితపావననామ వందనంబు
వందనం బసురవిధ్వంసనాహవలోల
వామదేవస్తుత వందనంబు
వందనం బహిరాజవరతల్పకశయాన
ప్రహ్లాదపోషక వందనంబు
గీ. నందనందన నీ కిదే వందనంబుఁ
జేసి వేఁడెద నామొఱ చిత్తగింపు
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! 3

సీ. కాంచనచౌర్యముల్ కడుఁ బెక్కు లెన్నఁగా
మధువుఁ ద్రాగుట పెక్కు మాఱు లరయ
భ్రూణహత్యల పరిమాణంబుకొలఁదియే
గురుతల్పగము లెన్నఁ గోట్లకొలఁది
యిట్టిపాతకముల నెన్నక చేసి నేఁ
జేసితి పాతకస్నేహ మెప్పు
డితరకిల్బిషములు మితిమీఱి నొనరించి
నట్టిపాపిని నన్ను నలిననాభ
గీ. పతితపావననామసంస్తుతియు నీకుఁ
గలదు గావున రక్షించు కరుణతోడ
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! 4

సీ. యాచకజనులకు దాఁచ కివ్వఁగ లేదు
కాసైనఁ దుద కొకవీస మైన
నిచ్చెడువారల మెచ్చ కసూయచే
వీక్షించుచుండుదు వెగటు నందఁ
బహులసంపదఁ జూచి పరితపించుటె కాని
సంతసించుట లేదు సాధురీతి
నితరకాంతలఁ గని యిచ్చఁ జెందుట గాని
మాతృభావముఁ గాంచి మనుట లేద

గీ. యింతనీచుని నన్ను నీ వేలకుంటె
పతితపావనబిరుదు నీపాలి దగునె
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ ! 5

సీ. శ్రీభూమినీళలసేవఁ జొక్కెడునిన్నుఁ
గుబ్జ కౌఁగిలిఁ జిక్కఁ గొని చెలంగె
బ్రహ్మాదిసురలు నీపంపుఁ జేయుచు నుండఁ
బాండవుల్ దూతగాఁ బనులు గొనిరి
లోకనియంత వై జోకఁ జెందెడినిన్ను
నరుఁడు రథంబుల నడపఁ బంపె
శ్రుతిశిరోమణులచేఁ జిక్కనినిను రోట
నంటఁ గట్టెను బ్రాట నందతరుణి

గీ. యిట్టి నీదాససౌలభ్య మెన్నఁ దరమె
శ్రీరమాధీశ గోవింద శేషశయన
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ ! 6

సీ. ధరను విశ్వామిత్రదండనఁ జేయుఁగాఁ
బుట్టి విశ్వామిత్రుఁ బ్రోచినావు

శివధర్మసంరక్షఁ జేయఁగా దొరకొని
శివధర్మభంగంబుఁ జేసినావు
భువనరాశిని గావఁ బూని బాణముచేత
భువనరాశిని నొంపఁ బూనినావు
పుణ్యజనప్రీతి పొల్పొందఁ జేయఁగాఁ
బుణ్యజనావళిఁ బోరఁ జంపి

గీ. తౌర నీచిత్రచారిత్ర మద్భుతంబు
దీనజనపాల రామ సుధీవిశాల
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! 7

సీ. కన్నవారలు మున్ను కానలఁ బడియుండఁ
బెంచువా రడవిని సంచరించ
మేనత్తకొడుకులు మేదినిఁ జెడిపోయి
వేసముల్ దాలిచి దాసు లైనఁ
గొడుకు కపర్దిచే నొడలఁ గోల్పడి పోవ
బాణుచే మనుమఁడు బందెపడిన
మాతామహుఁడు వృద్ధు మత్తుఁ డౌసుతునిచే
సంకెళ్ళఁ బడి మదిఁ జంచలించ

గీ. నీకుఁ గలవారె వీరల నేలినావె
మంచిహయ గలసామి ని న్నెంచవలయు
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! 8

సీ. సిరి యెంత గల్గిన సురలు సేవించిన
నందగోపునిసుతుం డందు రెపుడు
చక్రంబు గల్గిన శత్రుల గెల్చిన
నరసారథి వటంచు నాడ రెట్లు

స్థిరబ్రహ్మచారి నం చెఱుగఁజేసిన గోపి
కాజారుఁ డనరె యీభూజనములు
కమలాసనుఁడు నీదుకాళ్ళకు మ్రొక్కిన
నాలికి మ్రొక్కితి వనరె నిన్నుఁ

గీ. జిన్న పెద్దని యెఱుఁగక యెన్నిపనులు
చేసినను నీకు ఫల మేమి చేరఁగలదు
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ ! 9

సీ. తావకపదవారిపావనాతిశయంబు
సర్వజ్ఞుఁ డైనట్టిశంభుఁ డెఱుఁగు
నీనామమహిమ దా నెఱుఁగక తలఁచిన
మేదినీసురుఁ డజామిళుఁ డెఱుఁగు
మీపదాంబుజ రేణు మేటిప్రభావంబు
గౌతమమౌనీంద్రకాంత యెఱుఁగు
మీదయామహిమంబు మీ కపకారి యై
శర ణన్న కాకరాక్షసుఁ డెఱుంగు

గీ. దాసపరతంత్రుఁ డని నిన్నుఁ దథ్యముగను
వాసి మీఱినమౌని దూర్వాసుఁ డెఱుఁగు
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ ! 11

సీ. శబరి యెంగిలిపండ్లు చక్కఁగా నర్పింప
మెచ్చి దానికి మోక్షు మిచ్చినావు
పాత్ర నంటినపాచి బల్చుకూ డిడినపాం
చాలి నేలఁగ నీవు సాలినావు
పుడమివేలుపుచేతి పిడికెఁ డటుక్కులు గొని
సిరి లెల్ల వానికిఁ జేర్చినావు

పుడమి మూఁడడుగులు పొలదిండి యిచ్చిన
వానివాకిటఁ గాపుఁ బూనినావు

గీ. ఇంతమాత్రము నీ కెవ రివ్వ లేరు
దండ మర్పింతుఁ గైకొమ్మ్ము దయ దలిర్ప
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! 11

సీ. శ్రీరుక్మిణీనాథ చిత్తగింపుము నేను
మనవిఁ జేసెద నీవు మనసు గుదిరి
శరణాగతత్రాణబిరుదు నీ కుండిన
శరణంటి ననుఁ బ్రోవు కరుణతోడ
పతితపావననామ ప్రఖ్యాతి వలసిన
నాలసించక వేగ నేలవలయు
నావంటిపతితుఁ డేనాఁటికి దొరకునా
యిపు డుపేక్షించిన నేమి ఫలము

గీ. జాగు సేయక యేలు మో చక్రపాణి
వేగ వేంచేసి రక్షించవే మహాత్మ
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! 12

సీ. జన్మజన్మమునందు శత్రువై చేదీశుఁ
డమరకై వల్యంబు నధివసించెఁ
బ్రతిజన్మమున నిన్ను సుతునిగాఁ గాంచిన
తలిదండ్రులకును సంకెళ్లు గలిగెఁ
బాండుపుత్రులు నీకు భక్తులై యడవులఁ
బడరానియిడుములు పడిరి మున్ను
వారికి నపకార మూరక చేసినఁ
గురురాజు చెన్నొందె సిరులఁ జెంది

గీ. మిత్రు లాకంచె మీకు బల్‌శత్రు వైన
మేలు గాఁబోలుఁ దెలియ నేఁ జాలనైతి
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ ! 13

సీ. నీనామ మే మందు నిఖలవ్యాధుల కెందు
నిను వేఁడుకొందు నామనమునందు
సకలభూతములందు సమవృత్తి నీ వుందు
వధికులు గనుగొందు రాత్మలందు
దీనుల కెందు నీదిక్కు మే లై చెందు
ధరఁ గావఁ బుడితి ద్వాపరమునందు
నేలితి ముచికుందు నెవరు నీ సరిఁ జెందు
పూతనఁ జంపితి పురిటియందు

గీ. దాసజనులందు దయ నీవు దలఁచకుందు
వేని నపకీర్తి చెందు నీపృథివియందు
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ ! 14

సీ. బ్రహ్మాండముల కెల్లఁ బై నుంటివా యేమి
మొఱ పెట్ట విని రావు మురవిరోధి
భక్తుల కెల్లను బరతంత్రుఁడవు గాన
వారు రానివ్వరా వారిజాక్ష
యఖిలాండకోటిబ్రహ్మాండముల్ పాలించి
బడలితివా యేమి పద్మనయన
శ్రీరమాసతిఁ గూడి శేషతల్పమునందు
సొక్కి పరుంటివా చక్రనయ్య

గీ. మున్ను కరిరాజు మొఱ విని యెన్నరాని
వేగమున రావె యిపుడు నీ వేల రావు

దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ ! 15

సీ. శ్రీరమ నీయన్ను సేవించెదను నిన్ను
వరకృపతో నేల వలయు నన్నుఁ
గరిరాజుఁ గాచితి కరుణతోడ విపన్ను
విమతవీరులకు మేపితివి మన్ను
నిష్ఠురశకటుని నిలఁ గూల్చె నీతన్ను
నాకము శిరము నీనాభి మిన్ను
సురలకుఁ బెద్ద నీసుతుడు సృష్టిని బన్ను
బుధవరుఁ డెన్ను నీకథలచెన్ను

గీ. కమలజాదులు ధర్మము గావ నిన్ను
వేఁడుకొన నీవు గలిగితి పృథివి మున్ను
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ ! 16

సీ. పరమపావన మైనభవదీయనామముల్
పలుకనికపటదుర్వ్యాదరతుఁడ
నీసత్కథావళు లాసక్తితో వినఁ
దలఁపనియిష్టకథారతుండ
నీపాదభక్తుల నిజముగా నమ్మని
మూర్ఖుల కెల్లను మొదటివాఁడ
నీదివ్యదేశముల్ నిశ్చయజ్ఞాని నై
సేవించి యెఱుఁగనిచెనటి లుబ్ధ

గీ. నై ననను నేల నెవ్వని కలవి గాదు
నీకుఁ గాక రమానాథ నిఖిలపోష
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ ! 17

సీ. శ్రీరమ సీచాన శేషతల్పశయాన
శరణు వేఁడితిఁ గాన గరుడయాన
యేల రమ్ము బిరాన నెందున గతిఁ గాన
దాసునిఁ గాన నిం దలఁచుకోన
కరి నేలితివి గాన కమలాకరములోన
నీసరి గాన నిర్జరులలోన
సర్వంబు నీలోన సత్యంబుగాఁ బూన
నెఱిఁగినసామి నఁ గరుణతోన

గీ. నేల కుంటివ నీకాన నింక నైన
దయను రక్షింపఁ జూడుమీ తలఁపులోన
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! 18

సీ. జడనిధి తనసిరి సన్మతి నీ కొవ్వాఁ
బొమ్మువై వానింటఁ బండు లేమి
త్రిదశారి బలి నీకుఁ ద్రిదివ మంతయు నివ్వ
గదఁ బూని వాకిటఁ గాచె దేమి
కుబ్జ గంధము నీకుఁ గూర్మితో నిచ్చినఁ
గొని దానిఁ గైకొని కూడు లేమి
సకలంబు నీ కిచ్చి సన్యాసు లై యుండ
విడువక వారల వెంబడింతు

గీ. విట్టివాఁడవు మిత్రుల కిచ్చినావె
వారివే కొందు వటుకులు చేరెఁ డైన
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! 19

సీ. శ్రీ మాటి విలసిల్లుఱొమ్మురాబ్ధి నీ యిల్లు
లోకముల్ పాలింప నీకె చెల్లు

శ్రీవత్సకౌస్తుభశ్రీలచే భాసిల్లు
దేవ మీాయురము శ్రీదేవి కిల్లు
దనుజాళి నీపేరుఁ దలఁచిన భీతిల్లుఁ
బోరఁ జంపితివి చాణూరమల్లుఁ
గమలజాద్యమరాళిఁ గానక చింతిల్లు
వరద నిం దలఁపఁ బాపములు డొల్లు

గీ. మీాకృపామృత మెపుడు నామీాఁదఁ జల్లు
మా ర్తి చెడి పెల్లు నీకీ ర్తి యవని నల్లు
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ ! 20

సీ. సమవ ర్తి పట్టి యజ్ఞము సేయఁ దలపెట్టి
నిను వేఁడఁ గృప పుట్టి నిలను జెట్టి
యగుజయద్రథుపట్టి కనిలజుఁ దలపెట్టి
గెలిపించి జగతిపైఁ గీ ర్తిఁ జుట్టి
సత్రంబు తుదముట్టి సంతోష మెదఁ బెట్టి
యగ్రార్చనము భవదంఘ్రిఁ బెట్టి
వినుతింపఁ జలపట్టి వీఱిడి యై తిట్టి
కావరంబున మీాఁదఁ గదియునట్టి

గీ. చేదివరుఁ గొట్టి చక్రంబు చేతఁ బట్టి
నట్టిమీాదయఁ గోరెద నతులఁ బెట్టి
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ ! 21

సీ. ప్రజలకుఁ బతి యని పల్కుమాత్రమె పెద్ద
కొడుకుఁ జూడఁగఁ దలకొట్లమారి
రెండవపుత్రుండు దుండగీఁ డై పాంథ
జనుల బాధలఁ బెట్టుఁ జపలుఁ డగుచు

మనుమఁడు జగదేకమాన్యుఁ డన్మాత్రమే
కైలాటములు పెట్టుఘనుఁడు జగతి
మర్యాద గలవాఁడు మామగా రంటిమా
కారుకీలాలంబు ఘనుల కిచ్చు
గీ. నింత చక్కని నీవారి యింటినడత
నెన్ని విడుతునె నీవు న న్నేలకున్న
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ ! 22

సీ. అన్న గోత్రారాతి యక్క మాయలజాతి
ప్రియబంటు మున్నొక పెద్దక్రోఁతి
పుణ్యజనశ్రేణి పొలియించు నీహేతి
కువలయంబున నీది గొల్లజాతి
జడధిలోపల మున్ను జనియించె నీనాతి
చెల్లెలు గొని చనె జిష్ణునూతి
మేటిశూరుఁడు నీకు మేనమామ యరాతి
దీ ర్చినవాహంబు తెల్లమూతి
గీ. నిఖిలసంపద లి ట్లుండ నీదె ఖ్యాతి
భక్తులను నేలు పాండవపక్షపాతి
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ ! 23

సీ. పాతకంబులు జూఱఁ బల్కిన నీపేరు
ఖలు లైనవారు నిం గానలేరు
నిన్నెఱింగినవారు నిశ్రేయసముఁ జేరు
మహిమీఁద జన్మింప మఱల రారు
నీ భక్తు లగువారు నిరయంబునకుఁ బోరు
చుట్టదానవులు నీతోడఁ బోరు
నీపోరఁ దెగువారు నిర్జరాదుల మీఱుఁ
దెలిదీవి వారల కెలనుఁ జేరు

గీ. స్థిరను నెవ్వారు నీదాసశ్రితులు గారు
వారు చెడువారు నీదరిఁ జేర లేరు
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! 24

సీ. శ్రుతులు గోల్పోయినసుతునికై యప్పుల
మునిఁగి తేలుచు వానిఁ గొనఁగ లేదె
సుర లర్థు లై వేఁడ సుర గొనుఁ డని చెప్పి
కొండక్రిందను దూఱి యుండ లేదె
స్వర్ణాంబకుండు దా వసుమతి గొనిపోవఁ
గోలరూపమును గైకొంటి గాదె
వానిసోదరుఁడు నీభక్తుని బాధింప
మానవసింహతఁ బూన లేదె

గీ. వేషగాఁడవు నినుఁ గాన వెరవు లేదు
ఏవిధంబునఁ బ్రోచెదో యెఱుఁగ లేదు
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! 52

సీ. కనకదుకూలముల్ కట్న మర్పింపంగఁ
గాను వాయకుఁడను గనక చేల
పూలదండ లొసంగి పూజించుటకు నేను
ఘనసుదామునఁడఁ గాను వనజమాలి
సరసంబుగా మేనఁ జందనం బలఁదఁగాఁ
గుబ్జను నేఁ గాను కుతలపోష
వివిధపాకంబుల విం దొసరింపఁగా
విదురుండ నేఁ గాను విబుధవినుత

గీ. శాకజలలేశముల నిచ్చి సత్కరింప
ద్రౌపదిని గాను ద్రొక్కెద దయను జూడు
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! 26

సీ. ధరణి భరద్వాజవరసుధాంబుధిచంద్రుఁ
డమితశ్రీభాష్యతత్త్వార్థవిదుఁడు
తిరుమలపురిఘుళ్ళనరసింహ దేశికు
చరణసరోజాతసంశ్రితుండఁ
గానూరిరామయగర్భసంజనితుఁడ
లింగమూర్తిసమాఖ్య లీల నొప్పి
మీదయామహిమచే మీ కర్పితము గాఁగ
సీసతారావళిఁ జేసినాఁడఁ

గీ. దావకాంఘ్రికుశేశయదాసదాస
దాసులకు నెల్ల దాసుఁడ దయ గ్రహింపు
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! 27

సీ. గణయతిప్రాసలక్షణము లెవ్వియు నేర
శబ్దశబ్దార్థసౌష్ఠవముఁ దెలియ
వృత్తరీతి యెఱుంగఁ జిత్తంబు మీపదా
సక్తము గొనుము నక్షత్రమాల
తప్పు సైరణఁ జేసి దాసుని రక్షించు
దాసపోషక నీకుఁ దగినలక్ష్మీ
భార్య బ్రహ్మ సుతుండు పరమపావని గంగ
పుత్రిక గగనము ఛత్ర మవని

గీ. భద్రపీఠంబు దేవతల్ భటులు శ్రుతులు
వందిగణముగ వర్ధిల్లు వైభవముగ
దాసజనదుఃఖతిమిరపతంగ దుష్ట
కంసమదభంగ నీలాంగ ఖగతురంగ! 28

సంపూర్ణము

శ్రీమతే రామానుజాయ నమః

రంగశతకము

—:o:—

క. శ్రీరంగనాయకీముఖ
సారసకంజా ప్త సూర్యశశిలోచన కా
వేరీస్థితభూషితస
ద్వారా శరణాగతా ర్తిభంగా రంగా! 1

క. శ్రీకర లక్ష్మీయుత సు
శ్లోక దయాలోక సర్వలోకశరణ్యా
కాకోదరతల్పక స
త్త్వాకర శరణాగతా ర్తిభంగా రంగా! 2

క. ధర చక్రనందకాభయ
శరశార్ఙ్గగతాబ్జ హస్త జలరుహలక్ష్మీ
కరదృగ్విలాస కరివర
వరదా శరణాగతా ర్తిభంగా రంగా! 3

క. గిరిధర రిపుగిరిపవిధర
ధరణీధర వరసుధీర ధై తేయహరా
హరసన్నుత విశ్వంభర
భరణా శరణాగతా ర్తిభంగా రంగా! 4

క. అభవా భక్తభయాపహ
త్రిభువనమయదివ్యదేహ దేవాధీశా
యభయ మొసంగుము సదయ
ప్రభువా శరణాగతా ర్తిభంగా రంగా! 5

క. శృంగారవాహినీశ భు
జంగాధిపతల్ప రంగసదన శుభాంగా
గాంగేయవినుత కరుణా
పాంగా శరణాగతా ర్తిభంగా రంగా! 6

క. అయ్యా కుయ్యాలింపుము
చయ్యన ననుఁ గావుమయ్య సదయుఁడ వయ్యా
వయ్యారిరంగ యిటు రా
వయ్యా శరణాగతా ర్తిభంగా రంగా! 7

క. కస్తూరిరంగ మ్రొక్కెద
నిస్తులకృపఁ బ్రోవు మయ్య నీకన్న నొరున్
బ్రస్తుత మెనరింపను స
త్త్వస్థిత శరణాగతా ర్తిభంగా రంగా! 8

క. కూటాసుర ఘోరాటవి
గీ టడఁచినకృష్ణ నీకుఁ గే ల్మ్రొగిచెద నో
హాటకచేల కృపానిధి
వౌటను శరణాగతా ర్తిభంగా రంగా! 9

క. నీభక్తుల ధర నెన్నం
డేభయమును జెంద నీక యీప్సితసంప
ల్లాభము లొసఁగెదుసద్గుణ
ప్రాభవ శరణాగతా ర్తిభంగా రంగా! 10

క. అంగజరిపుసన్నుత కా
ళింగభరణరంగనాట్యలీలాచరణా
భంగము వారించు కృపా
పాంగా శరణాగతా ర్తిభంగా రంగా! 11

క. వేసరక యెఱిఁగి యెఱుఁగక
చేసినదోసములు గుడువఁ జేయకు మయ్యా

దాసజనపోష సద్గుణ
భాసా శరణాగతా ర్తిభంగా రంగా! 12

క. దామోదర రామానుజ
రామా భృగురామ సద్విరాజితనామా
కామారివినుతగుణ స
త్త్వామల శరణాగతా ర్తిభంగా రంగా! 13

క. దుర్దశ పా లైతి నహో
కర్దమనుత నీదుకరుణ గలుగమి నాపై
నిర్దయ మానుము వినుతక
పర్ది శరణాగతా ర్తిభంగా రంగా! 14

క. నిరయము నిలయము యమకిం
కరకృతపరిభవము మాకుఁ గల్గిన పరువే
శరణార్థిఁ గావు మిఁక మీ
పరువా శరణాగతా ర్తిభంగా రంగా! 15

క. కామక్రోధాదిరిపు
స్తోమాపహృతప్రశస్త సుజ్ఞానధన
స్తోమము నా కొసఁగుము జిత
భామా శరణాగతా ర్తి భంగా రంగా! 16

క. దేహాత్మభ్రమకారణ
మోహముచే దుఃఖవార్ధి మునిఁగిననన్నున్
శ్రీహరి రక్షింపుము ఖగ
వాహన శరణాగతా ర్తిభంగా రంగా! 17

క. గోవింద కృష్ణ మాధవ
శ్రీవల్లభ వాసుదేవ శ్రీకంఠనుతా
గోవిప్రామరరక్షక
పావన శరణాగతా ర్తిభంగా రంగా! 18

క. నిరతముఁ దావకపదసం
స్మరణము నిముషార్ధ మైన మఱవక యుండన్
గరుణించి బ్రోవు ననుఁ గరి
వరదా శరణాగతార్తిభంగా రంగా! 19

క. దేహమునందలి ధాతుస
మూహము దుర్బలతఁ జెందె మురమర్దన దు
ర్మోహముఁ బాపుము ఖగపతి
వాహన శరణాగతార్తిభంగా రంగా! 20

క. అర్ణవశరధిసుపూజిత
కర్ణారిసఖా సమస్తకారణ విద్వ
ద్వర్ణితచరిత పయోధర
వర్ణా శరణాగతార్తిభంగా రంగా! 21

క. మురహర హరసరసిజభవ
సురవరముఖవినుతచరణ సుగుణాభరణా
శర ణన్న ననుఁ బ్రోచుట
భరమా శరణాగతార్తిభంగా రంగా! 22

క. గోవింద మాధవా వసు
దేవతనూజాత వాసుదేవ ముకుందా
గోవిప్రామరరక్షణ
భావా శరణాగతార్తిభంగా రంగా! 23

క. శంతనునందనసన్నుత
దంతివిపద్భుజగతార్క్ష్య తార్క్ష్యధ్వజ శ్మ
శ్యంతవిహార దయాసు
స్వాంతా శరణాగతార్తిభంగా రంగా! 24

క. హరశరశరనిధిదుర్మద
హరహరశరజాతసంభవాదికసురరా

డ్వారముఖ్యవినుత వారణ
వరదా శరణాగతా ర్తిభంగా రంగా! 25

క. ఖండితశరనిధి గర్వవి
ఖండిత శరజన్మజనక కాండాసనస
న్మండితకర శరహతదు
ష్మండిత శరణాగతా ర్తిభంగా రంగా! 26

క. నారాయణనామామృత
పారణ సంసరణతాపపరిహరణలస
త్కారణగుణ యఘుద్వైత్యని
వారణ శరణాగతా ర్తిభంగా రంగా! 27

క. రామానుజ కేశవ సు
త్రా మాపరజాతరామ రాజలలామా
భీమానుజసఖ నిర్జిత
భౌమా శరణాగతా ర్తిభంగా రంగా! 28

క. వార్ధిపరీతవసుంధర
సార్థం బగుమనుజజన్మ సమకూరియు నే
వ్యర్థుఁడ నైతిని విను నా
ప్రార్థన శరణాగతా ర్తిభంగా రంగా! 29

క. మీదాసుఁడ వ్యర్థం డన
రాదా యపకీర్తి యిందిరాపతి వైన
వా డేల ప్రోవు నను మృదు
పాదా శరణాగతా ర్తిభంగా రంగా! 30

క. బహువిధములఁ బ్రార్థించితి
బహుబాధల కోర్వ లేక పామరుఁడను న
న్నిహపరముల నేలుము ని
ర్వ్యహర్త శరణాగతా ర్తిభంగా రంగా! 31

క. ధన మార్జించెడుశక్తత
తనువున నున్నంతనఱకె తనయులు సతులుఁ
వినయతఁ బ్రోచుట బృందా
వనగృహ శరణాగతార్తిభంగా రంగా! 32

క. వెయ్యాడుసార్లు కుయ్యిడ
నయ్యా ననుఁ గావ వైతి వార్తుఁడ నయ్యా
కుయ్యిని విని కానఁగ రా
వయ్యా శరణాగతార్తిభంగా రంగా! 33

క. జాలి గొని యేల వేలర
మేలా యిది నీకు మండె మేల మ దేలా
యేలర యిఁక నైనను గో
పాలా శరణాగతార్తిభంగా రంగా! 34

క. సురరిపుపురసూదన భా
సురశర పురసూదనాదిసురవరమౌళి
స్ఫురదమలరత్నబింబిత
వరపద శరణాగతార్తిభంగా రంగా! 35

క. పతితుని ననుఁ గానక శ్రీ
పతి నీవు ధరించుపతితపావనబిరు దే
గతి నీకు దక్కునో సు
వ్రతహిత శరణాగతార్తిభంగా రంగా! 36

క. తావకదాసుల చరితము
నే వినవలెఁ బరమసుఖము లెనయుఁగ మదిలో
భావించెనేని మనుజుఁడు
పావన శరణాగతార్తిభంగా రంగా! 37

క. శ్రీదా నే మొఱ నిడ విన
రాదా నామీఁదఁ గరుణ రాదా నీకున్

లేదా ప్రోవవు నాతో
వాదా శరణాగతా ర్తిభంగా రంగా! 38

క. రాజకులక్షీరాంబుధి
రాజా భవదీయపాదరాజీవయుగ
భ్రాజితభ క్తి యొసఁగు మ
వ్యాజిత శరణాగతా ర్తిభంగా రంగా! 39

క. దేహాద్యభిమానమహా
మోహాంధత దుఃఖవార్ధి ముసిఁగిననన్నున్
శ్రీహరి సముద్ధరింపు వి
వాహా శరణాగతా ర్తిభంగా రంగా ! 40

క. శ్రీలోలా మృదుకాంచన
చేలా కరుణాలవాల శ్రితజనపాలా
నీలాలకాళిసంగత
ఫాలా శరణాగతా ర్తిభంగా రంగా! 41

క. కర్దమనుత యభిమర్దన
దుర్దమరిపుదర్దురాహి తోయధిగేహా
నిర్దయఁ బూనకు వినుతక
పర్దా శరణాగతా ర్తిభంగా రంగా! 42

క. నిన్ను వినా ధర నెన్నఁడు
సన్నపుదై వములఁ దలఁచి సన్నుతిఁ జేయన్
న న్నిపుడు ప్రోవుము మహా
పన్నుని శరణాగతా ర్తిభంగా రంగా! 43

క. వ్యాసాంబరీషశుకదు
ర్వాసవశిష్ఠాదిమౌనివర్ణిత వరదర్
హాసాస్యకమల లక్ష్మీ
వాసా శరణాగతా ర్తిభంగా రంగా! 44

క. వార్ధిసుతాసక్త మహా
పార్థత్రాణాభిమాన పరమనిధానా
సార్థక మొనరింపుము నా
ప్రార్థన శరణాగతార్తిభంగా రంగా! 45

క. కాంచనమణిమయభూషా
దంచితశృంగారవేష దైత్యజిగీషా
వంచనఁ జేయక నేలు శు
భాంచిత శరణాగతార్తిభంగా రంగా! 46

క. కుందారవిందచంపక
మందారజపాప్రసూనమండిత వరస్ర
క్చందనపరిమళ సురముని
వందిత శరణాగతార్తిభంగా రంగా! 47

క. ఫుల్లారవిందలోచన
తల్లియుఁ దండ్రియును గురువు దైవము నీ వై
యెల్లప్పుడుఁ బ్రోవుము శ్రీ
వల్లభ శరణాగతార్తిభంగా రంగా! 48

క. ఉచ్ఛిష్టశాకలేశం
బిచ్చినద్రాపదిని మెచ్చి యిష్టార్థముల
న్నిచ్చిననీకృప దెలియఁగ
వచ్చెను శరణాగతార్తిభంగా రంగా ! 49

క. సారంగముఁ గాచితి కా
సారంబున మకరిశరము చక్రాహతిచే
ధారుణిపై గూలఁగఁ బెం
పారన్ శరణాగతార్తిభంగా రంగా! 50

క. బలిప్రహ్లాదవిభీషణ
బలభిత్సుతపవనతనయప్రముఖుల కరుణన్

సలలితగతి నేలితి స
త్ఫలదా శరణాగతా ర్తిభంగా రంగా! 51

క. ఈషణత్రయసంసక్తమ
నీషత నేఁ జేయుఘోరనీచక్రియ ల
న్నోషింప కాదరింపు సు
భాషా శరణాగతా ర్తిభంగా రంగా! 52

క. హద్దు తెగి ని న్నెఱుంగక
గద్దరి నై పెద్ద పిన్న గాననిన న్నే
వద్దికతో నుంచుము నీ
వడ్డను శరణాగతా ర్తిభంగా రంగా! 53

క. పెద్దలకంటెను బెద్దవు
రద్ది సుమీ నన్ను నీవు రక్షింపమి నీ
పెద్దఱికమా మాను మాన్పు వి
పద్దశ శరణాగతా ర్తిభంగా రంగా! 54

క. కట్టడితన మెట్టిదియో
పుట్టుఱుఁగనినీదుమదిని బుట్టిన దారా
యెట్టిదో నాభాగ్యం బీ
పట్టున శరణాగతా ర్తిభంగా రంగా! 55

క. నెట్టన ననుఁ గరుణింపక
కట్టిడి వై యుండు వేని కనుగొను మిపుడే
గట్టిగఁ బెట్టెద నీ కొక
వట్టును శరణాగతా ర్తిభంగా రంగా! 56

క. వసుదేవుని తనయుఁడ వై
వసుమతిభర మదన వనజభవుప్రార్థనచే
వసుమతి జన్మించితి నీ
వసమత శరణాగతా ర్తిభంగా రంగా! 57

క. పూతన యనుశిశుఘాతిని
పాతకి యై విషపుఁజన్ను పా లొసఁగియుఁ దా
భూతిని జెందెను నిర్జిత
పాతక శరణాగతా ర్తిభంగా రంగా! 58

క. శకటనిశాటవిపాటన
మకుటిలపదకమలనిహత మగునటు సేయన్
సకలేశ్వర నీ కగు న
(?) ప్రాకృత శరణాగతా ర్తిభంగా రంగా! 59

క. బృందావనమందిర నత
బృందావన నందతనయ పృథ్వీధర సం
క్రందనముఖబృందారక
వందిత శరణాగతా ర్తిభంగా రంగా! 60

క. కువలయరక్షణతత్పర
కువలయహితవంశజలధికువలయమిత్రా
కువలయరుచిభాసుర దు
ర్భవలయ శరణాగతా ర్తిభంగా రంగా! 61

క. శితకమలనయన సంశ్రిత
శితకమలదినేశ కృష్ణ శివకర భాస్వ
ద్వ్రతకమలనాభ వరశా
శ్వతకృప శరణాగతా ర్తిభంగా రంగా! 62

క. శ్రీదా శ్రీధర మాధవ
యాదవకులసార్వభౌమ యమతనయనుతా
వేదాంతవేద్య భాస్వ
త్పాదా శరణాగతా ర్తిభంగా రంగా! 63

క. మురహరి నరసఖ సురమని
వరనుతచారిత్ర భక్తవత్సల కరుణా

కర వార్ధిశయన రత్నా
భరణా శరణాగతా ర్తిభంగా రంగా! 64

క. సురరిపుగిరిపవిధర శ్రీ
ధరణీధర వరరథాంగధర శార్ఙ్గధా
ధర గరుడతురగ భూసుర
వరనుత శరణాగతా ర్తిభంగా రంగా! 65

క. వరదా ననుఁ గరుణింపుము
నిరవధికదయాబ్ధి నీవు నీ వెన్నఁడు నా
సరి దయనీయునిఁ గాంచుట
భరమే శరణాగతా ర్తిభంగా రంగా! 66

క. నీదాసుని ననుఁ గావఁగ
రాదా వేదాంతవేద్య రాధాహృదయా
హ్లాదకర భావగర్భిత
వాదా శరణాగతా ర్తిభంగా రంగా! 67

క. నతకామితఫలదానా
హిత మొసఁగుట నీకుఁ బరమహిత మెటు లనినఁ
సతతము నతిఁ జేసెద నా
పతి వని శరణాగతా ర్తిభంగా రంగా! 68

క. మృదునూతనకనకాంబర
సదమలఘనకౌస్తుభాదిసన్మణిహారా
మదనారివినుత సుందర
వదనా శరణాగతా ర్తిభంగా రంగా! 69

క. పాకారిస్తుత కేశవ
వైకుంఠ ముకుంద కైటభాంతక శుభదా
లోకన ధేనుకహర వి
శ్వాకర శరణాగతా ర్తిభంగా రంగా! 70

క. సుర లింపుఁ జెంది చూడఁ
నరహరి నీనఖరములను నరభోజిని గా
సరవాజిపురముఁ జేర్చితి
వరుదుగ శరణాగతా ర్తిభంగా రంగా! 71

క. మును గజవల్లభుఁ గాచిన
ఘనకృప నేఁ డెందుఁ బోయెఁ గడుదీనుఁడ నై
నిను వేఁడ నాలసించెద
వనఘా శరణాగతా ర్తిభంగా రంగా! 72

క. ఫలమూలశాఖభోజన
మలవడ భుజియించి వ్రతము లై నను జేయఁ
దలఁపక మీనామము నే
వలచితి శరణాగతా ర్తిభంగా రంగా! 73

క. నే నార్తిఁ జెంది కుయ్యిడ
వీనులకుఁ వినఁగరాదొ విని ననుఁ గావఁ
బూనఁగ నీ కిల భారం
బై నదొ శరణాగతా ర్తిభంగా రంగా! 74

క. దయయును సత్యము శౌచము
నియమవ్రతజపము లెవియు నెఱుఁగనినాకుఁ
భయ మవు యమునిం దలఁచిన
భయహర శరణాగతా ర్తిభంగా రంగా! 75

క. నారాయణ నారాయణ
నారాయణ యనుచు నీదునామం బెపుడుఁ
సార మని మదిని నమ్మితి
వారక శరణాగతా ర్తిభంగా రంగా! 76

క. అవ్యయ సత్య సనాతన
దివ్యశుభానంత తేజ దీనశరణ్యా

సువ్యక్త సకలసద్గుణ
భవ్యా శరణాగతార్తిభంగా రంగా! 77

క. కార్యాకార్యవివేకం
బార్యానుమతానుకూల మగుయుష్మత్కృం
కర్యసుపూర్తియు నొసఁగు మ
వార్యా శరణాగతార్తిభంగా రంగా! 78

క. పన్నగవరశయన మహా
పన్నఁడ నై యున్ననన్నఁ బరిరక్షింపన్
నిన్నే నమ్మితి రారా
పన్నగ శరణాగతార్తిభంగా రంగా! 79

క. వైకుంఠ విష్టరశ్రవ
శ్రీకంఠస్తుత పరేశ క్షేమంకరల
క్ష్మీకమన శౌరి హరి వి
శ్వాకర శరణాగతార్తిభంగా రంగా! 80

క. అంటనిశవ మొసఁగినకృప
ఘంటాశ్రుతుఁ బ్రోచినట్టిఘనుఁడవు ననున్
గెంటింపక ప్రోవుము నీ
బంటను శరణాగతార్తిభంగా రంగా! 81

క. పశువుల పోషణ కబ్బిన
పశువుగతిం బ్రతుకుననున్నఁ బశుపతినుత నీ
వశముగఁ జేయు ఘనకృపా
వశతను శరణాగతార్తిభంగా రంగా! 82

క. జీవన్మృతు ననుఁ మోయుట
గో వసుధాసతికి భార మే యగునుం గా
కీవిధి ననుఁ నుంచకు స
ద్భావా శరణాగతార్తిభంగా రంగా! 83

క. నేను గృతజ్ఞతఁ జెందితి
జ్ఞానం బవలేశ మయినఁ గాననికతనఁ
జ్ఞానము నొసఁగుము నిర్జిత
బాణా శరణాగతా ర్తిభంగా రంగా! 84

క. గతి దెలియనినేను బురా
కృతకర్మఫలంబుఁ గుడువ కే లుడుగు జగ
త్పతి నీ కృప లేమిని స
ద్వ్రతహిత శరణాగతా ర్తిభంగా రంగా! 85

క. మన మొకనిమిషము నీపద
వనజములను దలఁప వలను పడ కతిచలనం
బునఁ దిరుగు సతతమును బా
వనగుణ శరణాగతా ర్తిభంగా రంగా! 86

క. చలనము గలమనమును నే
నిలువఁగ నభ్యసయోగనిపుణత నాకుఁ
గలుగనిదీనుఁడఁ గావున
బలయుత శరణాగతా ర్తిభంగా రంగా! 87

క. క్లేశవినాశన కేశవ
కేశినిశాచరనివార గిరిధర కృష్ణా
శ్రీశా ఖండితసంసృతి
పాశా శరణాగతా ర్తిభంగా రంగా! 88

క. సదయత ననుఁ గావఁగ నీ
కిది సమయము నాదుహృదయ మెంతయు భక్తిం
గదియింపు భవత్పదములు
వదలక శరణాగతా ర్తిభంగా రంగా! 89

క. తనుసంబంధులపైఁ గల
ఘనమోహము విడువఁజేసి ఘనతరభక్త్యం

బెనయంగ నొసంగుము పా
వనతన్ శరణాగతార్తిభంగా రంగా! 90

క. దారకపోషక మునిబృం
దారకవరవంద్యమాన దంతావళసం
తారక మందిరకృతస
ద్వారక శరణాగతార్తిభంగా రంగా! 91

క. నిరవధిక పాపకర్మ్మఁడ
హరిదశ్వకుమారకింక రాచరితభయం
కరబాధ లోర్వఁ దరమా
వరదా శరణాగతార్తిభంగా రంగా! 92

క. కరుణింపుము కరుణింపుము
నిరవధికకృపాపయోధి నీదాసుని న
న్నెఱి పొందనీక ప్రోవుము
త్వరతన్ శరణాగతార్తిభంగా రంగా! 93

క. వనమాలి సత్ఫలప్రద
వనజాతనివాస సదయ వరదా నాకున్
ఘనఫల మొసఁగుము దయ నీ
వనఘా శరణాగతార్తిభంగా రంగా! 94

క. భుజగవరశయన మురహర
ద్విజవరరథ చక్రహస్త దితిసుతహర వా
రిజహితరిపునయన ఖగ
ధ్వజ హరి శరణాగతార్తిభంగా రంగా! 95

క. కమలారమణీరమణా
విమలా కమలాంకవదన విజయానుగుణా
సమదారిహరణదీక్ష
ప్రమదా శరణాగతార్తిభంగా రంగా! 96

క. మృతి గనువేళ భవత్పద
స్మృతి గల్గి గుణానుభవము సిద్ధింపఁగ న
ప్రతిహతకృప నొసఁగుము స
ద్వ్రతహిత శరణాగతా ర్తిభంగా రంగా! 97

క. పారము గనుపడనివిప
త్పారావారప్రమగ్నుఁ బరిరక్షింపన్
లే రితరులు ననుఁ బ్రోవు మ
పారా శరణాగతా ర్తిభంగా రంగా! 98

క. కారణకార్యంబులకుం
గారణ మై కర్త వగుచుఁ గాకుండెడుని
న్నేరీతిం గానఁగఁ దర
మా రా శరణాగతా ర్తిభంగా రంగా! 99

క. అక్రూరస్తుత శ్రీధర
చక్రాసిగదాదిముఖ్యసాధన ననుఁ నీ
వేక్రియ నైనం బ్రోవు మ
వక్రా శరణాగతా ర్తిభంగా రంగా! 100

క. విదురాక్రూరోద్ధవముఖ
సదమలసద్భక్తలోకసంరక్షణ నా
హృదయము నీపైఁ జేర్చుము
వదలక శరణాగతా ర్తిభంగా రంగా! 101

క. తావకభక్తుల నెవ్వరు
సేవింతురు వారి కెలఁ జేకుఱు మోక్షం
బీవిధ మెఱుఁగుట సుకరము
పావన శరణాగతా ర్తిభంగా రంగా! 102

క. రక్షింపుము శ్రీనరహ
ర్యక్ష ప్రహ్లాదరక్ష యఘకులశిక్షా

రక్షింపుము ననుఁ బాండవ
పక్షా శరణాగతార్తిభంగా రంగా! 103

క. దుర్మదమునఁ జిత్తము నీ
నిర్మలపదవనజయుగలి నెనయదు ము న్నే
కర్మముఁ జేసితినో మణి
వర్మా శరణాగతార్తిభంగా రంగా! 104

క. కష్టములను దొలఁగించుచు
నిష్టఫలప్రాప్తిఁ జేయు మిహపరములలోఁ
దుష్టిం జెందఁగ నను వి
స్పష్టత శరణాగతార్తిభంగా రంగా! 105

క. సృష్టిస్థితిలయకారణ
ప్రష్టాచ్యుత శర్వ దివ్యసద్రూప మునీ
శ్రేష్ఠావనదానవిసం
భ్రష్టా శరణాగతార్తిభంగా రంగా! 106

క. రాజకులక్షీరాంబుధి
రాజా రవికోటితేజ రాజబిడౌజా
భోజాంతక విక్రమవి
భ్రాజా శరణాగతార్తిభంగా రంగా! 107

క. రారా దానవకులసం
హారా సురమానినీమానసాబ్జవిహారా
ధీరా మాగధగర్వని
వారా శరణాగతార్తిభంగా రంగా! 108

క. శ్రీదా దుష్టమదాసుర
భేదా భేదాపనోద వేదవినోదా
వా దేల ప్రోవు ననుఁ స
త్పాదా శరణాగతార్తిభంగా రంగా! 109

క. శ్రీపా సుందరజితసుమ
చాపా చాపప్రముక్తశరవిదళితబల్
భూపా భూపాలనహృత
పాపా శరణాగతార్తిభంగా రంగా! 110

క. గంగాజనక భుజంగమ
పుంగవమృదుతల్ప విహగపుంగవతురగా
శృంగారవిమలకరుణా
పాంగా శరణాగతార్తిభంగా రంగా! 111

క. రంగత్కాంచనఘనర
త్నాంగదకోటీరకుండలాదిసుభాషా
సంగతసురభాసురస
ర్వాంగా శరణాగతార్తిభంగా రంగా! 112

క. ఆశాసంజనితమహా
క్లేశంబుల కోర్వఁ జాలఁ గేశవ కృపతో
నాశాంతము నొనరించు శు
భాశయ శరణాగతార్తిభంగా రంగా! 113

క. కామజనక బుధజనఘన
కామితఫలదాననిపుణ కమనీయగుణ
స్తోమ పురందరసన్నుత
వామన శరణాగతార్తిభంగా రంగా! 114

క. నూతనకమలదళేక్షణ
పూతనహర కనకవసన బుధజననుతవి
ఖ్యాత సుపూజిత లోక
త్రాతా శరణాగతార్తిభంగా రంగా! 115

క. రిపుహరహరతుహినాచల
రిపుముఖసురవినుత సత్సరీసృపశయనా

సుపవిత్ర భక్తదోష
వ్యపహృత శరణాగతార్తిభంగా రంగా! 116

క. లింగరహిత మాయాగుణ
సంగతి నగులింగదేహసంబంధముఁ బా
పంగదె సదమలకరుణా
పాంగా శరణాగతార్తిభంగా రంగా! 117

క. మాలాకారుఁ డొసంగిన
మాలికలం గొనుచు వాని మన్నించినవ
మాలీ ననుఁ బ్రోవుము గో
పాలా శరణాగతార్తిభంగా రంగా! 118

క. వసనము లొసఁగినవాయకు
నసమకృపావిలసనముల నరసినగతి నన్
విసువక ప్రోవుము కాంచన
వసనా శరణాగతార్తిభంగా రంగా! 119

క. దుర్భరగుణసుతుశరశిఖి
గర్భాభ్భకుఁ గదియ విరటుకన్నియ వేఁడ
నిర్భరకృపఁ గాచితి గో
పార్భక శరణాగతార్తిభంగా రంగా! 120

క. కేశవ హరి శౌరి హృషీ
కేశ మురద్విష ముకుంద గీష్పతిసుత ల
క్ష్మీశ ఫణిశయన వనదా
వాశన శరణాగతార్తిభంగా రంగా! 121

క. నారాయణ వసుదేవకు
మారా నవనీతచోర మాధవ నుతమం
దారా దుర్జనదుర్మద
వారా శరణాగతార్తిభంగా రంగా! 122

క. పిన్నతనంబున నుండియు
నిన్నే నా దైవ మనుచు నెఱి నమ్మితి నో
వెన్నుఁడ రక్షింపుము నీ
వన్నా శరణాగతార్తిభంగా రంగా! 123

క. దంతిముఖవినుత సురరిపు
దంతావళదంతివైరి దంతివిదారీ
దంతముఖదళిత కరుణా
స్వాంతా శరణాగతార్తిభంగా రంగా! 124

క. శారీరమానసవ్యధ
లారూఢత నొంద సాఁగె నంతంతకుఁ గం
సారీ ప్రోవర నన్ను న
వారణ శరణాగతార్తిభంగా రంగా! 425

క. భగవద్భాగవతాశ్రితుఁ
డగుకానురి లింగమూర్తి యనుసీదాసున్
విగతభయుం గా నొనరిం
పఁగఁ దగు శరణాగతార్తిభంగా రంగా! 126

క. శ్రీకర మగుసీసకృతి
చేకొని ధర శాశ్వతముగ శ్రితమోక్షితసు
శ్రీకముగా నొనరింపు శు
భాకర శరణాగతార్తిభంగా రంగా! 127

క. జయ రంగనాయకీసఖ
జయ జయ జయవిజయముఖ్యసంసేవ్య సదా
జయ విజయసారథీ జయ
భయహర శరణాగతార్తిభంగా రంగా! 128

సంపూర్ణము.

ఈ శతకమందు 63 వ పద్యము మొదలు 74 వ పద్యమువఱకుఁ బద్యాది మూఁడవ యక్షరములను జదివిన నీ కవినామ మగును.

శ్రీ కృష్ణాష్టోత్తర శతకము.

—:o:—

క. శ్రీరుక్మిణీమనోంబుజ
సారసహిత చక్రపాణి శరణాగతసం
సారమహార్ణవతారణ
కారణ కారుణ్యహృదయ ఘుననిభ కృష్ణా! 1

క. ధరణీధర ధరణీధర
భరణా రణవిజితమ త్తవారణ కరుణా
భరణా శరణార్థిని నీ
కరుణకుఁ బాత్రుఁడను వేగఁ గావుము కృష్ణా! 2

క. నిరుపమసుందరచరణా
వరకౌ స్తుభముఖ్యభూష వసువసన జగ
ద్భరితమహోజ్జ్వలతేజ
స్స్ఫురణా ఫణిరాజశయన ప్రోవుము కృష్ణా! 3

క. పురహరనుత గరుడధ్వజ
నరసఖ మురవైరి కమలనయన యఘారీ
నిరతము నిన్ను స్మరింపఁగఁ
గరుణింపుము నీదుమదిని ఘనముగఁ గృష్ణా! 4

క. ధరగౌతమవరవాసుల
నిరవధికానందయు క్తనిశ్చలభ క్తి
స్ఫురణ యొసంగుచుఁ బ్రోవవె
వరదా జగదీశ భ క్తవత్సల కృష్ణా! 5

క. క్షీరవహితకులజలనిధి
క్షీరవహిత వినుతలోకక్షీరమిత్రా

కైరవహితనాశనకర
కైరవహితమౌళివిజయకారణ కృష్ణా! 6

క. సూరిజనస్తుత ధరణీ
భారము వారింప నజుఁడు ప్రార్థించినత
త్కారణమున భువి నీ వవ
తారము యదుకులమునందుఁ దాల్చితి కృష్ణా! 7

క. నారదవాహతనూభవ
సారథినీరధినిషంగసన్నుత నతసం
సారాంభోనిధికుంభజ
సీరాయుధ యదుకుమార శ్రీధర కృష్ణా! 8

క. దారాది యీషణత్రయ
మేరీతిని దలఁచి చూడ నిహపరములకుఁ
సారంబు గాదు మీకృపఁ
జేరక కరుణించి నన్నుఁ జేకొను కృష్ణా! 9

క. నిరతము ఘనతరతృష్ణా
భరజనితమహోగ్రతాపభర మోర్వక నీ
మఱుఁగునఁ జేరితి శరణని
కరుణాకర వేగ నన్నుఁ గావుము కృష్ణా! 10

క. పరహితముఁ దలఁప నెన్నఁడుఁ
బరహితులను నిందఁ జేతుఁ బాపంబులకుఁ
వెఱవను ననుఁ గృపఁ గావఁగ
భరమా పరమాత్మ పతితపావన కృష్ణా! 11

ముక్తపదగ్రస్తము

క. ద్విరదావన వనజోదర
దరదామరరిపువిదారధర చక్రధరా

ధరణీధర రిపుసోదర
దర మోర్వఁగ రా దయా దయానిధి కృష్ణా! 12

చతుష్పాద్గిస

క. శరణాగతరక్షణ భూ
భరణాగతదోష పరమపావన సుగుణా
భరణా గతి నీవే యని
శరణాగతి నైతిఁ గావు సదయతఁ గృష్ణా! 13

క. క్రూరాహికి లోఁబడు శా
లూరముగతిఁ గామమునకు లోనై తి నహో
శ్రీరామానుజ వేగమె
రారా గరుడాంక వేగ రారా కృష్ణా! 14

క. నారాయణ వసుదేవకు
మారా నవనీతచోర మాధవ నతబృం
దారక మునివరలలితవి
హారా జగదేకవీర యచ్యుత కృష్ణా! 15

క. వారింప రానిదుర్భర
క్రూరతరామోఘకామరోషాదుల పెఁ
గాటీయ కోర్వక మ్రొక్కితిఁ
గూరిమి ననుఁ బ్రోవరా ముకుందా కృష్ణా! 16

చతుష్పాద్గిస

క. మురదానవకరిహరి కరి
వరదా నవనీతచోర పావనగుణ కుం
దరదానవ నీరదభా
సుర దానవసుతసుపోష శుభదా కృష్ణా! 17

క. క్రూరతరాధివ్యాధుల
మీఱినదుఃఖంబు మాన్పి మీభక్తులతోఁ

జేరి సుఖింపఁగఁ జేయవె
సారదయాపూర్ణ హృదయసారస కృష్ణా! 18

క. శ్రీరంగా పరిపోషిత
సారంగా సుందరాంగ శరహతమాయా
సారంగదైత్య వనరుహ
సారంగా భంగరహిత శాశ్వత కృష్ణా! 19

క. పురహరసన్నుత రిపురా
ట్పురనాశన సర్వదేవపూజితచరణా
శరధీశశయన కాకో
దరగర్వనివార సన్ను తామర కృష్ణా! 20

క. నేరము లెంచక మును న
క్రూరుని బలిపుష్టదైత్యఁ గుతలిని బ్రోవన్
మీఱినదయ ననుఁ బ్రోవ వ
దేరా శ్రీరామ రామ దేవా కృష్ణా! 27

క. శ్రీరామామణిమానస
చోరా చోరాతినిపుణ సురరిపుమారా
మారాయుతశతసమసుకు
మారా మారారినుత కుమారా కృష్ణా! 28

క. నీరాకరవిహరణ వ్రజ
నారీవస్త్రాపహార నందకుమారా
సారసభవనుత నవమం
దారక గోవింద శౌరి నరసఖ కృష్ణా! 29

క. సిరి యురమునఁ గలదొర వగు
టెఱిఁగియు నే గోర నితర మేదియు యుష్మ
చ్చరణారవిందయుగళ
స్మరణం బొం డొకటి గాక మాధవ కృష్ణా! 24

క. సురుచిరమణికాంచననూ
పురచరణసరోజయుగళ భూషితసురరా
డ్వరమౌళినికర రామా
వరదా కమలాక్ష దీనవత్సల కృష్ణా! 25

క. నారాయణ నారాయణ
నారాయణ యనుచుఁ బల్కినరులకు ఘనసం
సారమహార్ణవతారక
మారూఢిగఁ గల్గదే ముకుందా కృష్ణా! 26

క. నెఱ నమ్మినదాసుని న
న్నఱమఱఁ జేయంగఁ దగునె యాత్మేశ్వర నీ
నెఱదాతృత్వముఁ జూపక
కరుణానిధి సర్వలోకకారణ కృష్ణా! 27

క. హరి నరహరి హరిహయనుత
హరిభుగ్వరశయన వారిజాసనజనకా
గిరిభిత్సుతసఖ సుస్థిర
వరసంపద లొసఁగుదాత వౌరా కృష్ణా! 28

క. సారసలోచన మునిహృ
త్సారసదిననాథ నాథ ధనదుని సుతులన్
గూరిమితోఁ గాచితి వ
క్రూరావన క్రూరహరణకోవిద కృష్ణా! 29

క. మురహర కేశవ మాధవ
సరసీరుహనాభ విష్ణు శక్రానుజ భూ
సురగోరక్షణ క్షణదా
చరహరణా దేవదేవ శాశ్వత కృష్ణా! 30

క. సారెకుఁ దావకమధురస
ధారానిరసనకథామృతాసారసదా

పూరితమానసవరకా
సారునిగాఁ జేయవే ప్రశస్తా కృష్ణా! 31

క. మేహధరాధరసమధిక
ధీరా ధీరాధిగణ్య దిగధీశ్వరకో
టీరాగ్రరత్నబింబిత
సారసనిభచరణయుగళ శౌరీ కృష్ణా! 32

క. ధరణీధర గోవర్ధన
ధరణీధరధర ముకుంద దానవకులసం
హర గోవర్ధన నేమీ
శరణార్థిని బ్రోవు నయవిశారద కృష్ణా! 33

క. పరదైవంబుల వేఁడను
బరమపదం బబ్బెనేని భవభయహర నా
పరమప్రాప్యము నీ వని
యెఱిఁగితి నే విడువ నింక నెన్నఁడుఁ గృష్ణా! 34

క. లేరే వేల్పులు ధరపై
నీరే తమయిచ్చకొలఁది నిష్టార్థంబుల్
వా రిచ్చినఘునసంపద
వా రుండఁగనే హరించవా మును కృష్ణా! 34

క. నిరతము సద్గుణచరణ
స్మరణౌషధశమితఘోరస్మరఘునతాప
జ్వర లై నవారి కీప్సిత
పరిచారునిఁ గాఁగ నేలు పరహిత కృష్ణా! 36

క. దారాది యీషణత్రయ
మూరాదివిరోధిగణసమూక్రాంతత నే
శ్రీరమణ దుఃఖవార్ధిని
జేరితి రక్షించు నన్ను శ్రీకర కృష్ణా! 37

క. శారీరమానసంబులు
నీరసగతిఁ జెందెఁ దెలివి నీచం బయ్యెన్
ఓరుపు దూరం బయ్యెను
శ్రీరమణా సదయ నన్నుఁ జేకొను కృష్ణా! 38

క. కరుణింపుము కరుణింపుము
నర కేసరి నరకనాశ నరసఖ యమకిం
కరులకు లోఁబడ నివ్వక
కరుణారసభరితహృదయ కావవె కృష్ణా! 39

క. సురుచిరమణిచామీకర
కరకంకణహారమకుటకాంచీగుణనూ
పురయూర్మికాంగదాదిక
వరభూషణసత్కలాపవపుషా కృష్ణా! 40

క. హరినీలాలకజాలా
వరమదసుందరలలామవాసితఫాలా
వరదానశీల రత్నా
కరచేలాలోల వైరికాలా కృష్ణా! 41

క. కిరి వైరిపుజనకైరవ
హరి వై హరివంశవార్ధిహరి వై చామీ
కరదృక్కరిహరి వై ధరఁ
గరుణఁ గాచితివి భక్తకామద కృష్ణా! 42

క. నీరాటతఁ గైకొని శృతి
చోరాటనుఁ డైనదైత్యసోమకు జలధిఁ
బోరాటఁ జంపి యజునకు
నారాటము మాన్పి తీవె యచ్యుత కృష్ణా! 42

క. అరిమదకరిహరి వై నర
హరి వై హరిహయవిరోధి నతినిష్ఠురభీ

కరనఖరంబులఁ జీఁటి
కరుణఁ బ్రహ్లాదుఁ గావఁగా మును కృష్ణా! 44

క. విరటాత్మజ గర్భార్భకు
గురుసుతశరవహ్ని సోకకుండఁగఁ గరుణా
పరతంత్రత రక్షించిన
పరమేశ్వర మమ్మునుఁ బ్రోవు వైళమె కృష్ణా! 45

క. శరనిధి దైత్యుఁడు మ్రింగిన
గురుసుతు బ్రతికించి తెచ్చి గురుదక్షిణగాఁ
బరమప్రీతి నొసంగిన
పరమదయాకార భక్తపాలన కృష్ణా! 46

క. నారాయణ మాధవ యదు
వీరా లోకాధినాథ విద్వన్నుత యు
క్రూరోద్ధవాదిభాగవ
తారాధితస్వస్వరూప యరయుము కృష్ణా! 47

క. సరసిజదళనయన నిశా
చరదళన నిశాతచక్రశార్ఙ్గశరాసా
శరనిధిశయన భుజంగమ
వరతల్ప యనల్పకల్ప పావన కృష్ణా! 48

క. అరనిమిసం బైనను ను
స్థిరమతి యుష్మత్పదాబ్జసేవానిరతిం
గరుణింపు మనుచు వేఁడితి
శరణాగతభక్తపోష సంగత కృష్ణా! 49

క. పురుషోత్తమ జనసన్నుత
పురుషోత్తమ సర్వలోకపూతచరిత్రా
పురుషప్రకృతికారణ
పురుషార్థము లొసఁగి మమ్మునుఁ బ్రోవర కృష్ణా! 50

క. రారా మేఘధరాధర
ధీరా ధీరాగ్రగణ్య దితిసుతమారా
మారా మామృదుమానస
చోరా చోరప్రణాశ శూరా కృష్ణా! 51

క. నేరియు నేరక చేసిన
నేరములను మఱచి నన్ను నీదాసులలోఁ
జేరఁగఁ దగుయోగ్యత చే
కూరఁగ రక్షించు మయ్య కుజహర కృష్ణా! 52

క. సారము సమస్తసత్ఫల
సారము బుధపరమహంససంగతచిత్తా
సారము సారము త్వత్పద
సారససద్భక్తియోగసారము కృష్ణా! 53

క. పరిమితి మీఱినదుఃఖ
జ్వరత ప్తుఁడ మోహపాశబద్ధుఁడఁ గామా
తురుఁడను గతి మాలినన
గరుణారస మొసఁగి కావఁగాఁ దగుఁ గృష్ణా! 54

క. పరతుష్టికి ఖేదంబును
పరఖేదంబునకు నాత్మపరితోషంబున్
బరధనము నాచికోలును
బరదూష్యము లివియు వేగఁ బాపుము కృష్ణా! 55

క. సరసత పరులకుఁ గనుపడ
విరసత యాత్మీయులకును విపరీతముగా
నెఱుకపడ నడచుకపటా
చరణుని రక్షించు సారసాక్షా కృష్ణా! 56

క. కౌరవసభఁ బాంచాలిని
గారవ మెడఁబాయకుండఁ గరుణాంబుధి వై

చీర లొసంగినమీకృపఁ
గోరితిఁ గరుణించు వేణుగోపా కృష్ణా! 57

క. హరి శ్రీహరి మానవహరి
హరి గారుడశయనవాహ హరి హరినయనా
హరితనయ మిత్రదానవ
హరిహరి హరికోటితేజ యచ్యుత కృష్ణా! 58

క. కొఱ గానివిషయవాంఛల
కొఱగాము లొనర్చి నరకకూపములోనన్
నెఱి చెడి కూలఁగ నివ్వకు
శరణార్థిని నన్నుఁ గావు సదయతఁ గృష్ణా! 59

క. సురలను గరుణించుచు మం
దరగిరి నిజకర్పరమునఁ దాల్చి సుధాబ్ధిన్
దరుఁవఁగఁ గలిగినసుధ యీ
సురలకు నొసఁగితివి భక్తసులభతఁ గృష్ణా! 60

క. హరి నారాయణ కేశవ
మురహర గోవింద శౌరి ముచికుందనుతా
నరహరి శ్రీధర కాకో
దరశయనా సీరి దైత్యదమనా కృష్ణా! 61

క. పురుషప్రకృతికారణ
పురుషో త్తమ సర్వరూపములు నీ వని యే
మఱనితలం పొసఁగుచు నీ
చరణాంబుజసేవ యొసఁగు చయ్యనఁ గృష్ణా! 62

క. పుడవైరిఁ గావఁ బూనిన
సురరిపుని సహస్రబాహు శుంభల్లీలన్
గరములు నాలుఁగు దక్కఁగ
వరచక్రముచేతఁ ద్రుంచివైచితి కృష్ణా! 63

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No. 10538

క. శౌరీ బృందావనసం
చారీ మురదానవారి సన్నుతసూరీ
క్షీరాబ్ధితనయహృత్సర
సీరుహశృంగారగేహ శ్రీహరి కృష్ణా! 64

క. శ్రీరమణీమణిరమణా
దారుణసంసారదహనతాపము దీఱ్ఱ
గారుణ్యశీతలామృత
ధారలు నన్ వలయఁ జేయు దయతోఁ గృష్ణా! 65

క. శర ణన్నకరిని బ్రోచితి
శర ణనుటకు వెఱచి నీదుసన్నిధి ధరపై
నొఱఁగినకాకిని బ్రోచితి
నిరుపమకరుణాసమేత నిరుపమ కృష్ణా! 66

క. సారసదానందపదా
ఘోరనిశాటప్రభేదకుంభీంద్ర విప
ద్వారిదవిదారమారుత
యేరా దయ రాదె నన్ను నేలఁగఁ గృష్ణా! 67

క. సారసదళలోచన దై
త్యారిమదాభీలకువలయాపీడన చా
ణూరాదిదుష్టజీవులఁ
గ్రూరుం డగుకంసుతోడఁ గూల్చితి కృష్ణా! 68

క. చిఱుతతనము మొదలుగ సో
మరి నై జీవితము సత్య మనుకొని విషయా
తురత దినంబులు గడపితి
హరిహరి నీసేవఁ జేయ నైతిని గృష్ణా! 69

క. హరి గోవింద జనార్దన
గరుడధ్వజ వాసుదేవ కమలాకర మా

వర విష్ణు విష్టరశ్రవ
పరమేశ్వర సర్వలోకపావన కృష్ణా! 70

క. దురితం బొనరింపఁగ నే
నరనిమిషము మాన నోప నకటా నా యం
కరణత్రయంబు నాపం
దరమా దర మాన్పి నన్ను దయఁ గను కృష్ణా! 71

క. మీఁతితి మీ యాజ్ఞకు నేఁ
గోరితి మీపాదసేవ కొనసాఁగుటకై
చేరితి మీపదముల సం
సారాంబుధి దాఁట నిమ్ము సదయా కృష్ణా! 72

క. ఇరువదియొకపరి నృపులను
బరశునుఁ గొని తునిమి రక్తవారిని బితరుల్
పరితృప్తిగఁ దర్పణ లిడి
ధర విప్రుల కొసఁగు పరశుధారణ కృష్ణా! 73

క. చేరువ కైవల్యము ల
స్మీరమణ భవత్పదాబ్జసేవానిరతిం
గోరినధన్యుల కెప్పుడు
సారసుఖానందదాయి శాశ్వత కృష్ణా! 74

క. దూరము వైకుంఠపుర
ద్వారము శ్రీభాగవతుల చరణాబ్జరజో
వారాభిషేక మొందని
వారికి నీ కరుణ లేనివారికిఁ గృష్ణా! 75

క. ద్వారకమందిర జగదు
ద్ధారక శ్రీవాసుదేవ దామోదర బృం
దారకసన్నుత నతమం
దారక సుశ్లోక రామ తారక కృష్ణా! 76

క. నేరము సంసారాంబుధి
పారము దరిఁ జేరఁ దగునుపాయము పరులం
జేరము నిన్నే విడువము
దూఱము పరదైవముల యదూత్తమ కృష్ణా! 77

క. పరమేశ్వర సర్వాత్మక
కరుణాకర విశ్వరూప ఖగవాహ రమా
వర దీనకల్ప సుందర
చరణాంబుజ మానిలోకసన్నుత కృష్ణా! 78

క. నిరతము మొఱ లిడియెడినా
మొఱ విని కరుణింప వేల ము న్నాకరణిఁ
గరిప్రహ్లాదప్రముఖుల
మొఱ విని ప్రోవంగ లేదె మునినుత కృష్ణా! 79

క. శరదంబుజసన్నిభమృదు
చరణాంబుజ భక్తమానసాంబుజమధుపా
డ్వర దివ్యపదవిభాసిత
పరమశుభావాస భక్తపాలక కృష్ణా! 80

క. ఉరగాశనవాహన వా
సరమణినిభ తేజ భక్తసరసీరుహ వా
సరమణిమణిభూషణ భూ
సురమణినుతచరిత దివ్యసుందర కృష్ణా! 81

క. ఎఱుఁగుదు సర్వజ్ఞుండవు
కరుణాస్వాతుండ వఖిలకర్తవు నే నీ
చరణంబులె శరణంబుగ
నెఱ నమ్మితి నన్నుఁ బ్రోవు నిజముగఁ గృష్ణా! 82

క. కారుణ్యఘనసుధార్ణవ
సారెకు సారెకును దుఃఖజననం బగుచుఁ

మీఱినదుర్విషయంబులఁ
జేరఁగ నివ్వకుము నాదుచిత్తము కృష్ణా! 83

క. నీరమున ముంచు లక్ష్మీ
నారాయణ పాల ముంచు నన్నేకొఱఁతల్
చేరవు సమస్తమునకున్
భారకుఁడవు నీవె సర్వపాలక కృష్ణా! 84

క. నారదనుత నారాయణ
శారదరాకాబ్జవదన శాత్రవహాననవి
శారద రణవిక్రమ ఘన
శారదవరజనక వారిజాక్షా కృష్ణా! 85

క. కారణరహిత సనాతన
కారణకార్యముల కెపుడుఁ గారణ మగుచున్
నేరము లెంచక ఘనని
ష్కారణకృప లోకములను గావవె కృష్ణా! 86

క. హరిహయనుత నరకేసరి
మురదానవవైరి శౌరి మోదముతో మీ
చరణారవిందసేవా
నిరతునిఁగాఁ జేసి మమ్ము నేలుము కృష్ణా! 87

క. సారసభవభవముఖబృం
దారకమునివినుతనామ ధర్మాత్మజుపైఁ
గూరిమి దౌత్యముఁ జేసితి
సారదయామతివి నీవె సత్యము కృష్ణా! 88

క. కిరి వై చామీకరదృ
క్కరిహరి వై విమతలోకకైరవహరి వై
హరి వై ఖ్యాతివిపదో
ద్ధరి వై విలసిల్లునీకు దండము కృష్ణా! 89

క. నిరుపమకళ్యాణగుణా
భరణా శరణావనైకవరసంచరణా
చరణాగ్రనిహతశకటా
సురవీర యశోదతనయ శుభకర కృష్ణా! 90

క. శరణాగతరక్షణ శ్రీ
వర శ్రీవత్సాంకవక్ష వనజాక్ష నిశా
చరశిక్ష రక్షితామర
వరపక్షా సాధులోకపక్షా కృష్ణా! 91

క. ఏరీతి నైనఁ బ్రోవుము
కూరిమి గనుపింప నాదుకోరిక దీఱ్ఱ
ధారుణి నీసరి దైవము
లారయ నింకొకరు గలరె యచ్యుత కృష్ణా! 92

క. పరమాదరమున న న్నీ
దర మానఁగఁ జేయఁ బరుల తరమా నీకున్
దర మారయ రయ మారఁగ
సరమా పరమాత్మ ప్రోవు సరసతఁ గృష్ణా! 93

క. వరతులశీదళదామా
నిరుపమశుభనామ కలుషనికరవిరామా
సురవైరిభీమ గౌరీ
వరనుత శ్రీరామ విజితభౌమా కృష్ణా! 94

క. నిరతముఁ దనుధనదారా
వరజాత్మజసక్తమతినివారక యఘముల్
పరిమితి లేక యొనర్చిన
దురితాత్ముఁడ దిక్క వేఱె తోఁచదు కృష్ణా! 95

క. వే ఱొక ది క్కెఱుఁగనినా
కోరికఁ దీర్పంగ నీవె కోవిదుఁడవు నా

నేరము లెంచఁగఁ బరిమితి
మీఱిన వని యెంచవలదు మీమదిఁ గృష్ణా! 96

క. కోరిక గోరనివారలఁ
గూరిమి రక్షించునీదుగుణ మెఱుఁగక నేఁ
గోరినతప్పు క్షమించుము
కోరను మోక్షం బొసంగు గురుకృపఁ గృష్ణా! 97

క. క్షీరాబ్ధిశయన సంప
త్కారణ కల్యాణగుణనిదానాశ్రయ శ్రీ
నారాయణ వసుదేవకు
మారా లక్ష్మీనృసింహ మాధవ కృష్ణా! 98

క. గరుడస్యందన నందక
ధరణీధరధరకుమార దనుజనివారా
శరధిగభీర జరాసుత
దురతిక్రమగర్వహర యదూత్తమ కృష్ణా! 99

క. సరసీజాక్ష రమాపతి
పరమేశ్వర విశ్వరూప భవభయహర వా
సరమణిసహస్రతేజ
స్స్ఫురణా ఫణిరాజశయన బుధనుత కృష్ణా! 100

క. భూరమణులు మాగధుచేఁ
గారాగారములఁ జెంది కడుఁ బ్రార్థింపఁ
మీరతినెపమున మగధుని
బోరం జంపించి వారిఁ బ్రోచితి కృష్ణా! 101

క. కోరితి మీదాసులపద
సారసరేణువులు శిరము సంస్పరిశింపం
దూఱితి దుర్విషయంబులఁ
జేరినదుర్గ యులపొత్తు శ్రీధర కృష్ణా! 102

క. తరణిశశినయన కాకో
దరశయ నక్రా ర్తిహరణ దశతురగనిశా
చరదళన నిశితనండక
ధర శ్రీకర నిర్జితారిదై త్యా కృష్ణా! 103

క. సిరిదొర నీ యడుగుల కే
నొఱగితి న న్నేల నితఱ లొండెడ నాకున్
దొరకుట గలుగదు న న్నీ
తఱి నైనను గనికరించఁ దగురా కృష్ణా! 104

క. ధారాధర మేచకనిభ
శారీరరుచిప్రవృద్ధ సన్మణియుతకో
టీరాంగదకౌ స్తుభమం
జీరాదిసుభూషభూష శ్రీశా కృష్ణా! 105

క. శ్రీరమణీయ జయూవహ
కారణ జయవిజయసేవ్య కల్యాణయుతా
కార భవదీయసుందర
సారసపదపద్మయుగళ జయ జయ కృష్ణా! 106

క. నిరుపమకల్యాణగుణా
మురహరి కానూరి లింగమూర్త్యాఖ్యుఁడ నీ
కరుణ నొనర్చితి నీ కృతి
స్థిర నాచంద్రార్కముగను జేకొను కృష్ణా! 107

క. ధర రేఫప్రాసాష్టో
త్తరకందశతంబు యుష్మదాఖ్యాంకితభా
సురరత్నమకుటపఠన
స్థిరసౌఖ్యముఁ జెందు నరుఁడు శ్రీధర కృష్ణా! 108

సంపూర్ణము.

శ్రీమతే రామానుజాయ నమః

కృష్ణ రాగావళి

—:o:—

సీ. శ్రీవిజయైక సుస్థిర దివ్యకల్యాణ
భాసిత చరిత సంపద్ధురీణ
ఆర్తజనత్రాణ హతదైత్యసంతాన
విశ్వసనోన్మోహన వేణుగాన
శార్ఙ్గవినిర్ముక్త శాతబాణవితాన
మగధాధినాథదుర్మదవిలూన
దీనజనాభీష్టదాన విశ్వాసిదాన
సామగానామోద శకునయాన

గీ. ఆర్తుఁడను గాన నిన్ను నే నాడుకోన
వరము లడిగిన నిడవు నీ పదు విదేన
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 1

సీ. శిశుపాలగిరిసునాసీర సీరాంచిత
కరపద్మ పద్మసంకాశచరణ
చరణవిఘుట్టితశకటపూర్వామర
యమరాలయస్థైర్య యమిత తేజ
తేజోవినిర్జితదితిసుతాంధతమిస్ర
మిస్ర సత్వాతీత మృత్యుహరణ
రణవినిర్జితబృహద్రథగర్భసంజాత
జాతరూపాంశుక జలధివాస

గీ. వాసవానుజ దేవదేవాదివినుత
వినుతకళ్యాణగుణగణావేశ సరస
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 2

సీ. వాసుదేవ ముకుంద వనమాలి గోవింద
విత్తబ్రహ్మానంద విశ్వాతుంద
యిందిరాహృదయారవింద సన్మకరంద
రసపానమత్తమానసమిళింద
విశ్వంబు నీయంద విదిత మై వెలుఁగొంద
దయఁ జూడు ననుఁ గృతార్థతను జెందఁ
బాలితముచుకుంద పరిహృతరిపుబృంద
పాపక్రౌంచస్కంద వసుధయంద

గీ. నన్ను సుఖ మంద సత్కీర్తి నిన్నుఁ జెంద
రదనరుచిజితకుంద శ్రీరమ్యవదన
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 3

సీ. నందగోపకుమార నతగోపమందార
సితరోషతూణీర హతవికార
నవనీతచోర వాసవగర్వసంహార
నిహతచాణూర సన్నిహితధీర
శతమఖారివిదార సతతకృపాసార
శమితసంసారవిక్రమితశూర
బృందావనవిహార మందారసుమహార
సదమలసంచార యదుకుమార

గీ. ఏలరా నన్నుఁ గృప సేల వేల రార
రాధికాజార సుకుమార రమ్యవదన

సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 4

సీ. పుత్రవాంఛను నిన్నఁ బుత్రునిగాఁ గన్న
తలిదండ్రు లందరే తగనిపాట్లు
నీభక్తు లై యుండి నిజరాజ్య మొందఁగాఁ
గాంక్షించుపాండవుల్ గాసి వడరె
నీతత్వ మెఱిఁగి తా నిజభక్తుఁ డై భీష్మ్నుఁ
డనిలోనఁ జెందఁడే యంపశయ్య
సకలంబు మఱచి నీ చరణాబ్జముల నమ్మి
పడఁడె ప్రహ్లాదుండు బాము లెన్నో

గీ. యిట్టిచరితంబు నామది నెఱుఁగలేక
కన్నఫల మిది కాదె ప్రసన్నవదన
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 5

సీ. పుట్టినప్పుడె నీవు పురిటింటఁ బాలిడు
పుణ్యాజనాంగనఁ బొలియఁ జేసి
మూఁడవనెల నీకు నీడగా నుండిన
శకటంబుఁ గూల్చితి చరణనిహతి
యెత్తుక తిరుగఁగా నెంచుపుణ్యజనుండు
మడియఁ జేసితి గాదె పుడమిమీఁద
లేఁగలఁ గాయునీలీలఁ గానఁగఁ బెఱు
లేఁగ వచ్చిన దానిబాగు చెడఁగఁ

గీ. జంపినా వని నీకథ లింపు మీఱు
వింటి సంతోష మెద నంటి విశ్వజనక
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 6

సీ. నిక్కువీనుల తెల్లచక్కి నెక్కినటేని
సైదోడ యడ్డుమిన్నాలువాఁడ
రక్కసిటేళ్ల పే రుక్కఁ బాపెడువాఁడ
పక్కెఁబెక్కెపుఁదేరు నెక్కువాఁడ
రిక్కరాయనితోడు నక్కపైఁ జేర్చిన
చక్కనిగొనముల సామిటేడ
కొక్కెరరక్కసిముక్కు చిక్కఁగఁ బట్టి
చక్కడంచిన మేటియుక్కువాఁడ

గీ. గొట్రెలను గాచునందుని కుట్టువాఁడ
బంధములు వీడఁ గృపఁ జూడు పద్మవదన
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 7

సీ. ఆత్మజసంచితాత్యంతపాతకరూప
యజ్ఞానవిపులగాఢాంధకార
సంచన్నసన్మార్గసరణి గానఁగ లేక
తోట్రుపా టొదవినతుచ్ఛవృత్తి
యమితాపదల కెల్ల నాలయం బగు ఘోర
సంసారగహనసంచారవశత
ఘనతరదుఃఖసంఘాతవార్ధి మునుంగ
నుద్ధరింపఁగ నన్ సమర్థు లెవరు

గీ. లోకలోచన త్వత్కృపాలోకనైక
ధర్మయుష్మత్కృపాఘనతరణి గాక
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 8

సీ. కయ్యంబునకుఁ దోడు గావలె నని వేఁడు
క్రీడికిఁ దోడు పోరాడినావె

యవనుండు వెనువెంటఁ గవిసినఁ దిరుగక
గిరిఁ జొచ్చి నేర్పున గెల్చినావె
సిరిఁ గోరి స్నేహభూసురుఁడు కాను కొసంగ
సొంపుగా సిరు లిచ్చి పంపినావె
ధరణి సంపద లెల్ల దాన మిచ్చినబలి
కిచ్చితి వేమి మహేంద్రపదవి
యింత నిర్వాహకత్వంబు నెఱిఁగి మదిని
నెంచి సేవించుదాసుల కేమి కొదువ
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 9

సీ. సకలకల్యాణైకసదన రమాలోల
పాలితాఖిలలోక భవయళీక
శమితదైత్యశ్రీక సన్నుతామరలోక
నీలాలకాంచితనిటలతిలక
శాశ్వతశ్లోక సంసారవారక రక్షి
తానేకప ప్రశాంతావలోక
మూఢసంసారదుర్మోహనిర్మూలక
ద్వంద్వసంకటభేకదండభూక

గీ. నిష్ఠురము లేక న న్నేలు నిందపడక
సాధుజనచిత్తనాళీక చంచరీక
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 10

సీ. పరమకళ్యాణభాసురసత్కృపాపాంగ
కోమలామలఘునశ్యామలాంగ
రుక్మిణీహృత్సరోరుహవరచక్రాంగ
పవిధర విమతక్షైరవఘతంగ

12

తేజోవినిర్జి తాదిత్యకోటిరథాంగ
సురనికరా ర్తిదర్దురభుజంగ
సాధుసజ్జనబృందసారససారంగ
హతజాతరూపమాయాకురంగ

గీ. ప్రియము గదురంగ రమ్మ యీప్సిత మొసంగ
దానవవిభంగ గోపకాంతాభుజంగ
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 11

సీ. నావంటి నీచమానవుఁడు నీశ్రీపాద
వనజసంసేవకుఁ బాత్రుఁ డగునె
సకలదుర్విషయసంసర్గసంసారాంధ
కూపసంస్థితిఁ జెంది కుటిలవృత్తి
ధనదారతనయసంతానసంరక్షకై
యీవనకాలంబు వ్యర్థపఱచి
వ్యాధిసంపీడితవార్ధకావస్థచే
మనసు సంకటపాటు గనినవేళ

గీ. నైన నొకసారి నే నిశ్చలాత్ముఁ డగుచు
స్మరణఁ జేయ దలంచ న న్నరసి ప్రోవు
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ!

సీ. నారాయణ సరోజనయన విష్వక్సేన
పవనభుక్ఛయన సుపర్ణయాన
వినమితవృషభవాహన వనజాసనా
ద్యఖిలసుపర్వాణ యఘవిలూన
భక్తజనత్రాణ ప్రజమానినీపంచ
భాణ బాణాసురబాహుదళన

కువలయాపీడనకుధరసంక్రందన
సంక్రందన స్మయజలదపవన
గీ. పవననందనసేవితపాదనళిన
నళినలోచన సనకసనందవినుత
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 13

సీ. ఘనులకు జీవనం బెనయించుమామను
గట్టించితివి మున్ను కపులచేతఁ
బ్రియ వెతఁ జెందఁ దత్ప్రియసోదరునిఁ బట్టి
శిరము రేవులవార గొరిగినావు
దాహిత్రు భీష్మునిఁ దత్పౌత్రుఁ బురికొల్పి
పొంచి బాణములఁ గూల్పించినావు
తనయుఁ డౌభాముని తప్పు సైరింపక
తల్లిపైఁ బడఁ దల దఱిగినాఁడ
గీ. వీవిధంబున నీవారి నిట్లు సేయ
శాశ్వతానంద మొసఁగుటే సత్య మరయ
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 14

సీ. అభిమన్యుసుదతి గర్భార్భకుఁ జంపఁగా
నరుదెంచుబ్రాణిబాణాగ్నికంటె
గహనాంతరాగాధకమలాకరంబునఁ
గరిరాజు నొంచునక్రంబుకంటె
నంబరీషునిఁ జంప నలనాఁడు దూర్వాసు
కినుక చే నరుదెంచుకృత్తికంటెఁ
గనకకశ్యపుఁడు తాఁ గన్నపట్టిని జంప
యత్నించుఘోరయత్నంబుకంటె

గీ. భారమా నీకు నావిపదాభర మిపుడు
దూరముగఁ జిమ్ము శుభములఁ జేర నిమ్ము
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 15

సీ. నందనందన యరవిందనయన పురం
దరముఖ సురనుతచరణకమల
కమలామనోజాతకమలా ప్త కమలా ప్త
కమలాంకనయన పుష్కరశయాన
సితఖగనిహతకౌశికజాతకౌశిక
రిపుజాత కౌశికీకృతసుతేజ
తేజోవినిర్జితాదిత్యకోటిరథాంగ
యహిభుక్తురంగ భక్తానుషంగ

గీ. వినతహర్భంగ శ్రీరంగ వెన్నదొంగ
ప్రేమ యుప్పొంగ రక్షించు కోమలాంగ
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 16

సీ. నీలాంబుదశ్యామ నిర్జితసుత్రామ
రక్షితభీమ శ్రీరామనామ
భక్తదుఃఖవిరామ బలరామ భృగురామ
వైకుంఠపురధామ వైరిభీమ
రవికోటిసమధామ రమ్యగుణోద్దామ
సుందరజితకామ సురలలామ
శూరోత్తమాన్వయక్షీరాంబునిధిసోమ
సలలితసీమ దాసులము కామ

గీ. జగదవనకామ జయరామ సదయ ప్రోవు
మాదరింపవు నిను జీత మడిగినామ

సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 17

సీ. సితఖగవాహసన్నుత నన్నుఁ బ్రోవుము
సితఖగదళితకౌశికవిరోధి
కౌశికసవనరక్షణ దానధౌరేయ
కలుషాహికౌశిక ఖచరవాహ
ఖగతులవారాశి కమలాంక కమలాంక
కమలాంకరక్షణ కమలనాభ
పుష్కరధిశయన పుష్కరాభనయన
పుష్కరోదరరిపుపుష్కరాబ్జ

గీ. అబ్జచక్రాబ్జనందకహస్తకమల
విమలచారిత్ర రక్షింపవే మురారి
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 18

సీ. దోపాచరాధీశ యోపాసుమాంగల్య
దూపాసమాశ్లేష శేషశయన
శ్రీదా సరిజ్జన్మపాదా ననుం గావ
రాదా సదామోద రమ్యావాడ
యీశా నతక్లేశనాశా సురాధీశ
శ్రీశా హృషీకేశ చిత్ప్రకాశ
రారా జగద్వీర ధీరా సురారాతి
మారా మురధ్వంస దుర్నివార

గీ. ఘోరతరదుర్భరామయకుక్షి ముడిపి
యేల జా గేల చేసె దిదేల రార
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 19

సీ. శ్రీరుక్మిణీనాథ జితసాళ్వభూనాథ
కవ్వాడి కిడితి సుజ్ఞానబోధ
నిఖిలదేవసనాథ నినుఁ జెందినది రాధ
నిర్జితసురనాథ నిర్నిరోధ
యఖిలజగన్నాథ యార్తదుఃఖనిరోధ
యవనతరిపుయూథ హతవిరాధ

గీ. దయ నొసంగుము సుజ్ఞానత త్వబోధ
యాధి వారించి ప్రోవు మనాథనాథ
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 20

ముక్తపదగ్రస్తము

సీ. శ్రీరుక్మిణీమనస్సారసవరహంస
హంసాబ్జనయన సత్యస్వరూప
రూపనిర్జితపుష్పచాప కృపావార్ధి
వార్ధిసుతాసక్త వాసుదేవ
దేవకీసుత కృష్ణ దీనచింతామణి
మణిసువర్ణకలాప మధురభాష
భాషావధూవర వరద దామోదర
దరచక్రధర ధరావర ముకుంద

గీ. కుందకుట్మలరద ముచికుందవినుత
నుతగిరీశాదిసురవర సతతసదయ
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 21

సీ. శ్రీరుక్మిణీమానచోరా కృపాశీల
శ్రీయుతాకార కౌశేయచేల
పరిహృతగోపాలబాలికాంశుకజాల
ఘనరణవిజితమాగధన్నృపాల

కాంచననవరత్నకలితభూషణజాల
సలలితమృగమదతిలకఫాల
భక్తకిల్బిషఘనపటుతరవాతూల
విడనాడినను నిను విడువఁజాలఁ

గీ. గరుణ నామీఁద లేదకో కామపాల
శరణుఁ జొచ్చితి రక్షింప జాఁగిదేల
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 22

సీ. కరుణాకటాక్షవీక్షణసుధాశీతల
శమితనతౌఘసంసరణతాప
తాపసస్తుత జగద్వ్యాపక సర్వేశ
సర్వశక్తిసమేత సర్వసాక్షి
సర్వలోకాధార సర్వజ్ఞ సర్వాత్మ
సర్వదేవశరణ్య సదయహృదయ
దుఃఖహేతువు లైనదుర్విషయాసక్తిఁ
జిక్కితి రక్షించు శ్రీనివాస

గీ. దిక్కు నీకంటె వే ఱొకదిక్కు లేని
నన్నుఁ జిక్కులఁ బెట్ట కనాథనాథ
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 23

సీ. కాంచనరత్నసంఘటితదివ్యకిరీట
యపహృతహేమకశ్యపనిశాట
పరిపాలితాశేషసురమునివరకూట
నిను స్మరించిన మోక్షమునకు బాట
యేపూట నీ గాథ యింపుగాఁ జెవి నాఁటఁ
జిక్కవో యాపూట చెడును బాట

భక్తి యొసంగునాపాపచింతలతోట
భస్మంబు చేయ నీ పాలి దాట
గీ. జీవితేశ్వర నామొఱ చెవిని నాఁట
దాయె నాభాగ్య మిట్లాయెఁ దార్క్ష్యవాహ
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 24

సీ. రాజవంశసుధాబ్ధిరాజ రాజకిరీట
రత్ననీరాజితరమ్యచరణ
చరణరజఃకణశమితగౌతమసతీ
శాపసంప్రాప్తపాషాణరూప
రూపనిర్జితసుమచాప చాపవిముక్త
శితశరనిహతకౌశికకుమార
మారజిన్ముఖ్యబృందారకార్చితపద
పదదళితశకటపలలఖాద
గీ. ఖాదకృద్దావదాన ప్రహ్లాదవరద
రదవిజితకుంద గోవింద రమ్యవదన
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 25

సీ. అఖిలసంపత్కారణాపాంగసంజాత
స్థిరతరైశ్వర్య లక్ష్మీసమేత
చరణకంజాతసంజాతదివ్యాపగా
ప్రశమితాఖిలలోకపంకజాత
శ్వేతవాహనరథసూత పాండవపక్ష
పాత సజ్జనబృందపారిజాత
కామోదకీగదాఘాతచూర్ణితవైరి
సంఘాత భక్తమోక్షప్రదాత

గీ. దేవకీసుత శౌరి కౌంతేయదూత
యాశ్రితునిఁ గాఁగ నేలు లోకైకనేత
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 26

సీ. గాంగేయనవరత్నకలితదివ్యకలాప
విమతదానవభుజంగమకలాప
శితశతకోటిధిక్కృతశాతఘనరోష
ఖండితఘోరరాక్షసకలాప
వ్రజమనినీమనోహర మృదుసల్లాప
ప్రథితరక్షితసరిద్వరకలాప
ఖరదూషణాలాప ఖరదూషణధ్వంస
శరపూరితకలాప శార్ఙ్గచాప

గీ. యాపదల రూపు మాప దివ్యస్వరూప
మేల గనుపింపఁ జేయ వి దేల శ్రీప
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 27

సీ. కన్నబిడ్డలయందుఁ గనికరం బుంచక
పుట్టినప్పుడె నేటఁ బెట్టెఁ దనయ
తనయతో గమనించఁ దగ దని యెంచక
మోహించి చేరె నీ మొదటికొడుకు
కొడుకుబిడ్డ యొకండు కోపస్వభావుండు
తండ్రిని దలఁ గొట్టి తగవు దప్పెఁ
దప్పని యెంచక త్రాగుడు జూదముల్
గైకొనె మీయన్న ఘనత మీఅ

గీ. వీర లిట్లుండ ని న్నెన్న విధికి వశమె
జారచోరమహాఘోర జాణ ఫోర

సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 28

సీ. పేడితనంబున నాడువారికి నాట
గఱపినవాఁడు నీ మఱఁది గాఁడె
చెఱ నుంచి తండ్రిని సంకటపెట్టిన
మనుజాశి నీ మేనమామ గాఁడె
కుజనరక్షణ సేయుగురుగురుద్రోహి నీ
భార్యతోఁ బుట్టినవాఁడు గాఁడె
మినుసిగదయ్యంబు తనకు లోఁబడఁజేయు
ఘనమాయఁలాడి నీ యనుజ గాదె

గీ. నీదు సంబంధు లీలాటినిష్ఠపరులె
నీకుఁ గలనిష్ఠ తెలియఁగా నెవ్వఁ డోపు
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 29

సీ. వనజలోచన భక్తవత్సల గోవింద
కమలనాభ రమేశ కనకవసన
సనకసనందనాద్యనఘయోగిహృదబ్జ
పుష్కరాక్ష ముకుంద పుణ్యమూర్తి
నారాయణ యనంత నందనందన ముచి
కుందసంస్తుత్య సద్గుణగభీర
సదయ జనార్దన సాధులక్షణశీల
శంఖచక్రాంకితచారుహస్త

గీ. శరణుఁ జొచ్చితి రక్షించు సత్యవచన
గరుడవాహన దీనరక్షణ మురారి
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష! 30

సీ. పరమదయాస్వాంత భవదీయశ్రీపాద
కమలంబులే గతి గాక నాకు
వే ఱొక్కగతి లేదు వెనుకటినేరముల్
దలఁచక ప్రోవుమా తండ్రి నీవు
మఱుఁగుఁ జొచ్చితి నన్నుఁ గరుణించు శరణన్న
వారల రక్షించుభరము నీది
యని ప్రతిజ్ఞ యొనర్చినా వని బుధులచే
విని నమ్మియుంటిని విశ్వసించి

గీ. నీదుచిత్తంబు నాభాగ్యసిద్ధి యెటుల (?)
నున్నదో చెప్పనేరఁ బ్రసన్నవదన
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 31

సీ. యుష్మదాహ్వాయరత్నయుగ్మకూటాంధ్రస
త్పద్యరాగావళి భక్తియుక్తి
సాధుజనప్రీతి సమకూర నొనరించి
యర్పించితిని గొను మార్తపోష
జ్ఞానం బొకించుక లేని కానురి లింగ
మూర్తికిఁ బురుషార్థముల నొసంగి
కడు వేగఁ బ్రోవవే పుడమి గోపాంగనా
జనులఁ బ్రోచినరీతి శాశ్వతముగ

గీ. నేరముల నెంచి నాయెడ నిష్ఠురంబుఁ
దలఁచ వల దయ్య నీదాసదాసజనుఁడ
సరసదరహాస గౌతమవరనివాస
కేశవ ముకుంద హరి హృషీకేశ కృష్ణ! 32

సంపూర్ణము

100

శుభమస్తు

శ్రీ వేంకటేశ్వర షోడశాష్టపది

—★—

ఉ. శ్రీయుతసర్వమంగళధురీణనువీక్షణపం క్తి సౌఖ్యసు
శ్రీయుత మై జగంబు కడుఁ జెన్నుగఁ బ్రోవ ఫణీశశైలమం
దాయలివేలుమంగయు ధరాంగన నీలయుఁ గొల్వ రత్నగాం
గేయకలాపరత్నరుచికిం గడు సొంపు నొసంగు దేహసు
చ్ఛాయ మహేంద్రనీలముల సంపద యింపు హసింప దిగ్గజేం
ద్రాయతతుండసన్నిభకరాగ్రగదారిదరాసిశార్ఙ్గముల్
పాయక వెంబడించి నిరపాయత దీనులఁ బ్రోవ యోగిహృ
ద్ధ్యేయభవత్పదంబు లడియేనికిఁ బ్రాపగు వేంకటేశ్వరా ! 1

ఉ. శ్రీరమణీశ కృష్ణ నరసింహ జనార్దన వాసుదేవ కం
సారి మురాసురద్విపమృగాధిప శేషఫణీశశైలసం
చారి యఘాపహారి భవసాగర మీఁదఁగ నేర నేర నా
నేరములన్ క్షమింపఁ గలనేర్పరు లెవ్వరు లేరు లేరు నిన్
జేరితిఁ జేరితిం గరుణఁ జేకొని కావుము కావు మంచు నే
గోరితి నిన్నె నిన్నె యిదిగో యిటు గాంచుము గాంచు మయ్య నీ
కూరిమిసత్కటాక్ష మొక కొంచెము నాపయి సోఁక దుఃఖసం
తారకపాదపద్మ వినతాసుతవాహన వేంకటేశ్వరా ! 2

ఉ. చొచ్చి పయోధిఁ బద్మజుఁడు చొక్కి పరుండఁగ నిద్రపాటునన్
ప్రుచ్చిలి వేదము ల్గొనుచు మోసపుదుర్మతి వార్ధి నుండుపా
టచ్చరుఁ డైనశాటునిఁ బటాలున దాఁటుచు వానిజీవితం
బచ్చట నేటఁ గల్పి నిటలాక్షజటీశ్వరఖేటరాడ్వ్రిజం
బచ్చట మింటిపై నిలిచి యంతయుఁ జూచుచు మాటిమాటికిన్
ముచ్చటఁ జెంది ప్రొక్కుచు నమో నమ యంచు నుతింపఁ

[దచ్ఛ్రుతుల్

దెచ్చి విధాత కిచ్చుఘనదివ్యతరాద్భుతమత్స్యమూర్తి నా
యొచ్చెము లెల్లఁ దీర్చు శర ణొందితిఁ గావవె వేంకటేశ్వరా! 3

ఉ. కూటువ లై సురాసుర లకుంఠితు లై మనపాలవెల్లిపై
నోటమి లేక మందరము నుంచి మథింపఁగ నద్రి మున్గి పె
ల్లోటమిఁ జెంది కుయ్యిడఁగ నోడకుఁ డంచుఁ గృపారసంబు బా
హాటము గాఁగఁ జూపి కమఠాకృతి దద్గిరి నెత్తి త్రొ భళీ
హాటకచేల భక్తపటలాఘవిపాటన కేళిలోల నీ
సాటిప్రభుండు గల్గమి నిజంబు సరోజభవాండకోటి ము
మ్మాటికి నెంచి చూడ ననుమానము లేదు నిశాటజీవితో
చ్చాటన కోటిసూర్యనిభ చక్రధరా హరి వేంకటేశ్వరా! 4

ఉ. పుత్తడికంటిరక్కసుఁడు బుద్ధివిహీనమదోద్ధతిం ధరం
దత్తరపాటుఁ జెందక నుదాత్తగతిం జలధిక్ స్వకీయ మా
సొత్తుగ హత్తి దాఁచుకొన సూకరరూపము నెత్తి వాని పె
న్నెత్తురు నీట హత్తి దివి నృత్తముఁ జేయుచు దేవతాంగనల్
మెత్తము లై సుమాంజలులు ముంపుచుఁ బాటలఁ బాడఁ
[గొమ్మ్నచే
నెత్తి ధరించి మిత్తికడ కెత్తి సురద్విషు సప్రమత్తతన్
మెత్తనిరీతి వార్ధిపయో మేదిని నిల్పిననీపదాబ్జముల్
చిత్తమునం దలంచెదను శ్రీకరుణాకర వేంకటేశ్వరా! 5

ఉ. స్తంభితజంభదానవవిదారణ దారుణశంబశ స్తదో
స్తంభుని హేమకశ్యపు నధార్మికునిన్ విదళింపఁ దత్సభా
స్తంభమునందఁ దంభఘనదర్పవిజృంభితవిక్రమక్రియా
రంభవిశేషఘోరతరరంహన్నృసింహ తదోచితద్విధా
రంభణలోలఘోరనఖరంబులఁ జీల్చి యురంబు దైత్య సం
రంభత మాన్పి సద్గుణవిరాజితు భాగవతాగ్రగణ్యుఁ డో
డింభకుఁ దత్కుమారకుఁ గడిందికృపారస ముప్పతిల్ల వి
శ్వంభరఁ గాచి తౌ బుధులు సన్నుతి సేయఁగ వేంకటేశ్వరా! 6

ఉ. ఎంచఁగ మించుసీచరిత మించుకలో నొకకొంచెమ్ము విచా
రించి వచించఁ గాంచఁగ విరించికిఁ బంచశరాభియాతికిం
గ్రాంచవిదారికిఁ భుజగరాజునకుం దర మౌనె నాల్గు చౌ
వంచయు జంట మూఁడు పదివందల నోళ్లల వంచు నిక్కినం
బంచశరాయుతాభ బలివల్లభుఁ గోరి పదత్రయంబు యా
చించి ధరం ద్రివిక్రమతఁ జిత్రముగా జగ మెల్ల నిండి సా
ధించి సురారిసంపదలు దేవవిభుం డెద సంతసించి నే
వించఁగ నిచ్చు వామనతఁ బేర్మి వహించవె వేంకటేశ్వరా! 7

ఉ. ఘోరకుఠారధారహతకుంఠితసద్భటఘోటకాదిదు
ర్వారచమూసమేత ఘనబాహుసహస్రముఖాధిభూత ధా
త్రీరమణావరోధ యువతీనయనాశ్రుజలప్రశాంత వి
స్తారతరాత్మరోషవినశస్థితిఁ దద్ధరణీశర క్తసం
పూరితస త్తటాకములఁ బుణ్యవిధిం బితృతర్పణంబు నిం
పారఁగఁ జేసి విప్రు లనయంబు సుఖింప ధనాఢ్యధాత్రి పెం
పార నొసంగి తీవు మును ప ట్లుటు భార్గవరామ సుందరా
కార నతా ర్తిచోర ననుఁ గావర శ్రీవర వేంకటేశ్వరా! 8

ఉ. ధారుణిఁ దాఁటకిం దునిమి దర్పసమగ్రత మౌనియజ్ఞమున్
భారము నొందఁ జేసి శివుచాపముఁ ద్రుంచి వరించి జానకిం
గూరిమిఁ దమ్ముఁడుఁ సతియుఁ గొల్వఁగ నేఁగి వనాంతమం దమ
ర్త్యారులఁ జంపి వాలి పొలియంబడ భానుజు నేలి మూఱుతిం
గూరిమిబంటుగాఁ గొని యకుంఠితవానరసేనతోఁ నకూ
పారముఁ గట్టి రావణుని బంధుయుతంబుగఁ గొట్టి కీర్తివి
స్తారు విభీషణుం ధరణిఁ జంద్రుఁడు ధాత్రి గలంతకాల మో
శ్రీరఘురామ లంక కభిషేకముఁ జేయవె వేంకటేశ్వరా! 9

ఉ. వీరుఁ బ్రబలంబుఁ ద్రుంచి బలవిశ్రుతు మాగధు భంగపుచ్చి చా
ణూరునిఁ జంపి భీష్మకతనూజు నడంచి కళింగు నొంచి దు

ర్వారబలాఢ్యుఁ డౌద్విదు వానరవీరునిఁ బిల్కుమార్చి ముఁ
గౌరవవీరు లాడినయగౌరవముల్ విని రోషభీషణా
కారత హస్తినాపురము గంగను ద్రోయఁగ నెత్తి నాగట
గౌరవు లార్తి వేఁడినను గాచి జగంబునఁ గీర్తి నిండఁగా
సూరిజనాళిఁ బ్రోచితివి సొంపుగ శ్రీబలరామమూర్తి వై
సారసనేత్ర దాసవనచైత్ర దయాకర వేంకటేశ్వరా! 10

ఉ. ద్వాపరమందు భూభరముఁ బాపఁగ శ్రీ బలరామమూర్తియున్
బ్రాపుగఁ గంససాళ్వశిశుపాలమురాసురభౌమముఖ్యులన్
రూ పడఁగించి విక్రమనిరూఢులఁ గౌరవరాజముఖ్యధా
త్రీపతులన్ రణావని వధింపఁగ నర్జునసారథిత్వము
న్నిపనిగా వహించి తగునేర్పునఁ బ్రోచి పృథాతనూజులన్
గోపనితంబినీమణులకుం దగుకోర్కులు దీర నేలి నీ
ప్రా పెదఁ గోరునుద్ధవుని ఫల్గునుతాదుల నేలురుక్మిణీ
శ్రీపతి వీవె గావె సురసేవిత మ్రొక్కెద వేంకటేశ్వరా! 11

ఉ. విక్రమతం ద్రిలోకు లతివీర్యులు వేదవిధోచితక్రియా
పక్రమవేదు లయ్యు సురవైరముఁ బూనుటఁ జేసి వారి నీ
చక్రియు లై నటించి ఘనసత్త్వబలంబులు వీటివోవ బౌ
ద్ధక్రమ మొప్పఁ బల్కి విమతత్రిపురాసురులన్ వధించఁగా
శుక్రయశుం ద్రిలోచనుని జోడుగ నంపి జయం బొసంగి తౌ
శక్రముఖాదిదిక్పతులు సన్నుతి సేయఁగ బుద్ధరూపి వై
చక్రివరాద్రిమందిరనిశాచరచక్రవిదారణక్రియా
వక్రనిశాతచక్రధర వారిజలోచన వేంకటేశ్వరా. 12

ఉ. ధారుణిఁ గల్కి వై సకలధర్మవినాశకు లై నదుర్మద
క్రూరకిరాతహూణశకఘూర్జరబర్బరపారశీకదు
ర్వారతురుష్కముఖ్యుల నవారణ రంహతురంగవాహవి
స్ఫారుఁడ వై వరాసిశరవారణహస్తుఁడ వై రణావనిఁ
వారక సంహరించి ధర వర్ధిలఁ జేయవె సర్వధర్మముల్

కారుణికాగ్రగణ్య కలికల్మషనాశ రమేశ కృష్ణ బ్రుం
దారకవైరినాశ వసుధారమణీశ ఫణీశతల్ప నా
గారితురంగ భక్తహృదయాబ్జదివాకర వేంకటేశ్వరా! 13

ఉ. కట్టడి నై యొనర్చినయఘుంబుల గుట్టలు లెక్క పెట్టఁగా
నెట్టన బుట్టపట్టుదొర నేర్చినది ట్టగునేని నాలుకల్
రెట్టిగఁ బుట్టి యుండియు ధరిత్రి శిరంబులు వేయు నయ్యఁ దా
నట్టిఁడు నెల్ల దిట్టలకు నట్టిటు భాషలు తప్పనట్లు బల్
గట్టిగ నూత్రముల్ పలుకఁ గల్గినయట్టివి నోళ్ల నాదిగాఁ
బుట్టిన వయ్య శక్తి మదిఁ బుట్టునొకో పతితుండ నన్నుఁ జే
పట్టక మానినం బతితపావనుఁడన్ జగదేకకీర్తికిం
బుట్టదె హాని న న్నరుణఁ బ్రోవుము వేగమె వేంకటేశ్వరా! 14

ఉ. వారిచరంబుఁ ద్రుంచి కరివల్లభు నేలుట బొంకు ద్రౌపదిం
జీరె లొసంగి కాచె నని చెప్పుట తక్కు హిరణ్యకశ్యపుం
జీరి తదీయబాలకునిఁ జేకొనె నంట హళక్కు మాకళిం
నేరముఁ జేసినం గరుణ నేర్పున నేలుట కల్ల నేటి దీ
ధారుణి నన్నుఁ బ్రోచిన యథార్థముగా మది నమ్మవచ్చు నె
వ్వారలు సెప్పిన న్మనసుఁ బాయదు సంశయ మెల్లవారికిన్
శ్రీరమణీయ సుందరశరీర జితాసురవీర యిందిరా
చారుహృదంబుజాభ్యుదయసారసబాంధవ వేంకటేశ్వరా! 15

ఉ. పంకవినాశకృ త్పరమపావన క్షీరవమాలల న్మదిన్
శంక దొలంగి మీ కరుణ సజ్జనహృద్యముగా నొనర్చితిన్
బంకజసంభవాదిసురవల్లభసన్నుత వేంకటేశ్వరా
ఖ్యాంకితషోడశాష్టపది నాఁగ ధరాస్థలి నెవ్వరేని ని
శ్శంకఁ బఠించిన న్వినిన సాధుచతుర్విధపూరుషార్థముల్
అంకిలి లేక చెంది భవదంఘ్రిసరోరుహసక్తచిత్తుఁ డౌఁ
బంకజనాభ కృష్ణ భవబంధవిమోచన వాసుదేవ యే
ణాంకసతీనుతాహ్వ్యాయ జయావహవీక్షణ వేంకటేశ్వరా! 16

సంపూర్ణము

శ్రీమతే రామానుజాయ నమః.

భక్తామృతము.

—:o:—

శా. శ్రీకళ్యాణపరంపరాజనకలక్ష్మీకాంతాసతీయుక్తుఁ డై
లోకత్రాణపరాయణత్వమున భూలోకంబునఁ సజ్జనా
స్తోకప్రస్తుతు లొప్ప దీనజనసంతోషప్రదుం డైనయా
శ్రీకృష్ణున్ ననుఁ బ్రోచుగాతమవరశ్రీకేశవుం గొల్చెదఁ. 1

శా. భక్తాభీష్టఫలప్రదుఁ సదయు శ్రీవత్సాంకశ్రీవత్సునిఁ
వ్యక్తానంతవిశేషమంగళగుణవ్యాపారలీలాసమా
సక్తుఁ సర్వఫలప్రదాననిపుణుఁ సర్వజ్ఞు సర్వాత్మునిఁ
రిక్తుల్ చేరఁగ లేనిగాతమవరశ్రీకేశవుం గొల్చెదఁ. 2

మ. శతకోట్యర్కసుతీక్ష్ణచక్రశతకోట్యాహ్లాదకారిన్యభా
సితకౌమోదకినిష్కళంకయుతకోట్యేతాంశురేఖావిరా
జితతేజోమయపాంచజన్యశుచిరాజీవంబులం దాల్చి సం
శ్రితదీనావళిఁ బ్రోచుగాతమవరశ్రీకేశవుం గొల్చెదఁ. 3

శా. ఆచారంబును సత్యముం దయయు నావం తైననున్ లేక దు
ర్వాచాప్రౌఢిమ యంతయుం గలిగి సద్వ్రాతంబు నిందించుదు
ష్టాచారుండఁ గృపాపయోధి ననుఁ దోషంబుల్ వెసం బాపి యో
శ్రీచిత్తాంబుజహేళి గాతమవరశ్రీకేశవా ప్రోవవే! 4

శా. ఆధివ్యాధులు మేర మీఱి ననుఁ నశ్శాంతాత్మునిం జేసె నా
కాధారంబొకఁ డెందు లేఁడు భవదంఘ్రుల్ గాక వేఱొండుచో
శోధింపంబడె దేవదేవ బుధసంస్తుత్యా కృపాంభోనిధీ
శ్రీధాత్రీహృదయేశ గాతమవరశ్రీకేశవా ప్రోవవే! 5

మ. కరముల్ మోడ్చి నమస్కరించెద రమాత్మ్రోమానినీభర్తకుఁ
శరజాతప్రభవాదినిర్జరసమాజత్రాతకుఁ థాతకుఁ

వరయోగీంద్రమనోబ్జహేళికిఁ గృపాపాథోధికిఁ సీరికిఁ
స్థిరసంపత్ప్రదుఁ డైనగౌతమవరశ్రీకేశవస్వామికిఁ. 6

శా. ఆరోగ్యస్థితిఁ గోరి ప్రొక్కెద హిరణ్యాక్షాగ్రజాభీల దు
ర్వారోదగ్రవిశాలనిష్ఠురకనద్వక్త్రప్రభేదక్రియా
సారోదారనిశాతతీవ్రనఖతేజోంధీకృతారాతికిఁ
శ్రీరత్నాంచితవాస గౌతమవరశ్రీకేశవస్వామికిఁ. 7

శా. సర్వాభీష్టఫలాప్తికై తలఁచెదఁ సర్వజ్ఞునిఁ సత్యునిఁ
నిర్వాణప్రభు నీశ్వరార్చితు జగన్నిర్మాణవైచిత్ర్యునిఁ
సర్వావాసుని సర్వసాక్షిని హరిఁ సర్వాతిశాయిఁ బుధా
శీర్వాదానుగుణైకు గౌతమవరశ్రీకేశవస్వామికిఁ. 8

శా. దిక్కేదిక్కున లేక పెన్నెడదచే దీనుండ నై కుయ్యిడఁ
దిక్కై కావ కుపేక్షఁ జేయఁ దగునా దీనావనా ప్రోవు నఁ
జిక్కుల్ పెట్టకు మయ్య ప్రొక్కెదఁ గృపాసింధుండ వై నీవు నా
చిక్కుల్ దీర్పుము వేగ గౌతమవరశ్రీకేశవా శ్రీహరీ! 9

ఉ. పాహి యనాథనాథ భవపాశవినాశ రమేశ పాహి శే
షాహిపతల్ప పాహి కరుణాంబుధి దీనశరణ్య పాహి మాం
పాహి నృసింహ యంచు బహుభంగుల వేఁడినఁ గావ వైతి వో
శ్రీహరి శ్రీహరీ యిటులఁ జేయఁగఁ బోలునె నన్ననాథునిఁ! 10

ఉ. భక్తిజ్ఞానవిరక్తిహీనుని మహాపాపిష్ఠునిన్ దుర్మదా
సక్తఁ లోభు నరాధముం గరిహితాచారుం దురాలాపునిం
ద్యక్తఁజేము నసత్యవాదిని వృథాతత్త్వజ్ఞునిఁ మత్తునిన్
రిక్తున్ నన్ గృప నేలు గౌతమవరశ్రీకేశవా శ్రీహరీ! 11

సీ. రఘుకులాధ్యక్షశిక్షా నృహార్యక్ష
ప్రహ్లాదరక్ష సద్భక్తపక్ష
రక్షితఫాలాక్ష రణజితకనకాక్ష
వనదావభక్ష పావనశుభేక్ష

మునిపసంరక్షు యున్మాలితార్జునవృక్షు
పద్మపత్రాక్షు శ్రీవత్సవక్షు
నరకేభహర్యక్షు నమితసహస్రాక్షు
దీనైకరక్షు విద్విషవిపక్షు
గీ. ద్రౌపదీమానసత్రక్షు ధవళపక్షు
వాహనాదిసురాధ్యక్షు వర్ణితైక
పూజ్యకల్యాణగుణగణాభోగచరిత
భక్తసంతానసంతాన పరమపురుష! 12

ఉ. వ్యక్తత లేక దుర్విషయవాంఛలఁ జిక్కఁ విహీనకర్మసం
సక్తుఁడ నై మహోగ్రతరసంసృతివార్ధి మునింగి సౌఖ్యసం
త్యక్తుఁడ నై యనన్యగతి నైతిఁ గృపాంబుధి మీపదాబ్జస
ద్భక్తియు జ్ఞానమున్ విరతి పద్మదళాక్షు యొసంగి బ్రోవవే. 13

మ. హరి గోవింద జనార్దనాహ్వయ నృసింహా కృష్ణ శ్రీరుక్మిణీ
వర కంసాంతక దేవకీతనయ సాధ్వీధ్వంస వైకుంఠ శం
కరసంస్తుత్యపదారవింద జలజాక్షా దీనబంధో దివా
కరచంద్రాక్షి యుపేంద్ర శార్ఙ్గధర భక్తాభీష్టసంధాయకా! 14

శా. శౌరీ సీరి మురారి కృష్ణ హరి కంసారాతి దామోదరా
పారావారగభీర ధీరనుత సర్వాధార సర్వాత్మకా
నీరాటంబున కోడి చిక్కినకరిన్ నిర్మ్నిద్రతం బ్రోవవా
యీరీతిఁ గృపఁ బ్రోవున న్నభయదానారూఢహస్తాంబుజా! 15

సీ. శ్రీమంగళావాస శ్రీమనోంబుజవాస
శ్రితజనార్తినిరాస శ్రీనివాస
వాసుదేవ ముకుంద వనజలోచన భక్త
వత్సల కల్యాణవార్ధినిలయ
కేశవ గోవింద కృష్ణ దామోదర
మధుకైటభాంతక మదనజనక

చక్రకౌమోదకీశంఖాబ్జయుతహస్త
కనకరత్నాంచితఘనకిరీట

గీ. కుండలాదివిభూషణకోమలాంగ
సత్కృపాపాంగ సతతప్రసన్నవదన
సరసదరహాస గౌతమవరనివాస
పరమకల్యాణ శ్రీకేశవా కృపాబ్ధి! 16

సీ. విష్టరశ్రవ కృష్ణ వృద్ధశ్రవస్తుత
విష్ణు విశ్వంభర విశ్వజనక
నీరజదళనేత్ర నిఖిలదానవజైత్ర
యింద్రజమిత్ర పక్షీశపత్ర
వైకుంఠ వామన వనమాలి శ్రీవత్స
దశరూపభృద్గదాధర యుపేంద్ర
నారాయణ యుపేంద్ర నందకధర ముచు
కుందరద ముకుంద నందతనయ

గీ. హరి హృషీకేశ మాధవ యబ్జనాభ
కాంచనాంబర గోవింద కమలవదన
సరసదరహాస గౌతమవరనివాస
పరమకళ్యాణ శ్రీకేశవా కృపాబ్ధి! 17

సీ. నందనందన భక్తచందన మునిబృంద
వందితపాదారవిందయుగళ
గళవిరాజితదివ్యకౌస్తుభమణిహార
యకలంకరాకాశశాంకవదన
వైనతేయధ్వజ వనమాలి వసుదేవ
తనయ జనార్జన ద్వైత్యమథన
మనసిజశతకోటిమానితసౌందర్య
శౌరి గదాగ్రజ చక్రపాణి

గీ. పూతనాప్రాణమారుతభుజగరాజ
రాజమౌళివిపద్భంగరమ్యవచన
సరసదరహాస గౌతమవరనివాస
పరమపావన శ్రీకేశవా కృపాబ్ధి! 18

మ. నియమం బేమియు లేనిదుర్మయుఁడ నై నీచక్రియల్ సేయుచున్
భయముం జెందక దుర్మదాంధతఁ బశుప్రాయుండ నై దేవ నీ
దయకుం బాత్రునిఁ జేసి ధన్యతముఁ గాఁ దండ్రీ కటాక్షించి ని
ష్క్రియునిం దప్పు శమించి గౌతమవరశ్రీకేశవా ప్రోవవే! 19

సీ. కేశవ సంతతక్లేశనాశన కృష్ణ
నరసఖ గోవింద నళిననాభ
పతితపావన భక్తవత్సల దీనార్తి
తృణదవానల వసుదేవతనయ
నిష్ఠురామయజన్యకష్ట మోర్వఁగ లేను
విష్టరశ్రవ వేదవేద్య వరద
శరణాగతత్రాణసద్బిరుదాంక ని
స్మరణు వేఁడితి నయ్య సదయహృదయ
గీ. జాగు సేయక ప్రోవు మో చక్రపాణి
శంతనాత్మజసన్నుత సత్యవచన
సరసదరహాస గౌతమవరనివాస
పరమకళ్యాణ శ్రీకేశవా కృపాబ్ధి! 20

చ. వనరుహనాభనాభ యమవారణవారణ రీతి మీఁతె మీఁ
తిన కృపఁ గావు కావు నను రిక్తుని రిక్తుని గాఁగఁ జేయకో
ఘనకరుణాబ్ధి యబ్ధిఘనగర్వనివారణ వారణాధిపా
వన వనజాతసంభవభవప్రముఖస్తుత కేశవా ప్రభో! 21

పంచచామరము

విహంగరాట్తురంగు వేదవేద్యు దేవకీసుతున్
సహస్రకోటిభానుతేజు సవ్యసాచిసారథిన్

బహుప్రకారరూపనామభాసితప్రచారునిఁ
మహానుభావు మమ్ము నేలు మావిభుఁ స్మరించెదఁ! 22

క. శ్రీకళ్యాణగుణాకర
లోకావన సదయహృదయ లోకస్తుత్యా
పాకద్విషాదిసన్నుత
శ్రీకాంతాహృదయవాస శ్రితజనపోషా! 23

ఉ. శ్రీహరి వాసుదేవ సరసీరుహలోచన భక్తపాలనో
త్సాహ కృపాలవాల భవసాగరకుంభభవాభ దానవ
వ్యూహఘనాటవీదహన యోగిజనస్తుత నారసింహ నా
ద్రోహములుఁ ద్రుమించి దయతో ననుఁ నేలుము శ్రీశ కేశవా! 24

ఉ. సంతత మెంత మాత్రమును శాంతిని జెందక యంతకంతకున్
వంతుకు మీఱుచున్న బలవంతపువ్యాధిని నౌషధంబు లా
వంతయు నొంపఁ జాలకనె వమ్మయె మీకృప తోడు లేమిచే
దంతిదరాభయప్రద నితాంతభవత్కృప తో డొసంగవే! 25

పంచచామరము

విపత్సరిద్వ్యాంతరప్రవిష్టదుర్మతిఁ ననుఁ
సుపర్వరాట్కిరీటరత్నశోభితాంఘ్రిపంకజ
ప్రపత్తినావ ననుఁ జేర్చి పార మొందఁ జేయవే
కృపాసుధాసరిద్వరాసుకీర్తి పెంపుఁ జెందఁగాఁ! 26

గీ. పక్కిదొరడాలు గల్గినచక్కనయ్య
చక్కదనముల గమి గన్న సామిమిన్న
మిన్నువాకను నడుగులఁ గన్న తేఁడ
కనికరంబున ననుఁ నేలు ననుదినంబు! 27

గీ. పాపగమితోని పాన్పుపైఁ బవ్వళించి
పాలమున్నీటిముద్దులబాలఁ గూడి

వేల్పుదొర లెల్ల సేవించ విశ్వ మెల్ల
సంతతము నేలు దేవుని సన్నుతింతు 28

ఉ. ఎక్కడఁ జొత్తు నేది తెర వెవ్వరి వేఁడుదు నే మనందు నే
నక్కట నిన్ను మాని మఱి యన్యులఁ జేర మనంబు గొల్పదే
నిక్కము పల్కఁ డిందులకు నీరజలోచన సాక్షి నీవె నీ
యక్కటికంబుఁ జూపి యిపు డైన ననాథుని నన్నుఁ బ్రోవవే! 29

సీ. కాంచనచేల మీకైంకర్య మూశించి
కాచి యున్నందుకుఁ గరుణ మెఱసి
యెసఁగి యీకైంకర్య మసమానరీతిగా
నెఱి వేర్చుచుండియు నీవె పూని
నడుమ నాలస్య మేర్పడఁ జేయ నేలనో
తెలియఁజాలక నేను దిగులుఁ జెంది
పగలు రే లొకరీతిఁ బరితపించుచునుంటి
దిన మొక యేడాది తెఱఁగు తోఁప

గీ. సదయహృదయారవింద నీ చరణయుగమె
దిక్కు గా కిఁక నాకు నే దిక్కు గలదు
విఘ్నమును జెంద నివ్వక వేగమునను
పూర్తి యొనరించి కైకొమ్ము పుణ్యచరిత! 30

కమలవిలసితవృత్తము

సరసిజనయనుని జలధర దేహుఁ
నిరుపమకరుణుని నిగమవిహారున్
కరివరవరదుని ఖగవరవాహుఁ
స్థిరమతిఁ దలఁచెద సిరి లిడి ప్రోవఁ. 31

క. వీసము పుణ్యము సేయక
దోసములను గోరి చేయుదుష్టుని నన్నుఁ
రోసి విడనాడ న్యాయమె
దోసము లెడఁబాపి ప్రోవు దురితవిదూరా! 32

క. కొండలు వారాశిపయిన్
బెండులుగాఁ దేల్చు దనుజసేనలఁ జంపన్
గొండల నుండెడికోతుల
తండంబుల కగునె నీదుదయ లేకున్నన్. 33

శా. శ్రీలక్ష్మ్యాయుత భవ్యకౌస్తుభలసచ్ఛ్రీవత్సవక్షస్థలా
లీలాలోకన సంస్మితాస్యకమలా లేఖాధిరాడ్వందితా
లీలామానుష దేవకీతనయ కాళింగాహిగర్వాభ్రవా
తూలా కాంచనచేల కృష్ణ సుజనస్తుత్యా కృపాంభోనిధీ! 34

శా. శ్రీనారాయణ వాసుదేవ వరదా శ్రీవత్స భక్తప్రియా
స్థాణుస్రష్టబిడౌజముఖ్యసురరాట్సంస్తుత్యచారిత్ర సు
జ్ఞానానంద మునీంద్రమానససరోజావాససారంగ స
త్రాణా బాణనిశాటదోర్దళనచక్రస్ఫారహస్తాంబుజా! 35

క. కుంతీసుతమధ్యమసఖ
దంత్రీందవిపద్భుజంగతార్క్ష్య నతార్తి
ధ్వాంతదిననాథ సురరిపు
కాంతారకృపీటజన్మ కంసవిదారీ! 36

క. శంతనునందననుత హను
మంతధ్వజమిత్ర శత్రుమర్దనచణ దు
ర్దాంతపరాక్రమ మురనర
కాంతక రవికోటిధామ యవనతభీమా! 37

క. భీమానుజసారథి రణ
భీమా భీమాగ్రజన్మవిజయైకసము
ద్దామప్రభావలక్ష్మ్మా
ధామా సదయాభిరామ దశరథరామా! 38

ఉ. పంకజనాభ భక్తజనపాలన నన్ను భవత్పదాశ్రితున్
శంక యొకింత లేక ఘనసంకటజాలము లాక్రమించుచున్

సంకటపెట్టఁ జూచెదవు జాలి యొకింతయు లేనిరీతి నీ
వింకను బ్రోవకున్న జగదేకశరణ్యుఁడ వౌట సత్యమే. 39

గీ. బండిపొలదిండిఁ జెండినదండివేలు
పండ యై యుండ గండము లందు నెట్లు
డెందమున నుండుచింతలు డింది యుండుఁ
డగ్గలం బైనయెగ్గులు తగ్గ వెపుడు! 40

పంచచామరము

భవత్కథాసుధారసైకపానలోలమానస
ప్రవర్ధమాన సుప్రసన్నభక్తియోగనావచే
భవాబ్ధి దాఁటఁ జేయు మో కృపానిధీ జగత్పతీ
భవాంబుజాతసంభవాదివంద్యమానవై భవా! 1

ఉ. మానసచంచలం బుడిపి మాధవ నీ పదపద్మసంగత
ధ్యానసుధారసప్రశమితాఖిలవాతరుగాదివ్యాధిసం
తానుఁడ నై నిరంతరముఁ దావక సేవ లొనర్ప భక్తసం
తాన మొసంగవే యభయదానకరాంబుజ శ్రీరమాపతీ! 42

ఉ. అక్కట ఘోరసంకటము లద్భుతరీతిని బాధఁ జేయఁగా
దిక్కొకఁ డెందు లేక కడు దీనుఁడ నై మొఱ సేయ నామొఱ్ఱ
జక్కఁగ నాలకించి ననుఁ సత్వరతఁ గృపఁ బ్రోవ వైతి నా
యెక్కువపాపముం దలఁచి యీవిటు సేయఁగ ధర్మమే హరీ! 43

ఉ. దీనశరణ్య దేవ జగదేకవదాన్య యనన్యరక్షణా
ధీనుఁడ నైననేను గడుదీనతఁ గుయ్యిడుచుంటి బాధలఁ
మానిపి మీపదాబ్జముల మక్కువచే భజియించునట్లు సు
జ్ఞాన మొసంగి బ్రోవవె యకారణబాంధవ కేశవా ప్రభో! 44

చంపకపుష్పమాలికాబంధము

చ. మురహర నారదాదిమునిముఖ్యముదప్రద సాదరా దయా
కర వరధీర రామ కవికల్పక కేశవ పావనా వనే
చరహర సీరపాణి జలజధ్వజ లక్ష్మ పదాపతాపరా
వరనరసారథీ యభవ భక్తభయాపహ సాహసా హరీ! 45



ఖడ్గకందము

క. శ్రితహితమత ధృతనందక
హతపాతక తతఘృణాబ్ధి యచ్యుత కృష్ణా
సతతము గౌతమవరజన
హిత మొసఁగెడునీకు మ్రొక్కు నే నొసరింతున్ ! 46



ఖడ్గకందము

క. సారాచారా ధీరా
రారా శ్రీరాజరాజ రవిసమతేజా
జ·రప్రచారశూరా
రారా గోపాలకృష్ణ రామావరజా ! 47

క. దీనజనవినుత చేకొనఁ
బూనిననిను నిశ్చయముగ బుద్ధిని దలఁపక
లేనిఘనచంచలాత్మ్నని
మానితకృపఁ బ్రోవు మయ్య మదనారినుతా! 48

క. శ్రీవర వసువసన జగ
ద్భావితవిషవిజయదైత్యభటగళదళన
ప్రావీణ్య నిశితనందక
నావిషమవ్యాధి నణఁచి ననుఁ బ్రోవు త్వరన! 49

క. వనజనయన గౌతమవర
మునిజనమానసము లధికముద మొదవ లస
ద్ఘనధనధాన్యాదుల పెం
పెనయన్ రక్షించునింది రేశు భజింతున్! 50

ఉ. శ్రీద పురందరాదిసుర సేవితపాద సనందముఖ్యస
ద్వేదనుతానుమోద యరిభేదవినోద సువేణునాదస
మ్మోద నరాదదుర్మదవిమూలద సాత్వికయోగిమానసా
హ్లాదకరాస్యపద్మ శరణార్థిని బ్రోవఁ గదే మహాప్రభో! 51

ఉ. శ్రీపతి తానకాంఘ్రిసరసీజయుగార్పితమానసుండ నై
పాపవినాశ తావకశుభావహనామము సంస్మరించు నా
పాప మదేలనో ప్రబలబాధ నలంచఁ దొడంగె శ్రీహరీ
యాపదఁ బాపి నన్ను శరణార్థిని బ్రోవఁగదే మహాప్రభో! 52



నాగబంధచంపకమాలావృత్తము

చ. అమలినరూప సామజవరావన సత్కరుణాపయోధి యూ
శ మధువిదార రామ నరసారథి సత్యపరేశ వాసవా
ద్వ్యమరపరారి సామజహితాహిత తస్కరథానవాసధో!
త్తమవశచారునామ ఘనదానవదిష్టిరిపూవినూతనా! 53

ఉ. ది క్కొకఁ డెందు లేనికడుదీనతచే భవదాభిధేయమే
దిక్కుగ సంస్మరించుచును దీవ్రతరం బగువ్యాధిబాధచే

సృక్కుచు నుంటి నీచరణసేవకుఁ బాసి మహానుభావ యే
సృక్కును జెందనీక ననుఁ జేకొని ప్రోవఁగదే మహాప్రభో ! 54



నామగోపనశార్ఙ్గాలచక్రబంధము

శా. సత్యాశస్తగుణాన్వితా భవహరా సంరక్షితామిత్రజా
సత్యావల్లభ వాసుదేవ వరదా సర్వేశ్వరా శ్రీధరా
నిత్యస్వాశ్రయ మిచ్చి ప్రోవవలదా నిష్ణాతనా కేశవా
జాత్యోత్తంసగుణాసహిష్ణుని ననుఁ జాల్మి న్వీరాజధ్వజా ! 55

ఉ. ఓకమలాక్ష కృష్ణ వనజోదర దీనశరణ్య వాసుదే
వా కమలామనోహర శుభావహవీక్షణ వైనతేయవా

హా కరుణాసుధాజలధి యాశ్రితకల్పమహీజ వేగ రా
వే కరుణాకటాక్షముల వేగమె ప్రోవఁగ దే మహాప్రభో! 56

ఉ. పాతకజాతసంజనితబాధలఁ దాళఁగ లేక నీపదా
బ్జాతయుగంబుఁ జేరితిఁ గృపాళుఁడ వీ వని నమ్మితిన్ మహా
పాతకనాశకృత్పరమపావననామసుధారసాప్తి న
న్నాతతలీల సౌఖ్యముల నందఁగఁ జేయఁగ దే మహాప్రభో! 57

ఉ కేశవ వాసుదేవ హరి కృష్ణ మురారి ముకుంద యిందిరా
ధీశ ఖగేశవాహన యుధిష్ఠిరపాలన సాళ్వరాజ వా
తాశన పన్నగారి నగధారి కృపామయదృక్ప్రసారి నా
యాశ ఫలింపఁగా నిలఁ గృతార్థునిఁ జేయఁగ దే మహాప్రభో! 58

షోడశదళకమలసీసము

సీ. రక్షితలోక కంజాక్ష సత్యవ్రత
కలిదోషసమవర్తి కంసవైరి
రత్నచామీకరరమ్యసద్భూషణ
కమలజాతనివాసకలిత దేహ
నిస్తులకరుణాబ్ధి నిర్జితారికలాప
వాసవానుజ కంధివరశయాన
శోకనాశన ముదాస్తోక కల్మషభేద
దానవకంజవృత్రారి శౌరి

గీ. శుకముఖబ్రుహ్మేశపోషక సుజనశరణ
యిఁకను సుఖరీతి ననుఁ గరుణించు వరద



సరసదరహాస గౌతమవరనివాస

కేశవ ముకుంద హరి హృషీకేశ శౌరి! 59

ఉ. భీతిద మై ప్రతిక్రియల పెంపు నడంచి ఘనామయంబు పె
న్బూతముఁబోలె వెన్దగిలె బుద్ధి కలంకతఁ జెండె నాడులున్
ధాతుచయంబు దుర్బలత దై న్యముఁ దాపము నొందఁజేసె నీ
శీతలవీక్షణామృతముచే ననుఁ బ్రోవఁగ దే మహాప్రభో! 60



షోడశదళకమలసీసము

సీ. రమ్యగుణాకర రాజముఖ్యస్తుత
కలిదోషహర బుధకంజసూర్య
ప్రోచితి మకరిచేఁ బోరాడి మదకరి
సృక్కిన తడయక శ్రీరమేశ
నాకు నీకరుణచే ననయంబు కళ్యాణ
మలవడు లోకవిఖ్యాతి నరయ

శకటనాశన కృష్ణ బకవైరి శ్వేతాశ్వ
సఖ కంజలోచన శమితకలుష

గీ. సాదరానంతకళ్యాణసౌహృదాత్మ
లోకనాయక యచ్యు తాస్తోకచరిత
వరద మురహర ప్రోవరా వనధిశయన
జలజనయన నతావన సదయహృదయ! 61

ఉ. స్తూలరదంబు మున్నిసుక దోసెడు సేతువనైనఁ బోసెనే
నేలను బొర్ల దేహమున నిల్చినమాత్రము రాల్చెఁ గాని పాం
చాలి యొసంగె నీకు నొకశాకలవంబును గాని మేలు భ
క్త్యాల నొసంగెనే యెటులఁ గాచితి వారల నోమహాప్రభో! 62

ఉ. ఎంచక శత్రుమిత్రు లని యెవ్వరి నైనను బ్రోచుచుండవే
వంచన దేవి ప్రుచ్చిలిన వైరిసహోదరుఁ డాశ్రయించినన్
మించినరాజ్యవై భవసమేతునిగా నొనరించి కావవే
పంచశరారిసన్నుత కృపామయ ప్రోవఁగదే మహాప్రభో! 63

ఉ. ప్రొయికిఁతీఁ బకిఁనెకిఁదొర మొకిల మావెతఁజికిఁ దికుఁ
చకినినొకిఁసిం గనఁగఁ జాలక సృకిఁన దికుఁ లేనిన [యే
నొనకిఁటఁ గావ నకిఁటిక మొకితఱిఁ మదిఁ దకిఁనట్టి నీ
వొకిఁడు దకిఁ చికిఁడు మఱొకిఁడు నికిఁము నన్నుఁ
[బ్రోవవే!

రథబంధసీసము

సీ. శ్రీశ గౌతమనుత శేషతల్పక మధు
నాశనకర దేవ యాశవంద్య
రుక్మిణీవర చారురుక్మభూషణమౌని
వరనుతచరిత భవాబ్ధితరణ
సారసలోచన సాకేతవాస్తవ్య
శరణాగతులఁ గావ సమయ మిదియె

నీదు స్వాతంత్ర్యంబు నెఱ నమ్మితిమి మమ్ము
రక్షింపు గుణసీమ రమ్యధామ

గీ. యే మనందగు మ మ్మేల వేని నిన్ను
రమ్యగుణశీల రక్షించు రాజ వనుచుఁ
జూచుచున్నాము ప్రోవరా సుఖముఁ గాంచఁ
బాలితామరసంభూత పార్థసాది! 65

ఉ. అపరిమితాపచారముల కాశ్రయ మై ధరణీతలంబునం
దపయశ మొందఁజేసె నకటా విధి నే మనువాఁడ దేవ నా
యపకృతు లెన్ని యో కల పవన్నియుఁ దల్పక వాసుదేవ నీ
కృప గనుపింప లోకులకుఁ గేశవ ప్రోవఁగ దే మహాప్రభో! 66

ఉ. సంతతసత్కృపామృతరసస్రవదంచితసత్కటాక్ష నా
స్వాంతము ఘోరదుర్విషయసంగతి నొందఁగ నీకు నీపదా
త్యంతిక మొందునంత పరియంతము నా కిది చాలుఁ జాలు నే
నింతియె కాని కోర నిఁక గోరిక నీవర మియ్యఁగ దే మహాప్రభో!

ఉ. కామవికారసంజనితకష్టమహాబ్ధి మునింగితిం గటా
యీమహిలోన నన్నుఁ గరుణించెడు దైవ మొకండు లేఁడొకో
సామజరాజుఁ బ్రోవఁ దనచక్రముఁ బంపినవాఁడు నేఁడు నా
బాముఁ దొలంగఁజేయఁ డిది భాగ్యము నాయది గాదె శ్రీహరీ!

ఉత్సాహవృత్తము

సరసమధురవచనరచనచాతురీధురీణ నీ
చరణసరసిజములు మదిని సన్నుతించి వేఁడఁగా
శరధిశయన కరుణ గలిగి సత్కరింప వేలరా
సరసిజభవవినుతచరణ జానకీమనోహరా!

ఉత్సాహవృత్తము

ద్విరదవరద రామ కృష్ణ దేవకీతనూభవా
మురనరకహిరణ్యదైత్యముఖ్యదానవాంతకా

గరుడగమన చక్రపాణి కరినితార్తిభంజనా
నిరుపమకృప నన్ను నేలు నీకు మ్రొక్కి వేఁడితిఁ. 68

కుమారలలితావృత్తము

సరోజదళనేత్రా సురాళివరజైత్రా
గిరీశనుతపాత్రా సురేశసుతమిత్రా!

పంచచామరము

దురంతపాపకర్ముఁ డైన దోసి లొగ్గి వేఁడినన్
నిరాకరించ కాదరించి నిన్నుఁ జేర్చుకొందు వౌ
నరిష్ట మాచరించి మిమ్ము నాశ్రయించి వేఁడినన్
అరిష్టదైత్యుఁ గావవే మహాప్రభూ కృపానిధీ! 69

ఉత్సాహవృత్తము

గరుడగమన వసధిశయన కనకవసన శ్రీధరా
సురవరనుత కమలనయన శుభము లొసఁగి ప్రోవరా
కరివరవిపదహిపగరుడ కనకనయనసంహరా
నిరుపమశుభచరిత వరనిగమసువినుత కేశవా! 70

అనుష్టుప్పు

శ్రీదా నాపై దయ లేదా రాదా నే వేఁడితిఁ గాదా
వాదా నాతో మృదుపాదా నీదాసత్వం బియరాదా! 70

మానినీవృత్తము

రంగదభంగపరాక్రమనిర్జితరావణముఖ్యసురద్విష సా
రంగమదాపహ సజ్జనపుంగవరక్షణ సారసలోచన సా
రంగవిపద్భరభంగ విహంగతురంగ శుభాంగ దయామయ స
త్సంగ ధరాసుతమానసవారిజసక్తమరాళ గిరీశనుతా! 71

మ. కరుణాంభోనిధి దీనవత్సల రమాకాంతా హృషీకేశ దు
ర్భరతృష్ణాపిశితాశినోటఁ బడితిం రక్షింపు రక్షింపు స

త్వరతన్ ముస్నఖిదైత్య నోటఁ బడుగోపాలార్భకవ్రాతముం
గరుణాదృష్టిని బ్రోవలేదె యటులం గాపాడవే శ్రీహరీ! 72

మత్తకోకిల

రామ కేశవ శౌరి సీరి మురారి మాధవ శ్రీధరా
వామనా శ్రీకృష్ణ యచ్యుత వాసుదేవ జనార్దనా
కామపాల పురందరానుజ కంసదానవభంజనా
శ్యామలామలవారివాహనిభాంగ సుందర ప్రోవరా!

మానినీవృత్తము

ఎంగిలిపండ్లు నొసంగినయంగన కీప్సిత మిచ్చినదాతవు నీ
యింగిత మెవ్వ రెఱుంగుదు రీమహి నెంతటివాఁడవు సత్కృపతోఁ
జెంగటఁ జేరి శుభంబు లొసంగుము శ్రీధర మ్రొక్కెదఁ జిత్తము స
త్సంగతిఁ జెంది నిరంతర తావకసత్కథలే వినఁ గోరితిరా! 74

సాగరజాహృదయాంబుజభాస్కర సద్విజసన్నుత సత్యయుతా
భోగిశయాన విహంగమవాహన పుంగవవాహనసన్నుత స
ద్యోగవిభాసితమానినమనోంబుజయూర్జితమందిర శిక్షితస
త్పూగ యభీష్టద పుణ్యజనాశ్రయ తోయజనాభ మురారి హరీ!

చతురంగబంధసీసము

సీ. దశరథమేదినీధవకుమార కుమార
కలుషాహిపక్షగేంద్ర ఖచరపోష
గోవింద మునిమాన్య గోపకులావన
పౌలస్త్యమర్దన పరమరాళ
వారిద వనవహ్నివారణ బుధజన
గోత్రసియచరిత్ర ఖేటయాన
సదాస్య మిమునా నేర మెంచ కజాది
సేవితాంఘ్రిసరోజ శ్రీరమేశ



గీ. తామసాంతక జగదభిరామనామ
బాధ వారించి యేలర పరమకృపను
శ్రీకరోద్దామ రిపుజనశ్రీవిరామ
శమదమాదిగుణస్తోమ శత్రుభీమ
రామ శ్రీరామ జానకీరామచంద్ర! 76

పుష్పమాలికాసీసము

సీ. శ్రీహరి హరిహయసేవిత విధు విష్ణు
శ్రీరామ రామ రాజీవనయన



వినతాత్మజధ్వజ ద్విజతల్ప ఘనఘనా
ఘనసుతసూత పూతననివార
వాసవానుజ భక్తభవభయహార వీర
పరమపావన వనవహ్నిహారి
శౌరి సీరి ముకుంద సదయ దర్పకగురు
గురుగుణాస్తోక శ్రీకరకలాప

ఆ. దేవదేవ దేవభావిత విశ్వావి
ద్వానుతపాతకాంత త్రిదశవశగ
శమితకంస కనకవిమలచేల సలక్ష్మ
సుజనజలజమిహిర చోరహరణ! 77

శా. శ్రీగోవింద ముకుంద కృష్ణ హరి శౌరీ వాసుదేవా నృసిం
హా గోవర్ధన గోపికారమణ కంసారాతి పద్మోదరా
యోగానంద మురారి విష్ణు విధు ప్రద్యుమ్నా సహస్రాక్ష స
ద్యోగాధీశ వికుంఠనామనిలయా యోగజ్ఞ శ్రీనాయకా! 78

షోడశదళపద్మసీసము

శ్రీరమాధీశ రక్షించరా గోపాల
కృష్ణ నీరజనేత్ర కేశిహరణ
శరనిధివరతల్ప గిరిధర హరి కామ
రోషాదికనిరస్త రుచిరపాద
మునివరవినుత మోహనరూపధర శౌరి
సంతతకళ్యాణ సరసవచన
పాకారిసోదర పరమకృపాపాంగ
సుందరవదన భాసురకపోల

గీ. రంగదరివీరమదభంగ రత్నకనక
భూషణస్ఫార రక్షితభూమిపాల



దివిజరంజనసంశీల దేవదేవ
రవిశతాలోక సుహుచిర రమ్యవసన! 79

ఉ. ఏగతి లేనినాపయి నొకించుక నీదయ సేర్పవేని నే
నేగతిఁ బోదు సర్వజగదేకశరణ్య మహానుభావ నీ
కాగజరాజుఁ గాచినమహాకృప నేఁ డెటు పోయె నో హరీ
రాఁగదె నిన్ను నామది నిరంతరమున్ స్మరియించుచుండెడిన్.

శ్రీమతే రామానుజాయ నమః

జానకీపతిశతకము

—:o:—

ఉ. శ్రీరమణీశ మీసుజనచిత్తసుఖప్రదసత్కటాక్షవీ
క్షారమణీయసంపదయె కారణమై పరికింపఁ బద్యముల్
గౌరవ మొప్పఁగాఁ బలుకఁ గాంచుట గాక కవిత్వశక్తి యే
తీరున సంఘటించుకొనఁ దీరునె నా కిది జానకీపతీ! 1

ఉ. శ్రీయుత సారసాప్తకులశేఖర కేశవ యోగిరాజ ని
శ్రేయసదానదక్ష సురసేవితపాదసరోజ సుందరా
జ్జాయతనేత్ర దానవకులాంతక పన్నగరాజతల్ప ని
న్నాయతభక్తిఁ గొల్చుసుగుణాఢ్యులఁ జేర్పుము జానకీపతీ! 2

ఉ. శ్రీశుకదాల్భ్యకశ్యపవశిష్ఠపరాశరవ్యాసముఖ్యమా
నీశవరార్చితాంఘ్రినవనీరజముల్ స్మరియించుమానపుం
డా శరజాతసంభవభవామరముఖ్యుల కందరాని భో
గీశశయాన తావకనికేతన మొందఁడె జానకీపతీ! 3

ఉ. పన్నగతల్ప నేను ఘనపాపుఁడ దుష్టుఁడఁ గ్రూరచిత్తుఁడన్
సన్నుతి కెక్కు మీ చరణసారసముల్ స్మరియించుబుద్ధి నా
కెన్నటి కైనఁ దావకకటాక్షులవంబునఁ గాని కల్గునే
యెన్నక నాయఘంబు కృప నెప్పుడుఁ జూడుము జానకీపతీ! 4

ఉ. రా రఘువీర నీకు దయరా దటరా యిఁక నెంతమాత్ర మే
నోరువనేర నేమి తెఱఁగో కరుణాకర యేమి సేతు నా
నేరము లెంచి రాకునికి నీతియె పాపుల నేలుకీర్తివి
స్తారము సీది కాదె మును సారసలోచన జానకీపతీ! 5

ఉ. అండజవాహ తాపకకరాంచలకార్ముకముక్తకాండముల్
కాండభవాసనాదిసురకాండము మెచ్చఁ బదాదికాండవే
దండరథాదియుక్తరిపుదానవకాండవిఖండనక్రమో
ద్దండత నొప్పునిన్ గొలుతు దాశరథీ హరి జానకీపతీ! 6

ఉ. నీరజసంభవుండు సుఖనిద్ర వహించినవేళ సోమకేం
ద్రారి తదీయవేదము లహంకృతి మ్రుచ్చిలి వార్ధిఁ జొచ్చినన్
వారిచరత్వవిస్ఫురణ వాని వధించి శ్రుతిప్రతానమున్
గూరిమిఁ గాచినట్టినినుఁ గోరి భజించెద జానకీపతీ! 7

ఉ. ధర్మము సుస్థితిన్ నిలుప ధారుణిఁ బంక్తిరథాత్మజుండ వై
నిర్మలకీర్తి యెల్లెడల నిండఁగఁ గౌశికయజ్ఞరక్షకై
దుర్మదతాటకం దునిమి దుష్టసుబాహునిఁ గూల నేసి నీ
కార్ముకవిద్య పెంపుఁ గనఁగా నొనరించితి జానకీపతీ! 8

చ. కుశికతనూజుతో మిథిలకున్ జని యచ్చట శంభుచాపమున్
యశ మొనఁగూడఁగా విఱిచి యెల్లజనంబులు మెచ్చ జానకీ
శశిముఖిఁ బెండ్లి యై యమితశౌర్యుని భార్గవరాము గెల్చి వా
నిశపథ మంతటన్ నిలిపి నీపురిఁ జేరితి జానకీపతీ! 9

ఉ. కైకనెపంబునన్ వెడలి కాంతయుఁ దమ్ముఁడుఁ దోడ రా మహా
భీకర మైనకానన మభీతిని జొచ్చి ముసీంద్రకోటి న
వ్యాకులరీతిఁ బ్రోవ నభయం బిడి శూర్పణఖాఖ్యరాక్షసిన్
లోక మెఱుంగ ముక్కుఁజెవులున్ దునుమాడితి జానకీపతీ! 10

ఉ. చెల్లెలిముక్కుఁ జూచి యిది చెల్లునె రాముని కంచు ద్వైత్యులం
దెల్ల బలాఢ్యుఁ డైనఖరుఁ డేడ్తెఱ సైన్యముతోడ మార్కొనన్
భల్లపరంపరాహతి నభంగపరాక్రమలీలఁ ద్రుంచినా
వెల్ల సురల్ నుతింప పృథివీశ్వరశేఖర జానకీపతీ! 11

చ. అది విని పంక్తికంధరుఁ డహంకృతి మి మ్మెదిరింప లేక తా
మది వెఱఁ జెంది మంత్రి బహుమాయల నేర్పరి తాటకేయునిన్

వదలక తోడు ర మ్మనిన వాఁ డతిభీతిఁ జలించి మెల్లఁగా
నిది విను మోనిశాట యొక కేర్పడ నం చనె జానకీపతీ! 12

చ. వసుధను రామచంద్రుఁ డన వారిజనాభుఁడు గాని యన్యుఁడే
విసువక నాదుబుద్ధి విని వేగమె ప్రాణము గాచుకొమ్ము గా
ధిసుతు మఖంబుఁ గాచె నతిధీరు సుబాహునిఁ గూల్చి పిన్ననా
డసువులతోడ నన్విడిచె నంచు వచించెను జానకీపతీ! 13

ఉ. చెప్పిననీతు లెల్లఁ జెవిఁ జేర్పక చప్పున వాలు దూసి ని
న్నిప్పుడె ద్రుంతు నన్న యతఁ డీతనిచే మృతికంటె మేలు నా
కప్పర మేను చే నిహతి నందిన మోక్షము గల్గు నంచుఁ దా
నప్పుడె జాతరూపమృగ మై కనె సీతను జానకీపతీ! 14

చ. జనకజఁ జూచి యిట్టిమృగజాతి నెఱుంగను ప్రాణనాథ నా
మనవిని జిత్తగించి యనుమానముఁ జెందక పట్టి యి మ్మనన్
మనమున సంశయించి యిది మాయమృగం బని లక్ష్మణుం డనన్
విన కటు వెంబడింప నది వేగమె చిక్కక జానకీపతీ! 15

ఉ. చిక్కులఁ బెట్టుఁ జూచి యిది చిక్కఁ దటంచును బాణ మొక్కటన్
గ్రక్కునఁ గూల నేయ ధరఁ గ్రక్కదలం బడి లక్ష్మణా యనన్
మిక్కిలిభీతి లక్ష్మణుని మీఁదెస కంచిన రావణాసురుం
డక్కమలాక్షిఁ గొంచుఁ జన నాపె జటాయువు జానకీపతీ! 16

ఉ. ఆపినఁ గ్రోధవిహ్వలత నాతఁడు క్రూరశరంబు లేయ ను
ద్దీపిత రాక్ష సాయువులఁ దీయుజటాయువు న న్నెఱుంగవే
పాపపురక్ష సుండ యని పంతము లాడి పదాహతంబులన్
భూపతితంబుగా రథము పొల్పుఁ జేసెను జానకీపతీ! 17

ఉ. అంతటఁ బోక వాని కనకాంగదరత్నకిరీటపంక్తి నిం
తింతలుగా ధరం దొరుఁగ నెమ్ములు నెత్తురు మాంసఖండముల్
వింతలుగా నఖాగ్రముల వేగమె చిమ్మిన మూర్ఛ నొంది వా
డంతటఁ దేరి ఖడ్గహతి నాతనిఁ గూల్వఁగ జానకీపతీ! 17

చ. ఖగపతిపాటుఁ జూచి మదిఁ గంపిత యై విపులస్వనంబునన్
ఖగవరులార యున్నతనగాధిపులార మహోత్ములార నా
వగ పెఱిఁగించి రాము నిటు వైళమె తెం డని కుయ్యిడంగ నా
విగతయశుండు గొంచుఁ జనె వేగమె లంకకు జానకీపతీ! 19

చ. ఉపవనియం దశోక మయి యొప్పునశోకమునీడయందుఁ దా
నపుడు సమస్తభూతములు నాత్మల సీత కశోక మెప్పుడున్
విపులముగా నొసంగుఁ డని వేల్పుల వేఁడఁగ నుంచి యప్పు డా
యపయశుఁ డుంచెఁ గాపు నసురాంగనలన్ మును జానకీపతీ! 20

చ. కనకకురంగదానవుని ఖండనఁ జేసి నిజాశ్రమంబుకై
చనునెడ మీరు మధ్య ననుజన్మునిఁ గాంచి యిదేమి లక్ష్మణా
యనఁగ నతండు మీవదినె యంచె ననన్ మది సంశయించి యా
జనకజ కేమి చిక్కులు జనించునొకో యని జానకీపతీ! 21

చ. త్వరపడి వచ్చు మీవెనుకఁ దమ్ముఁడు రా నటజంబుఁ జేరి భా
స్కరుని వెలుంగు లేనిదివి కైరవమిత్రుడు లేనిరాత్రియున్
సరసత లేనిచందమున జానకి లేనినివాస మెంతయున్
విరసత నొందఁగా మదిని వేదన నొందుచు జానకీపతీ! 22

ఉ. హాజనకాధిరాజతనయా సుగుణాలయ యీ వనంబునన్
భూజలతాకుడుంగముల పొంతను డాఁగితొ నాదుచిత్త మే
యోజను నున్నదో యనుచు నొప్పుగఁ జూడ దలంచి యక్కటా
రాజనిభాస్య యిప్పు డిటు రాఁగదె యంచును జానకీపతీ! 23

ఉ. నవ్వుల కెన్నఁడైన మును నన్ను మొఱంగి యెఱుంగ దక్కటా
యివ్వని నేల డాఁగు నిది యెక్కడిమాట మృగాసురుండు దా
నవ్వనిఁ గూలువేళ నతఁ డావిధిఁ గూసినకూత కిప్పు డీ
నెవ్వగ సంభవించె నది నిక్క మటంచును జానకీపతీ! 42

చ. సరగున నెల్లచో వెదకి సారసలోచనఁ గాన కొక్కచో
శరరథరథ్యఖండముల సన్నిధిఁ గూలినపక్షినాథు ని

వ్వెఱపడి చూచి ని న్నిటుల భీకరవృత్తిని గూల్చినట్టియా
పరుసనివీఱఁ డెవ్వఁ డనఁ బల్కె నతం డిటు జానకీపతీ! 25

ఉ. మున్మర మైనమోసమున ద్రుచ్చిలి సీతను గొంచుఁ బోవ నే
నమ్మనుజాశితోఁ దొడరి యాహవరంగమునందు వాని ర
థ్యమ్ములఁ ద్రుంచి రొ మ్మవియఁ దాచియు వాని కిరీటపం క్తిఁ జూ
ర్ణమ్ముగఁ జేయ మూర్చిలియె రావణుఁ డంతట జానకీపతీ! 26

ఉ. అంతట మూర్ఛఁ దేరి విలయాంతకుక్రై వడిఁ జంద్రహాసముఁ
బంత మెలర్పఁ బూని ననుఁ బట్టుము లీగతిఁ ద్రెవ్వనేసి మీ [తా
కాంతను గొంచుఁ బోయె నిదె కాంచుఁడు కార్య మటంచుఁ బల్క
నంతట జీవముఁ విడచె నాశ్రితవత్సల జానకీపతీ! 27

చ. జనకుని మిత్రుఁ డీగతిని జానకిక్రై మృతిఁ జెంద నప్పు డ
య్యనఘుని కగ్నిసంస్కరణ మాదిగఁ గృత్యము లెల్లఁ దీర్చి పెం
పెనయఁగ మోక్షలక్ష్మి నెనయించి కబంధుని నంతమోఁదటన్
ఘనముగ శాపబంధనము ఖండనఁ జేసితి జానకీపతీ! 28

ఉ. ఖండితశాపుఁ జూచి దశకంఠు తెఱుం గెఱుఁగంగ వేఁడ మీ
రొం డన నేల వాని కదనోర్వి జయింపఁగఁ దోడు మీకు మా
ర్తాండసుతుండు గాఁగలఁడు నాతనికార్యము దీర్ప నంచు నా
ఖండలువీటికిం జనియెఁ గన్గొనుచుండఁగ జానకీపతీ! 29

చ. కరుణ దలిర్పఁగా శబరికాంక్షితముల్ దయఁ జేసి యున్న మి
మ్మరయఁగ భానుజుం డనుప నా హనుమంతుఁడు వచ్చి మ్రొక్కి
దరమున దీవనల్ గని ముదంబున మిమ్ము నెఱింగి భ క్తి వా [యా
నరపతి మిత్రుఁ జేసె మిము నమ్మి భజించుచు జానకీపతీ! 30

ఉ. మీ సతిఁ దెచ్చు టెంతపని మీకుఁ బరాక్రమశాలి యీ సుమి
త్రాసుతుఁ డట్టు లుండఁ గపిరా జొకఁ డేల మహాత్మ నేను వి
త్రాసిత రావణాధముని ధాత్రినిఁ గూలఁగఁ ద్రోచి జానకిఁ
భాసురవృత్తిఁ దెత్తు విను భానుజుసంగతి జానకీపతీ! 31

చ. ఇనపుఁబహూతనందనుల కేవిధి భేదము లేక యుండ నా
ఘనులకుఁ గాలవశ్యతను గల్గి విరోధము నాహవావనిం
బెనఁగియుఁ బెక్కుసార్లు మది భీతిలి ప్రాణముఁ గాచుకొంచుఁ గా
ననగిరి దుర్గదేశముల నంటి చరించుచు జానకీపతీ! 32

ఉ. భానుజుఁ డెట్టకేల కొకభంగిని శాపముచేత వాలి యా
కాననమధ్య నొప్పిననగంబునకుఁ జనుదేరఁ డంచుఁ దా
మానసమందు నెంచి యనుమానము మాని వసింప నిత్తఱిం
బూనికతోడ మీ బలము పొందును గాంచెను జానకీపతీ! 33

ఉ. వాలికతూపుచేత ఘనబాహుబలంబున సప్తతాళముల్
లీలను గూల్చునాతఁ డవలీల వధించును వాలి నన్న యో
నీలఘనాంగ మీ రఘుడు నేర్పున బాణము వింటఁ గూర్చి యు
ద్వేలపరాక్రమం బడరఁ ద్రెంచితి వప్పుడు జానకీపతీ! 34

ఉ. వంచనఁ జేసి కాని ధర వాలిని జంపఁగ రా దటంచు వా
రెంచిన భానుసూను నెదు రేర్పడఁ బంచి లతాగృహంబునం
బొంచి శరం బొకంటఁ బడఁ బూనికఁ దీర్చిన మెచ్చి భానుజుం
డంచితభక్తి మంత్రియుతుఁ డై ముద మందెను జానకీపతీ! 35

చ. ధరఁ బడియున్నవాలిఁ గని తార విలాపముఁ జెంది కుందఁగా
సరసత నీతివాక్యముల సంగతి దుఃఖము మాన్పి భానుజుం
గర మనురక్తి వాలి కిఁకఁ గాఁగలకార్యము లెల్ల యుక్తత
జేఱుపు మటన్నఁ జేసె నవి సాదరతం దగ జానకీపతీ! 36

చ. వనిఁ గపిరాజుఁ జేసి మును వాసరరాట్సుతు వాలినందనుం
బనుపడ యౌవరాజ్యమునఁ బట్టముఁ గట్టి విభుత్వ మొప్పఁగా
వినుఁ డిక వానకాల మిఁక వెల్లినవెంటనె సీతజాడకుం
బనుపుము వానరాధిపులఁ బల్వుర నంచును జానకీపతీ! 37

ఉ. ఈవిధి వానరాధిపుల కేర్పడఁ బల్కి సుమిత్రనందనుం
డావనిఁ దోడుగా నొకనగాంతికమందు వసించి చిత్తమం

దావనజాస్య సీత విపదంబుధి నెట్లు మెలంగుచుండునో
యేవిధిఁ గాంచువాఁడ నని యెంచుచు నుండఁగ జానకీపతీ! 38

ఉ. తమ్ముఁడు లక్ష్మణుం డొకవిధమ్మున ధైర్యముఁ జెప్పి రామ నీ
వమ్మనుజాశిఁ బోరఁ దెగటార్చి ఘన మ్మని యెంచఁ బోకు నీ
నమ్మినబంట నే నొకఘన మ్మగునమ్మున నీమహాస్థలిఁ
నమ్ముము ద్రుంచెదఁ బుధజనమ్ములు మెచ్చఁగ జానకీపతీ! 39

చ. అని యిటు లాప్రతాపనిధి యూడిన మే లగుశూర వాక్యముల్
మనసు కలంకఁ బోఁ దుడువ మానవనాయక మీరు సోదరుం
గని చనె వానకాల మిఁక గౌరవ మొప్పఁగ భానుజుండు నా
పని మది జ్ఞప్తి లే దనుచుఁ బల్కితి రీక్రియ జానకీపతీ! 40

ఉ. తా మది మోహ మంది రుమ తారయుఁ జాల వినోదసౌఖ్యతం
గామునిలీల నెంతయును గాలము పుచ్చుచు నుండెఁ గాని సు
గ్రామజుఁ గూల్చినట్టిభిదురాభశరం బిట నున్కి గానఁ డా
సోమరి ద్రెళ్లు చెప్పు మని సొంపుగఁ బల్కితి జానకీపతీ! 41

చ. అని చని లక్ష్మణుండు తపనాత్మజుఁ గాంచి యి దేమి బేల వై
మనమున రామచంద్రుపని మాని వసించుట పాకశాసనిఁ
వినిహతిఁ జేసినట్టిఘనవిశ్రుత బాణము రాముచేత నీ
దినమున నున్న దీ వెఱుఁగు దిట్టముగా నన జానకీపతీ! 42

చ. మనమున భీతిఁ జెంది హనుమత్సునలాంగదనీలముఖ్యకా
ననచర లాది యైనతను నమ్మిన మంత్రులు తోడు రా మహా
గుణనిధి యైనలక్ష్మణునిఁ గూడి భవత్పదపద్మముల్ గనుం
గొనఁ జనుదెంచి మ్రొక్కి మదిఁ గొంకుచు నిట్లనె జానకీపతీ! 43

ఉ. రామ గుణాభిరామ ఖలరాక్షసభీమ మదీయదోషముల్
మీమదిఁ జేర్పఁగా వలదు మీసతిజాడ కనేకవానరస్త్రీ
మముఁ బిల్వఁ బంపితిని శూరులు వా రట వచ్చుదాఁక నే
నేమరి యుంటిఁ ద ప్పిదియ యేలుము న న్నని జానకీపతీ! 44

చ. వినయముతోడ భానుజుఁడు విన్నపముం దగఁ జేయుచుండఁ బా
వనియును లక్ష్మణుండు నిది వాస్తవమే యన నంతలోపలన్
వనగిరినిమ్న గాభ్రితటవాసవనాటులు లెక్క కెక్కు వై
వనజహితాత్మజుం గనఁగ వచ్చినఁ గాంచితి జానకీపతీ! 45

ఉ. వచ్చినసేనఁ జూచి కపివర్యుఁడు మెచ్చుచు రామచంద్ర యీ
వచ్చినవీరు లొండొకఁడె బాహుబలంబున దైత్యసేనలన్
వ్రచ్చి నఖంబులం జఱచి వాలములం బడఁ గ్రుమ్మి ముష్టులన్
మెచ్చుచు మీరు గన్గొనఁగ మేదినిఁ గూల్తురు జానకీపతీ! 46

ఉ. వానరవీరవర్యుల యవారితవిక్రమ మిట్లు సెప్పుచున్
భానుసుతుండు నెమ్మని నపారముదంబున మీకు మ్రొక్కి మీ
యానతి సర్వపట్టణవనాదులతో నెట నైన జానకిన్
మీనయ మొప్పఁగా వెదకి మెప్పుగ రం డని జానకీపతీ! 47

చ. శతబలి నుత్తరంబునకు సైన్యముతోఁ దగఁ బంచినట్లుగా
వితతబలుఁ సుషేణు హితవేదిని బశ్చిమదిక్కు కేఁగఁగా
నతిబలశాలి యవ్వినత నాక్రియఁ దూర్పున కేఁగఁ బంచి మా
రుతతనయాంగదాదుల నిరూఢబలాఢ్యుల జానకీపతీ! 48

ఉ. దక్షిణదిక్కుకై పనుపఁ దా మది నెంచిన రామ మీర లీ
దక్షులలోన శౌర్య ఘనుఁ ధైర్యసమర్థునిఁ గార్యవేది దాం
తిక్షమసత్యముఖ్యుని నతిప్రియు మారుతిఁ గాంచి వత్స నీ
వాక్షితిజాతఁ జూడఁగలవాఁడ వటంచును జానకీపతీ! 49

ఉ. ముద్రికఁ గొమ్ము నీ వనుచు మోదముతోఁ దగుదీవనల్ సదా
భద్రముగా నొసంగి తనపాణి వెలింగెడుముద్ర నివ్వ ని
ర్నిద్రపరాక్రముం డగుచు నేఁగె బలీముఖకోటితో మహో
పద్రవ మొంద దిక్కులకుఁ బావని యంతట జానకీపతీ! 50

ఉ. దక్షిణదిక్కుకై చనినధైర్యసమగ్రులు గాక కొంద ఱా
ఋక్షబలీముఖాదిపతు లేపు దొఱంగి మహీజఁ గాన మా

దక్షత చాల దయ్యె రిపువర్పహరా యని వేఁడి మ్రొక్కఁగా
నాక్షణమందుఁ బల్కె నలినాప్తసుతుం డిడు జానకీపతీ! 51

ఉ. అంగద వాయునందను లవారితవేగులు వార్ధి లన్నియుం
జంగున దాటఁగాఁ గలరు సత్యము జానకిఁ జూచి వత్తు రే
భంగము లేనివారికి ధ్రువం బిది నమ్ముము రామచంద్ర మీ
యంగన సేమ మంతయును నెల్లిటఁ గాంతుము జానకీపతీ! 52

చ. తపనజుఁ డిట్లు పల్క ఘనధైర్యసమగ్రత నుండ వానరా
ధిపతి వనంబుఁ బెంచెడుదధీముఖుఁ డార్తిని మీకు మ్రొక్కి సం
తపితమనస్కుఁడై రవిసుతా విను వాయుసుతాదు లిప్పు డే
విఫలగఁ జేసె మీవనము వింటివిగా యన జానకీపతీ! 53

చ. అది విని మిమ్ముఁ జూచి విపులాధిప రామ మహానుభావ మీ
మది నిఁక సంతసింపఁదగుమర్కటనాథులు సీతఁ గాంచి తా
మదిఁ బెనగొన్న మోదమున మా వన మిట్టులొనర్చిఁ గాని యీ
త్రిదశులుఁ దేరి చూడఁగలరే యని మెచ్చుచు జానకిపతీ! 54

ఉ. ఓరి దధీముఖుండ విను మోర్చితి వారలతప్పు లిప్పుడే
వారిని వేగ రమ్మనుచు వైళమె చెప్పు మటన్నఁ జెప్ప నా
శూరులు వచ్చి రప్పు డతిచోద్యముగా ధరఁ ద్రుళ్లి యాడుచున్
మారుతపుత్రుపై ఘనసుమంబులు చల్లుచు జానకీపతీ! 55

ఉ. వచ్చుచుఁ గంటి సీత్త నని వందనముం దగఁ జేయుమారుతిన్
మెచ్చుచు ముందు నుంచుకొని మీయెదురం రహి గొల్చియున్న వా
ర చ్చెరు వంద సీత తెఱఁ గంతయు జెప్పు మటంచుఁ జిత్తమున్
నొచ్చినమోము వాంచి విన నొల్లక వింటిరి జానకీపతీ! 56

చ. జనకజవార్త లెల్లను నిజం బని నమ్మఁ దదీయరత్నమున్
వినయముతోడ నివ్వఁ గొని వెక్కస మైనవియోగతాపముం
బెనగొనియున్నచిత్తమును బెం పగుధైర్యముతోడ నిల్పి పా
వనిఁ గని మెచ్చి రామ యిటుఁ పల్కితి వేర్పడ జానకీపతీ! 57

V.R. NARAYANA REDDY MEMORIAL LIBRARY Acc. No.

ఉ. నీ విట జాంబవన్ముఖుల నేర్పరులం గొని యేఁగు టాదిగా
భూవిదితస్థితిన్ మరలి పొందుగ వచ్చిన యింతలోపలన్
ఏవిధిచే మెలంగి పను లేక్రియఁ జేసితి చెప్పవే యనం
బోవని చెప్పఁ బూని పొలుపారఁగ మ్రొక్కుచు జానకీపతీ! 58

ఉ. దండితశత్రుమండలులు ధైర్యవినిర్జితమేరుమందరుల్
భండనరుద్ర లద్రిసమబంధుర దేహులు వానరాధిపుల్
గండకశల్యకాసరమృగాదనసింహయుతాటవుల్ మహో
ద్దండతఁ జొచ్చి చూచి వనితామణిఁ గానక జానకీపతీ! 59

ఉ. పల్లెలపట్టణంబులను బర్వతకంధరసానుదేశముల్
భిల్లనివాసముల్ లతలపెల్లునఁ జీఁకటి లైనపూపొదల్
ఎల్లనదీనదంబుల ననేకనివాసములందు నోధరా
వల్లభ యెల్లభంగి తమవల్లభఁ గానఁగ జానకీపతీ! 60

ఉ. వారిధిఁ జేరి యాడ నొక పక్షివరుం గని వానిచేత నే
మారయ లంకలోన జనకాత్మజ యుండు టెఱుంగ నీ మహా
శూరులు నన్నుఁ బంపుటకు సొంపుగఁ బుష్పసువర్ణరత్నభూ
పారుచియుక్తుఁ జేసి చని సమ్మతి రమ్మన జానకీపతీ! 61

ఉ. ధారుణిలోనఁ బెద్ద లొకదారిని గూడినవేళఁ బిన్నవాఁ
డరయ వారిఁ గొల్చి పను లన్నియుఁ దీర్చుట న్యాయమే కదా
తారకనామరామ తమదాసుల కెల్లను బిన్న నైనస
న్నే రయ మెప్పు నీపనికి నేర్పుగఁ బంపిరి జానకీపతీ! 62

ఉ. తావకపాదముల్ మదిని దాసులయాజ్ఞ శిరంబునందు మీ
పావన మైననామమును వాక్కునఁ జేర్చి మహోత్సవంబుగా
నా వనరాశి జంగ గొని యచ్చట లంఖణిఁ జంపి లంకకుం
బోవఁగఁ బ్రొద్దు గ్రుంకె నటు పోలఁగ నేఁ జని జానకీపతీ! 63

ఉ. పట్టణరాజసౌధగృహపానసికేతనమందిరాదులన్
నెట్టనఁ గేళికావనుల నేలబిలంబుల నెల్లఁ జూచి యే

పట్టున జానకిం గన నుపాయముఁ దోఁచక పోవుచుండఁగా
నట్టిల నయ్యశోకవని నాదెసఁ గాంచితి జానకీపతీ! 64

చ. కని వనిలోనఁ జొచ్చి యటఁ గాంచితి నొక్కయశోకమూలమం
దనయము శోకసంవృతమృగాంగనపోలిక దుష్టరాక్షసీ
జనపరివేష్టితం జనకజాతను గాంచి ప్రభాత మైనయా
ఘనతరశాఖలం దెవరుఁ గానక యుంటివి జానకీపతీ! 65

ఉ. ఆజగదంబరూప సుగుణావలి కట్లు విధాత నిర్దయ
భూజముక్రింద దుష్టఫలభుక్కునతుల్ వెత లందఁ జేయఁగా
నా జలజాస్య కష్టదశ యంతని చెప్పుదు రామ యంతలో
నా జలజా ప్తమిత్రుఁ డపరాద్రికి నేఁగెను జానకీపతీ! 66

చ. ఖరకరుఁ డస్తమించెనిఁక గాంతుఁడు రాఁగలఁ డంచు దిక్సతుల్
సరసతఁ బూనుకాటు కన సర్వదిశల్ గడు నించి చీఁకటుల్
సుచిరమా క్తికంబు లన సొంపునఁ దోఁచెను దార లాక్షుపా
కరుఁ డరుదెంచెఁ దెల్వి గనఁగా దిశ లెల్లను జానకీపతీ! 67

ఉ. అంతట నిద్రఁ జెందె దనుజాంగన లప్పుడు నేను వృక్షమ
సంతస మొప్పఁగా దిగి సుసాదరతం దగ మ్రొక్కి సీతకుం
జింత దొలంగ మీ శుభముఁ జెల్వుగఁ జెప్పిన సంశయించి తా
నెంతయు మీశుభాంకముల నేర్పడఁ గోరెను జానకీపతీ! 68

ఉ. కోరినరీతి నేను దమకుం గలలక్షణశీలవృత్తముల్
గారవ మొప్ప లక్ష్మణునకుం గలసద్గుణవృత్తి భానుజుం
డారయ మీకు నాప్తుఁ డగు టంతయుఁ జెప్పి మదీయరూపవి
స్తారముఁ జూపి యింతి మది సమ్మతిఁ జేసితి జానకీపతీ! 69

చ. కపివర సంశయం బుడిగెఁ గాంతుఁ డి టొన్నడు వచ్చు వచ్చి నా
కపకృతిఁ జేసినట్టిఖలు ఖండితు నెప్పుడు సేయుఁ జేసి స
త్కృప ననుఁ గొంచుఁ దా నగరి కెప్పుడు చేరును జేరి సౌఖ్యముల్
నృపవరుఁ డెన్నఁ డొందు నని నెవ్వగఁ బల్కుచు జానకీపతీ! 70

ఉ. డెందము గంద లక్ష్మణుని డిల్లపడ న్ మును నిష్ఠురంబు లా
డందగుతత్ఫలంబు నిపు డంతయుఁ గంటి నటంచుఁ జెప్పి యా
చందము డెందమం దిడక సైపు మటంచును బల్క కోప మా
రం దగఁ జేయు ముద్దులమరందికి నం చని జానకీపతీ ! 71

చ. రుచిరకలాపతం దగుశిరోమణి మె చ్చగునాసవాలుగా
సుచరిత మానసీయ తమసుందరి యిచ్చుచు నన్నుఁ బంప నే
నిచటికి వచ్చుచో నపుడు నిర్జరవైరిని జూచి నీతు లే
నచలితరీతిగాఁ బలుక నాత్మఁ దలంచితి జానకీపతీ ! 72

చ. వనము పెకల్చి చంప వనపాలకులన్ విని దైత్యసేన రా
వణుఁ డనుపన్ గడంగి ఘన బాణపరంపరతోడ మార్కొనన్
మనమున సంస్మరించి మిము మార్తులఁ గూల్చినఁ దోడ మంత్రినం
దనులు ససైన్యులై కవియ ధారుణిఁ గూల్చితి జానకీపతీ ! 73

ఉ. ఈవిధి రాక్షసాధిపు లనేకులు కూలినఁ గ్రోధమూర్ఛతన్
రావణుఁ డంప నక్షయుఁ డరాతిభయంకరుఁ డాజిఁ గూలె నా
నావిధయుద్ధనైపుణిఁ బెనంగి భవత్కరుణాప్తి గల్గునా
చే విని పుత్రుచావునకుఁ జింతిలి దైత్యుఁడు జానకీపతి ! 74

ఉ. పుత్రుని నింద్రజిత్తుఁ గని పోయి విరోధిని గెల్చి రమ్మనన్
క్షాత్రముమీఱ వచ్చి ననుఁ సంగరకేళి నెదిర్చి పోర నే
నాత్రిదశాదులన్ దునుమ నేమి ప్రయోజన మంచు నూరకే
శత్రునిచేతఁ జిక్కితి దశాస్యునిఁ జూడఁగ జానకీపతీ ! 75

ఉ. చిక్కిననన్నుఁ బట్టుకొని చేరి దశాస్యునిముందు పెట్టినన్
రక్కసుఁ డెంతయున్ దనదురాజస మొప్పఁగ మంత్రిఁ జూచి వీఁ
డెక్కడ వానరుం డనఁగ నెక్కుడుఁ గోపముఁ జెంద కేను నా
రక్కసుతోడ నోరి వినరా యని చెప్పితి జానకీపతీ ! 76

ఉ. లోకభవస్థితుల్ లయము లోలతఁ జేయువిధీశవిష్ణువుల్
యేకమలేశు నంశభవు లే మహనీయుఁడు దుష్టశిక్షకై

యాకమలోద్భవాదిసుర లందఱు వేఁడిన రామమూర్తిగాఁ
బ్రాకటరీతి నున్నఘనుబంటను రా విను జానకీపతీ! 77

ఉ. చెల్లెలిముక్కు గోసిననుఁ సి గ్గొకయింతయు లేక దొంగ వై
మెల్లనఁ బొంచి యుండి మది మీఁ దెఱుఁగ్గ వల నేది రామునిఁ
వెల్లగఁ జేసి సీతను బవిత్రను నీతలకోఁతకే గదా
తెల్లమి గాఁగఁ దెచ్చు టని ధీరత నాడితి జానకీపతీ! 78

ఉ. రామునియాజ్ఞ లేకునికి రావణ నీ కిటు లుండఁ గల్గె లే
దా మనుజాశనా నిను విదారితుఁ జేయఁగ రాముబాణ మే
లా మద మెల్ల మాపి నిను లాఘువ మొప్పఁగఁ గోట మీఁట నే
నామహితాత్మ్మ రాము శరణార్థివి గ మ్మని జానకీపతీ! 79

ఉ. చెప్పిన ధైర్యఁ డాగ్రహముఁ జెంది జరాలున వాలు దూసి ని
న్నిప్పుడె త్రుంతు నం చెదుర నీతియుతుండు విభీషణుండు దా
నప్పుడె మాన్ప రక్కసుల నందఱఁ గన్గొని వీనివాలమ్ము
నిప్పు దగిల్చి త్రిప్పుఁ డని నీతివిహీనత జానకీపతీ! 80

ఉ. వారలు నట్లు సేయుతఱి వాలమునందు వెలుంగునగ్ని మీ
సారకృపా సుధాకరునిచందముగాఁ గడు చల్ల నైన నే
నారజనీచరుల్ బెగడ నంతట బంధము లూడ్చి వారల
సూరసుతాలయంబునకు సొంపుగఁ బంపితి జానకీపతీ! 81

ఉ. పట్టణసౌధగేహరథవారణరాజతురంగశాలలఁ
నెట్టన రత్నధాన్యధననృత్యశరాసనశాల లాదిగా
బెట్టుగఁ గాల్చితిం రిపులు భీతిల వాలకృశానుకీలచే
నిట్టివిధంబుఁ జేసి తటిసిశునిఁ జేరితి జానకీపతీ! 82

ఉ. వాలము నీట ముంచి చని వారిజలోచన సీతఁ గాంచుచో
నాలవణాబ్ధి దాఁటి యట నంగదజాంబవదాది వీరులుం
మేలన వారిఁ గూడి యిట మీ పదపద్మము లాశ్రయించితిం
జాలము మాని వేగమె దశాస్యునిఁ జంపుము జానకీపతీ! 83

ఉ. పావని విన్నవింప విని భానుజుఁ జూచి ప్లవంగసేనకున్
నీ విపు డేర్పరింపు మన నీలుని నాయకుఁ గాఁగ లంకకుం
జేవ యెలర్పఁ బోవలయు శీఘ్రుమె గెల్తుము వైరివీరులం
గావున నీముహూర్త మధికం బన నప్పుడు జానకీపతీ! 84

చ. తపనజుఁ డట్లు సేయ వినతాసుతు నెక్కొడిరీతి మారుతిన్
నిపుణత మీర లక్ష్మణుఁడు నేర్పున నంగదు నెక్కి తోడ రా
నపరిమితప్లవంగవిభు లార్చుచు వృక్షము లెక్కి దూకుచున్
విపినము సంచలింపఁ గడు వేగముతోఁ జని జానకీపతీ! 85

ఉ. వారిధి చెంతఁ జేరి తనవారిని బాసి విభీషణుం డహో
తారకరామనామ తమదాసునిగాఁ గృపఁ జూచి కావవే
క్రూరుఁడ రావణానుజుఁడఁ గోరితి మీశరణం బటన్న స
త్కారము మీఱఁగా నభయదాన మొసంగితి జానకీపతీ! 86

చ. ఇనజవిభీషణాంగదుల కిష్టముగా జలధీశు దారి వేఁ
డిన నతఁ డివ్వకున్కని గడింది శరం బరి బోయ భీతిచే
విసయముతోడ వేఁడఁ గృపపెంపున నానలుచేత సేతువుం
బనుపడ నేర్పరించి చని బంధురశక్తిని జానకీపతీ! 87

ఉ. లంకకుఁ జుట్టునుం డిగి బలంబులతోఁ బవనాత్మజాంగదుల్
శంక దొఱంగి పశ్చిమదిశా యముదిక్కునఁ దూర్పువైపునన్
బంకము మీఱు నీలుఁడును భానుజుతోఁ దమ రుత్తరంబునన్
బింకముతోడ నిల్చితిరి భీతిల శత్రులు జానకీపతీ! 88

ఉ. అత్తటి సంధికిం బనుప నంగదుఁ డాదశకంఠుఁ జేర వీఁ
డిత్తటి వచ్చె నెవ్వఁ డొకో యీకపి యన్న నతండు నోరి ని
నత్తటి వాలముం బెనఁచి యబ్ధుల ముంచినవాలిపుత్రుఁడన్
జిత్తము తెల్విఁ జెంది విను చెప్పెద నం చని జానకీపతీ! 89

ఉ. న్యాయము దప్పి యిట్లు చెడ న్యాయము కాదు దురాత్మ యీదినా
రాయణమూర్తి రామవిభుఁ డాజనకాత్మజ యీదిలక్ష్మి నీ

వాయతభక్తి రామునిశరణార్థివి గమ్మటు గాక యున్న నీ
కాయము కంకగృధ్రముల కౌ నని చెప్పెను జానకీపతీ! 90

ఉ. చెప్పిన నిప్పుఁ ద్రొక్కుకపిచెల్వున లేచి దశాననుండు మీ
రిప్పుడు వీనిఁ బట్టుఁ డన నీసున లేచి సురారు లొక్కటం
జప్పుడు సేయుచుం దొడరఁ జంపియు సౌధముఁ గూలఁ దన్ని తా
నప్పుడె చెప్పె మీకు దనుజాధముచేఁతలు జానకీపతీ! 91

ఉ. శ్రీరఘురామ మీరు కపిసేనల లంకకు నెల్లదిక్కు ల
శ్శూరత ముట్టడింప రణశూరులు గోపురసౌధదేహప్రా
కారసభాప్రపాశయనకాంచనరత్నరథేభసాధనా
గారము లెల్లఁ గూలఁగ నగాదుల వైచుచు జానకీపతీ! 92

ఉ. తూరుపువాకిటన్ వెడలి దోర్బలలీలఁ బ్రహస్తముఖ్యబృం
దారకవైరు లార్ప్చుచు గదాపరిఘాదుల వానరావలిన్
నేరుపు మీఱఁ గూల్పఁ గని నీలుఁడు రోషకషాయితాక్షుఁ డై
ఘోరత నద్రిశృంగహతిఁ గూల్చెను వారల జానకీపతీ! 94

ఉ. పాయక వాలిసూనుఁడు సుపార్శ్వున కంపెను సర్వరోమునిర్
సాయకశక్తిఖడ్గగదచక్రవిశారదు లైనయమ్మహా
కాయనరాంతకాదుల నఖండబలంబునఁ గూల్చెఁ గాదె మీ
శ్రీయుతసత్కృపామహిమ జీవదయాపర జానకీపతీ! 95

ఉ. కుంభవిరూపలోచను లకుంఠితవిక్రమదైత్యకోటిసం
రంభతఁ గొల్వఁ గీశనికరంబులఁ గూల్వఁగఁ జూచి విక్రమా
రంభవనాటవీరులు దురంబునఁ దోడుగ వారి నందఱుం
గుంభినిఁ గూల్చె భానుజుఁడు కోపము మీఱఁగ జానకీపతీ! 96

చ. త్రిశిరసురాంతకాదు లతితీవ్రజవంబున సైన్యకోటితో
దిశలు దలంపఁ దాఁకుటయుఁ దీవ్రత వాయుజుఁ డానిశాటుల
దశననఖాంఘ్రివాలకరశాడనల గిరిజాతనంబుల
దశముఖుఁ డెంతయున్ వగవ ధారుణిఁ గూల్పఁడె జానకీపతీ! 97

ఉ. రావణకుంభకర్ణమక రాక్షుల శూరతఁ బేరుగొన్నను
గ్రీవవిభీషణద్వివిద కేసరిసేలనలాంగదాది శూ
రావళిచేతఁ జిక్కనిసురారుల నెల్ల రణాంగణంబునం
దావక బాణహేతులను దగ్ధముఁ జేసితి జానకీపతీ! 99

చ. రవిశశిసాగరంబులు ధరాస్థలి నుండెడునంతకాలమున్
వివిధసమస్తభోగములు పెంపుగ నొందుచు సాధువృత్తిచే
దివిజులు మెచ్చ లంకకు నధీశునిఁ జేసి విభీషణాహ్వయున్
భువిసుతఁ దేరఁ బంపఁ జని పొందుగఁ దెచ్చెను జానకీపతీ! 100

ఉ. వచ్చిన సీతపావనత వైళమె లోక మెఱుంగఁజేసి మీ
రచ్చుగఁ బుష్పకంబుపయి నర్కజుఁ డాదిగ వానరాధిపుల్
మచ్చికతో విభీషణుఁడు మంత్రులు భృత్యులు తోడ రా సురల్
మెచ్చ నయోధ్యఁ జేరితిరి మీఱినవేడ్కతో జానకీపతీ! 101

చ. లలితవిలాసవైఖరి నలంకృతిఁ జేయఁగఁ బంచి పట్టణం
బెలమిని మంత్రిపుంగవుల నెల్లజనంబుల బాంధవాళిఁ
సలలితవాద్యఘోషముల సౌమ్యత మీఱఁగ సైన్యయుక్తుఁ డై
చెలువుగ లక్ష్మణానుజుఁడు చేరి భజింపఁగ జానకీపతీ! 102

చ. భరతుఁడు భక్తిసంభరితభావముతోఁ దమపాదుకాద్వయిఁ
శిరమునఁ జేర్చి మీరెదురఁ జేరి నమస్కృతిఁ జేసి దేవ మీ
చరణయుగంబురీతి నను సమ్మతి నేలిన వీనిఁ గొ మ్మ్మనం
గర మనురక్తిఁ గైకొనుచుఁ గౌఁగిటఁ జేర్చితి జానకీపతీ! 103

ఉ. సన్నిధిఁ బిన్నతమ్ముఁ డిటు సాఁగిలి మ్రొక్కిన గారవించి మీ
రెన్నిక వారిఁ గూడి దనుజేశకపీశుల సద్గుణాళి ము
న్నెన్నుచు రావణాదిదనుజేంద్రులఁ గూల్చుట లెల్లఁ జెప్పుచున్
మన్ననఁ జేసి పౌరులను మంత్రియుతంబుగ జానకీపతీ! 104

చ. సరసత మీఱఁ బట్టణపుసౌధములన్ సరసావలోకవి
స్ఫారణవచోవిలాసములు సొంపు వహింపఁగఁ గాంచి సన్నుతుల్

కర మనుర క్తిఁ జేయుచును గాంతలు మా క్తికపుష్పపుంజముల్
కరములఁ గొంచుఁ జల్లఁ జని కాంచితి తల్లుల జానకీపతీ! 105

చ. కని ముద మంది తల్లులకుఁ గాంతయుఁ దమ్ముఁడు మీరు మ్రొక్కి
వన మగుదీవనల్ గని శుభప్రదు లైనయయుంఛతీపతిం [పా
ఘనముగఁ బూజఁ జేయ సనికప్రియుఁ డై మిము గారవించి యి
ట్లని వినుతించె సర్వజను లాత్మల మెచ్చుఁగ జానకీపతీ! 106

చ. సతతము భూజనావళికి సమ్మతి గాఁగ ధరాధిపత్యమున్
వితతవిభూతిఁ గైకొనుము వేడుక నన్న వశిష్ఠునాజ్ఞచే
నతిముద మంది సమ్మతిల నత్తఱి మంత్రులు భానుజాదు ల
ద్భుతముద మంది యత్నములు పూని యొనర్చిరి జానకీపతీ! 107

చ. లలితదరస్మితేక్షణవిలాసము లొప్పుఁగ బుణ్యభామినుల్
విలసితరీతి మిమ్ముఁ బృథివీసుతతోడ ననేకరత్నభూ
షల మృదుకాంచనాంబరసుసంగతగంధములన్ సుమంబులన్
వెలయ నలంకరించి బలువేడుక నొందుచు జానకీపతీ! 108

ఉ. అత్తటిఁ దూర్యముల్ మొలఁగ సర్వసమీరపితామహాత్మజుల్
చిత్తము లుల్లసిల్లఁ గపిసింహులతోడ విభీషణుండు రా
జోత్తము లైనకేకయులు శుద్ధగుణుల్ జనకాదిబంధువుల్
మొత్తము గాఁగ మీనగరమోసల నిల్చిరి జానకీపతీ! 109

ఉ. ఒప్పెడురత్నకాంచనసమున్నతపుష్పరథోత్తమంబుపై
నొప్పులు గుల్క నెక్కఁగ మహోత్సుకు లై భరతుండు శత్రుఘ్నుల్
మెప్పగుచామరద్వయి సుమిత్రాశిశుల్ పవనాత్మజుండు దా
నొప్పినపాదుకల్ గొనిమె మూర్జితభ క్తిని జానకీపతీ! 110

చ. మతిసురమంత్రితుల్యుఁడు సుమంత్రుఁడు మంత్రి రథంబు నేర్పుగా
నతిమృదురీతితో నడుప నాగర కాంతలు రత్నహారతుల్
కుతుకముతోడ నివ్వ స్మేరకుంజరులాది సమస్తబాంధవుల్
విత్తతవినోదవాద్యముల వేడుకఁ గాంచుచు జానకీపతీ! 111

చ. చని మృదురీతి దేవసభచాల్పున నొప్పుచు నున్నతత్సభాం
గణమునఁ దేరు డిగ్గి జనకాత్మజతో నృపుఁ డా వశిష్ఠుఁ డ
త్యనుపమప్రేమ మీఱఁగఁ దదంతరరత్నసువర్ణపీఠిపై
నునిచి మునుల్ నృపుల్ ముదము నొందుచు మెచ్చఁగ జానకీపతీ!

ఉ శ్రీరఘువీర నేను మును చేసినపుణ్యము నెంచ నాలుఁ గై
దారును వేయునోళ్లఁ కమలాసనశంభుకుమార శేషులుల్
నేరరు మీరు న న్గరుణ నెంచి గురుం డని సంశ్రయింపఁగా
నీరజగర్భశంకరులు నీదయ గానరు జానకీపతీ! 113

చ. వనచరకూర్మసూకరులవై ఖరి నొందుచు వేఁడ మందర
క్ష్మోణుల నుద్ధరించుతఱి సోమకుఁ గూల్చి సురాది తేయసం
తానముఁ గాచి గర్వబలధైర్యసమగ్రు హిరణ్యనేత్రినిం
ద్రాణ చెడంగఁ ద్రుంచితివి ధార్మికవత్సల జానకీపతీ! 114

ఉ. డింభకుఁ గావఁగా మును కడిందిపరాక్రమరుద్రమూర్తి వై
స్తంభమునన్ జనించి త్రిదశద్విషుఁ డైన హిరణ్యకశ్యపున్
శంభువిరించిముఖ్యసురసంఘము విస్మయ మొంద ఘోరసం
రంభనృసింహరూపున ధరం బడఁ జీల్చవె జానకీపతీ! 115

చ. సుమహితశక్తి వామనత సొంపు వహింపఁగఁ గాశ్యపుండ వై
వినుతు లెఱుంగకుండ బలి వేఁడి పదత్రయధాత్రి దానికై
కమలభవాండ మెల్ల నధికంబుగ నిండిన నీతివిక్రమ
క్రమ మెఱుఁగంగ నెవ్వరితరంబు కృపానిధి జానకీపతీ! 116

ఉ. రామ ధరాస్థలిం బరశురాముఁడ వై నృపకోటి నెల్ల సం
గ్రామధరన్ వధించి రుధిరంబు తటాకము లైదు నించి యీ
భూమి సమస్తము న్నిఖిలభూసురకోటికి నిచ్చినట్టియా
స్వామివి నీవు కావె రిపుభంజన శ్రీవర జానకీపతీ! 117

చ. హలధర కృష్ణవేఖరుల సురారుల దుష్టధరాధినాథుల
గలన వధించి బుద్ధతను గైకొని శంకరుచేఁ బురస్కృతుం

బొలియఁగఁ జేసి కల్కితను వొందుచు ధర్మముఁ గావఁ బూని దో
ర్బలమున మ్లేచ్ఛబర్బరకిరాతులఁ గూల్పవె జానకీపతీ! 118

ఉ. లాలితపుణ్యతీర్థసలిలంబులు చేకొని వామదేవజా
బాలివశిష్ఠముఖ్యమునివల్లభు లర్కజమారుతాత్మజుల్
నీలవిభీషణాదు లవనీపతు లెల్ల సురల్ స్తుతింప సు
శ్రీలలితంబు గాఁగ నభిషేకముఁ జేసిరి జానకీపతీ! 119

ఉ. ఈవిధి సర్వరాజ్యమున కెల్ల విభుత్వము నొందుమీదయ
శ్రీవిభవాయురున్నతియు సేమ మకోగత పుత్రపౌత్ర నా
నావిధధాన్యరత్నధననవ్యదుకూలసువర్ణవేశ్మసా
ధావళి లోనుగా జనులు ధన్యత నొందిరి జానకీపతీ! 120

ఉ. ఈకపు లెల్ల నాకపులు నిందిర యీజనకాత్మజాత నీ
వాకమలాసనుం గనినపన్నగశాయివి తమ్ము లెల్ల సు
శ్లోకభవత్కళాంశులు లోకముఁ గావఁగ నెంచి రాక్షసా
నీకముఁ గూల్చి లోకముల నేలఁగఁ బుట్టితి జానకీపతీ! 121

ఉ. దీనజనావనా మును నదీశజఁ గూడి యహీనశయ్యపై
భానుసహస్రతేజమున భాసిలి సూత్రవతీశుఁ డాదిగా
మానితనిత్యముక్తులు సుమాపతిముఖ్యులఁ గొల్వ నొప్పునీ
వీనరరూప మెందుట సవిస్మయ మయ్యెడు జానకీపతీ! 122

చ. సరసిజనాభ సంసరణసాగరమగ్నుఁడ నైననాకు నీ
చరణసరోజసంస్మరణసద్ఘనావ నొసంగి తీరమున్
సరగునఁ జేర్పవే సుగుణసాగర భక్తజనార్తిదూర న
న్నరయ నుపేక్ష సేయఁ దగునా కరుణానిధి జానకీపతీ! 123

ఉ. మీదయ దప్పెనేని ఘనమేరువు రేణువుకంటె నీద మా
ఆదయ గల్గెనేనియణు వైనను మేరువుకంటె నెక్కువా
గాదె నిదర్శనంబు బలగర్వసమర్థులు బ్రహ్మరుద్రులల్
మేదినిఁ గూలెఁ గోతులకు మిక్కిలి లోఁబడి జానకీపతీ! 124

V.R. NARLA MEMORIAL LIBRARY P.R.I. Acc. No.

ఉ. రామ హరీ ముకుంద రఘురామ జనార్దన వాసుదేవ శ్రీ
రామ దురంతపాతకవిరామ జగన్నుతనామ వారిద
శ్యామదినేంద్రవంశకలశాంబుధిసోమ వికుంఠధామ సీ
తామహిళామనఃకమలధామనిధీ విధు జానకీపతీ! 125

చ. జలరుహనాభ రామ తమసత్కృప నొక్కయఖండచంపకో
త్పలములదండ మీచరణతామరసంబుల కర్పితంబుగా
సలలితరీతిఁ జేసితిని సన్మునివంద్య మహానుభావ నా
వలనను నేరముల్ మఱచి వైళమె ప్రోవుము జానకీపతీ! 126

ఉ. శ్రీరమణీశ కేశవ కుశేశయ మిత్రకులాబ్ధిచంద్ర బృం
దారకబృందవందితపదాంబుజ నూపురరత్నబింబిత
స్ఫారదిగీశమౌళిమణీసంచయ భోగిశయాన రామ యో
కారుణికాగ్రగణ్య ననుఁ గావుము మ్రొక్కెద జానకీపతీ! 127

ఉ. శ్రీరమణీకళత్ర శశిశేఖరమిత్ర సురారిజైత్ర గో
త్రారిసునీలగాత్ర వినతాత్మజపత్ర సరోజనేత్ర గో
తారమణీతనూజముఖతామరసాంబుజమిత్ర భక్తహృ
త్తైకరవకైరవాప్త జగదాత్మక మ్రొక్కెద జానకీపతీ! 128

ఉ. మంగళ మూర్విజామృదుసమంచితమానసవారిజాతసా
రంగ నతార్తిభంగ ఖగరాజతురంగ శుభాంగ దుర్మర
త్నాంగదహారరమ్యమకుటాదికలాపకలాప సత్యశ్రీ
మంగళ మొప్పె మీకు హనుమత్ప్రియ నిత్యము జానకీపతీ! 129

సంపూర్ణము.

BCU

AOUA103B 133

BC

ముద్రణ ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనావళిక

పుస్తకం సంఖ్య	AOUA103B133
పుస్తకం పేరు	శతకమంజరి
తారీఖు	31 December 2025
ముందు అట్ట	
వెనుక అట్ట	
మొత్తం పేజీలు	
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	
లేని పేజీలు	
తయారు చేసినది	
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపినది	

SARANYA